


జాతీయ తెలుగు దినపత్రిక

ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

ఆదిలాబాద్

మంచిర్యాల-కుమరం భీం-నిర్మల్

శుక్రవారం 4 సెప్టెంబర్ 2026 పేజీలు : 8


# విద్యా సంస్థలలో అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలి

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల, 3 సెప్టెంబర్ (ప్రజాజ్యోతి):** విద్యాభివృద్ధిలో భాగంగా విద్యా సంస్థలలో చేపట్టిన అభివృద్ధి పనులు వేగవంతం చేసి త్వరగా పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. జిల్లాలోని భీమిని మండల కేంద్రంలో గల కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంను గురువారం సందర్శించి అదనపు గదులు, భోజనశాల నిర్మాణ పనులను పరిశీలించి త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు అవసరమైన సకల సదుపాయాలు కల్పిస్తూ నాణ్యమైన విద్య అందించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఈ క్రమంలో విద్యార్థులకు మెనూ ప్రకారం పౌష్టిక ఆహారం అందించాలని, పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు నాణ్యమైన విద్యా బోధన చేయాలని తెలిపారు. పాఠశాలలో విద్యారుల సంఖ్య పెంపొందించాలని, విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని తెలిపారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయాన్ని సందర్శించి ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో నోటీసుల జారీ, ఓటర్లు సమర్పించిన వివరాల పరిశీలన అంశాలను పరిశీలించారు.


# మన్నికగా ఉండేలా నిర్మాణ నాణ్యత నిర్ధారించాలి




నిర్మించిన కొన్నాళ్లకే పగుళ్లు! భవనాన్ని పరిశీలించి వాస్తవాలు వెలుగులోకి తేవాలని డిమాండ్

జైత్‌పూర్‌బోర్డ్ గ్రామపంచాయతీ కార్యాలయ భవనంపై నాణ్యతా అనుమానాలు

ప్రభుత్వ భవనానికే ఈ దుస్థితి ఏమిటంటున్న,స్థానికులు, గ్రామస్థులు



ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండలం జైత్‌పూర్‌బోర్డ్ గ్రామపంచాయతీ కార్యాలయ భవనం నిర్మించిన కొంతకాలానికే గోడలకు పగుళ్లు ఏర్పడటం స్థానికంగా

# సహకార సంఘం చైర్మన్‌గా ముత్యాల శ్రీనివాస్‌కు ఘన సన్మానం



# అతివలకు అండగా ఆదిలాబాద్ షీ టీం



ఆగస్టు నెలలో 136 ఫిర్యా దులకు స్పందన

5 ఎఫ్ఐఆర్‌లు, 117 ఈ- పెట్టి కేసులు

163 హాట్‌స్పాట్లలో ఆకస్మిక తనిఖీలు 14 మందికి కౌన్సెలింగ్ 2 బాల్యవివాహాలను అడ్డుకున్న షీటీం

జిల్లా వ్యాప్తంగా 48 అవగాహన కార్యక్రమాలు

ఉత్తమ ప్రతిభ కనబరిచిన షీ టీం సిబ్బందికి ప్రశంస పత్రాలు, నగదు రివార్డులు

మహిళలు, విద్యార్థినుల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలి

# ఫ్రెషర్స్ డే వేడుకల్లో కొక్కిరాల సురేఖ

## విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో ఉన్నత లక్ష్యాలను సాధించాలి






**మంచిర్యాల, సెప్టెంబర్ 3 (ప్రజాజ్యోతి):** మంచిర్యాల నియోజకవర్గం పరిధిలోని మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ 15వ డివిజన్‌లో ఉన్న మంచిర్యాల గార్డెన్‌లో అభ్యాస జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఫ్రెషర్స్ డే వేడుకలకు మంచిర్యాల జిల్లా మాజీ డీసీసీ అధ్యక్షురాలు శ్రీమతి కొక్కిరాల సురేఖ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థులు నిర్వహించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను ఆమె వీక్షించారు. అనంతరం విద్యార్థులతో ఆత్మీయంగా ముచ్చటించారు. కొత్తగా కళాశాలలో అడుగుపెట్టిన విద్యార్థులకు ఫ్రెషర్స్ డే శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థి దశ ఎంతో కీలకమైనదని, ఈ దశలో క్రమశిక్షణ, పట్టుదల, నిరంతర కృషితో ముందుకు సాగుతూ ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని సాధించాలని సురేఖ ఆకాంక్షించారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు విద్యతో పాటు సాంస్కృతిక, ఇతర సృజనాత్మక కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు. విద్యార్థులు తమ ప్రతిభను మరింతగా అభివృద్ధి చేసుకుని భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆమె ఆకాంక్షించారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధర్ని మధుకర్, డిప్యూటీ మేయర్ సల్ల రమ్య-మహేష్, మంచిర్యాల మార్కెట్ కమిటీ చైర్మన్ రామగిరి బానేష్, స్థానిక కార్పొరేటర్ చింతపండు శ్రీనివాస్, టీపీసీసీ సభ్యులు, నస్పూర్ పట్టణ ఇన్‌చార్జి నూకల రమేష్, కళాశాల కరస్పాండెంట్ రమణ, ప్రిన్సిపల్ ఆర్. శ్రీనివాస్, డైరెక్టర్లు సత్యనారాయణ రెడ్డి, డాక్టర్ సుధాతి-గిరీష్, మానయ్య, కళాశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# సహకార సంఘం చైర్మన్‌గా ముత్యాల శ్రీనివాస్‌కు ఘన సన్మానం

## మున్నూరు కాపు బిడ్డకు కీలక బాధ్యత దక్కడం గర్వకారణం: మున్నూరు కాపు సంఘం నాయకులు



**దండెపల్లి, సెప్టెంబర్ 3 (ప్రజాజ్యోతి):** నెల్కి వెంకటాపూర్ సహకార సంఘం నూతన చైర్మన్‌గా ఎన్నికైన మున్నూరు కాపు ముద్దుబిడ్డ ముత్యాల శ్రీనివాస్‌ను గురువారం దండెపల్లి మండలం మెదరిపేట మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు ముత్తినేని మల్లేష్ మాట్లాడుతూ.. ముత్యాల శ్రీనివాస్ సహకార సంఘం చైర్మన్‌గా ఎన్నిక కావడం పట్ల మున్నూరు కాపు సమాజం గర్వంగా ఉందన్నారు. రైతుల సంక్షేమం, సహకార సంఘం అభివృద్ధి కోసం చిత్తశుద్ధితో పని చేస్తూ సభ్యుల నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని ఆకాంక్షించారు. మున్నూరు కాపు యువత రాజకీయ, సామాజిక, సహకార రంగాల్లో ముందుకు వచ్చి ప్రజాసేవలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సహకార సంఘం ద్వారా రైతులకు మరింత మెరుగైన సేవలు అందించి, వారి సమస్యల పరిష్కారానికి చైర్మన్ ముత్యాల శ్రీనివాస్ కృషి చేయాలని నాయకులు కోరారు. తనపై నమ్మకంతో చైర్మన్ బాధ్యతలు అప్పగించిన ప్రతి ఒక్కరికీ శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మెదరిపేట మున్నూరు కాపు సంఘం నాయకులు, ప్రతినిధులు, యువకులు, సంఘం సభ్యులు తదితరులు పాల్గొని నూతన చైర్మన్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

# వీధి వ్యాపారుల ఆర్థిక బలోపేతమే ధ్యేయం

**జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ రామ్ గోపాల్**



**నిర్మల్ జిల్లా ప్రతినిధి ,సెప్టెంబర్ 3 ,(ప్రజాజ్యోతి ).** వీధి వ్యాపారులను ఆర్థికంగా బలోపేతం చేసి, వారికి చేయూత అందించేందుకు అమలు చేస్తున్న లోక్ కళ్యాణ్ మేళా కు సంబంధించి భైంసా మున్సిపల్ కార్యాలయంలో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ రామ్ గోపాల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సెప్టెంబర్ 1 నుండి 30, 2026 వరకు దేశవ్యాప్తంగా ప్రత్యేక స్వనిధి ప్రచారం, లోక్ కళ్యాణ్ మేళా మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని పురపాలక సంఘ పరిధులలోనూ, వివిధ బ్యాంక్ శాఖలలోనూ అర్హులైన వీధి వ్యాపారులకు బ్యాంక్ రుణాలు అందించడమే ధ్యేయంగా ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నామని అన్నారు. వీధి వ్యాపారాలను మరింత విస్తరించుకోవడానికి అలాగే ఆర్థిక స్వావలంబన సాధించడానికి ప్రభుత్వం అందిస్తున్న ఈ స్వనిధి పథకం ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి వీధి వ్యాపారి ఈ మేళాను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధికారులు కుమార్, నరేష్ బాబు, ప్రియమ్ జీత్ సింగ్, తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

# క్షయ వ్యాధిని సకాలంలో గుర్తిస్తే పూర్తిగా నివారించవచ్చు

**సంగ మల్లయ్యపల్లి వార్డులో వైద్య శిబిరం.. 135 మందికి పరీక్షలు**

**మూడు మొబైల్ ఎక్స్‌రే మిషన్లతో మారుమూల ప్రాంతాల్లో విస్తృతంగా పరీక్షలు**

**జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్**



**మంచిర్యాల, 3, సెప్టెంబర్ (ప్రజా జ్యోతి):** క్షయ వ్యాధిని సకాలంలో గుర్తించి, పూర్తిస్థాయిలో చికిత్స అందిస్తే వ్యాధిని పూర్తిగా నివారించవచ్చని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్ తెలిపారు. క్షయ వ్యాధి నియంత్రణలో భాగంగా నస్పూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని సంగ మల్లయ్యపల్లి వార్డులో గురువారం ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించారు. క్షయ వ్యాధిగ్రస్తులను గుర్తించేందుకు ప్రత్యేకంగా ఎక్స్‌రే మిషన్‌ను ఏర్పాటు చేసి 135 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ వైద్య శిబిరాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్, ఉప జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుధాకర్ నాయక్, స్థానిక కార్పొరేటర్ సుధాకర్, వైద్యాధికారి వెంకటేష్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ నరేందర్ రాథోడ్ మాట్లాడుతూ.. తెమడతో కూడిన దగ్గు, తెమడలో రక్తం, జ్వరం, రాత్రిపూట చెమటలు పట్టడం, ఆకలి మందగించడం, బరువు తగ్గడం వంటి లక్షణాలు కనిపించినప్పుడు ఏమాత్రం నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అదేవిధంగా శరీరంలోని ఏదైనా భాగంలో వాపు, శారీరక ఆరోగ్యంలో ఆకస్మిక మార్పులు కనిపించినా వెంటనే వైద్యులను సంప్రదించాలని తెలిపారు. క్షయ వ్యాధిని సరైన సమయంలో గుర్తిస్తే తప్పకుండా నివారించవచ్చని, ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. శిబిరంలో అనుమానితులను పరీక్షించడంతో పాటు క్షయ వ్యాధిగ్రస్తులకు మందులు అందజేసి, వ్యాధిపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించినట్లు తెలిపారు. జిల్లాలో క్షయ వ్యాధి నియంత్రణ కోసం మూడు మొబైల్ ఎక్స్‌రే మిషన్లను వినియోగిస్తూ మారుమూల ప్రాంతాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నట్లు డీఎంహెచ్‌వో వెల్లడించారు. గ్రామీణ, మారుమూల ప్రాంతాల్లోని ప్రజలకు సైతం క్షయ వ్యాధి పరీక్షలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. స్థానిక ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల సహకారంతో క్షయ వ్యాధిగ్రస్తులను గుర్తించి, వారికి అవసరమైన పోషకాహార కిట్లు అందించేందుకు ముందుకు రావాలని డాక్టర్ నరేందర్ రాథోడ్ కోరారు. క్షయ వ్యాధిగ్రస్తులకు చికిత్స పూర్తయ్యే వరకు ప్రతి నెల రూ. 1,000 చొప్పున పోషక భత్యం అందిస్తున్నట్లు తెలిపారు. క్షయ వ్యాధికి సంబంధించిన పరీక్షలు, మందులు పూర్తిగా ఉచితంగా అందిస్తున్నామని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. క్షయ వ్యాధి నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, "టీబీ ఓడిపోతుంది.. దేశం గెలుస్తుంది" అనే నినాదంతో ముందుకు సాగాలని డీఎంహెచ్‌వో పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్, క్షయ వ్యాధి కోఆర్డినేటర్ సురేందర్, సాయి రెడ్డి, ఆశా కార్యకర్తలు, ఆరోగ్య కార్యకర్తలు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఎవరు కార్మికుల కోసం పోరాడుతున్నారో.. ఎవరు ప్రచారానికే పరిమితమవుతున్నారో కార్మికులకు తెలుసు

## 23 డిమాండ్లపై అగ్రిమెంట్లు సాధించాం.. అమలు జరిగే వరకు ఏఐటీయూసీ పర్యవేక్షణ

### ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య

**మంచిర్యాల, 3, సెప్టెంబర్ (ప్రజాజ్యోతి):** సింగరేణి కార్మికుల హక్కులు, సంక్షేమం, ఉద్యోగ భద్రత కోసం ఏఐటీయూసీ చేపట్టిన పోరాటం ఫలితంగా యాజమాన్యంతో 23 ప్రధాన డిమాండ్లపై అగ్రిమెంట్లు సాధించామని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య అన్నారు. సింగరేణి శ్రీరాంపూర్ ఏరియాలోని నస్పూర్ నరసయ్య భవన్‌లో జరిగిన ఏఐటీయూసీ జనరల్‌బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం జూన్ 8న ఏఐటీయూసీ సమ్మె నోటీసు ఇచ్చిందని, అనంతరం ప్రాంతీయ కార్మిక కమిషనర్ సమక్షంలో సింగరేణి యాజమాన్యంతో పలుమార్లు చర్చలు జరిపి సమస్యల పరిష్కారానికి ఒత్తిడి తీసుకువచ్చామని తెలిపారు. ఈ చర్చల ఫలితంగా కార్మికులకు ప్రయోజనం కలిగించే అనేక కీలక అంశాలపై యాజమాన్యం అంగీకరించిందన్నారు. కార్మికులకు లభించే అలవెన్సులు, పెర్క్స్‌పై విధించే ఆదాయపు పన్నును యాజమాన్యమే భరించేలా అంగీకారం సాధించామని, సర్వీసులో సహజ మరణం పొందిన కార్మికుడి కుటుంబానికి అదనంగా రూ.20 లక్షలు అందించేలా నిర్ణయం తీసుకున్నారని సీతారామయ్య తెలిపారు. కార్మికుల వైద్య సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు ప్రతి నెలా మెడికల్ బోర్డు నిర్వహించేందుకు అంగీకరించారని, 2025--26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన సంస్థ వాస్తవ లాభాలను దసరాలోపు ప్రకటించేందుకు అవసరమైన ప్రభుత్వ అనుమతులు తీసుకుని చర్యలు చేపట్టనున్నారని చెప్పారు. ట్రాన్స్‌ఫర్లలో అమలులో ఉన్న మూడేళ్ల నిబంధనను తొలగించి ఖాళీల ఆధారంగా ఏడాది నిబంధనతో బదిలీలు చేపట్టేందుకు, అర్హులైన సీనియర్ మైనింగ్ స్టాఫ్‌కు ఓవర్‌మ్యాన్ ప్రమోషన్లు కల్పించేందుకు యాజమాన్యం అంగీకరించిందన్నారు. కార్మికులు, వారి కుటుంబాలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు హైదరాబాద్‌లో సింగరేణి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఏర్పాటు అంశంపై యాజమాన్యం సానుకూలంగా స్పందించిందని తెలిపారు. సుమారు 22 ఏళ్లుగా మార్పులేని మెడికల్ అటెండెన్స్ నిబంధనలను సవరించేందుకు, సర్వీసు నుంచి దిగిపోయిన కార్మికులకు ఓపీతో పాటు వారం రోజుల వరకు చికిత్స అందించేలా చర్యలు తీసుకునేందుకు అంగీకారం కుదిరిందన్నారు. సింగరేణి విద్యాసంస్థల్లో సీబీఎస్ఈ సిలబస్ అమలుకు చర్యలు, గనుల్లో అవసరమైన సేఫ్టీ మెటీరియల్‌ను సకాలంలో అందుబాటులో ఉంచడం, మందమర్రి--క్యాతన్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలో పనిచేసే కార్మికులకు 9 శాతం హెచ్ఆర్ఏ కల్పించడం వంటి అంశాలపై కూడా అంగీకారం సాధించామన్నారు. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న డిస్మిస్ కార్మికుల కేసులను హెచ్‌పీసీ కమిటీ ద్వారా పరిష్కరించేందుకు, అర్హత కలిగిన మైనింగ్ స్టాఫ్‌కు సర్ఫేస్‌లో సూటబుల్ ఉద్యోగాలు కల్పించేందుకు చర్యలు తీసుకోనున్నారని తెలిపారు. సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులందరికీ ఈఎస్ఐ వైద్య సదుపాయం కల్పించడం, పెండింగ్‌లో ఉన్న డిపెండెంట్ ఉద్యోగాల కేసులను పరిష్కరించడం, ఉద్యోగులు ఈవెనింగ్ కాలేజీల్లో చదువుకునేందుకు అవసరమైన ఎన్‌ఓసీలు జారీ చేయడం, క్లారికల్, ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, పారామెడికల్, ఎస్అండ్‌పీసీ సెక్యూరిటీ గార్డులు, ఎలక్ట్రికల్, మెకానికల్ సూపర్వైజర్లు తదితర ఖాళీ పోస్టులను భర్తీ చేసేందుకు చర్యలు తీసుకోవడం వంటి అంశాలు కూడా ఒప్పందాల్లో ఉన్నాయని తెలిపారు . ఈపీ ఫిట్టర్లు, ఎస్‌డీఎల్ ఆపరేటర్లు, సర్వేయర్లు తదితర క్యాడర్ స్కీమ్ సమస్యలను పరిశీలించి పరిష్కరించేందుకు యాజమాన్యం అంగీకరించిందన్నారు. మెడికల్‌గా ఫిట్ అయినప్పటికీ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న 149 మంది డిపెండెంట్లకు నెల రోజుల్లోపు ఆఫీస్ ఆర్డర్లు జారీ చేయనున్నారని తెలిపారు. కార్మికుల సొంత ఇంటి పథకం అమలుపై ప్రభుత్వంతో చర్చించి నిర్ణయం తీసుకోవడంతో పాటు, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల్లో అమలవుతున్న విధానాలను పరిశీలించేందుకు అంగీకరించారని చెప్పారు. చట్టబద్ధమైన సమ్మెలో పాల్గొనే కాంట్రాక్ట్ కార్మికులకు నో వర్క్--నో పే మాత్రమే అమలు చేసి అదనపు జరిమానాలు విధించకుండా ఉండేందుకు కూడా అంగీకారం కుదిరిందన్నారు. జూన్ 8న ఇచ్చిన సమ్మె నోటీసు, ఆర్ఎల్‌సీ సమక్షంలో జరిగిన చర్చలు, యాజమాన్యంపై కొనసాగించిన నిరంతర ఒత్తిడి ఫలితంగానే ఈ 23 అంశాలపై అగ్రిమెంట్లు




సాధ్యమయ్యాయని సీతారామయ్య అన్నారు. కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో ఏఐటీయూసీ అనుసరిస్తున్న పోరాట పద్ధతికి ఇది నిదర్శనమన్నారు. అయితే ఏఐటీయూసీ సాధించిన అగ్రిమెంట్లపై సీఐటీయూ, హెచ్ఎంఎస్, టీబీజీకేఎస్ తదితర సంఘాలు విమర్శలు చేయడం సరికాదన్నారు. సోషల్ మీడియాలో విమర్శలు చేయడం, ఇతరులు సాధించిన ఫలితాలను తమ పోరాట ఫలితాలుగా ప్రచారం చేసుకోవడం సులభమని, కానీ యాజమాన్యం ముందు నిలబడి కార్మికుల సమస్యల పరిష్కారం కోసం పోరాడి అగ్రిమెంట్లు సాధించడం అంత సులభం కాదన్నారు. "ఎవరు కార్మికుల కోసం పోరాడుతున్నారో.. ఎవరు కేవలం ప్రచారానికే పరిమితమవుతున్నారో సింగరేణి కార్మికులకు స్పష్టంగా తెలుసు" అని సీతారామయ్య అన్నారు. యాజమాన్యంతో సాధించిన అంగీకారాలు కాగితాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో పూర్తిస్థాయిలో అమలయ్యే వరకు ఏఐటీయూసీ పర్యవేక్షణ కొనసాగుతుందని స్పష్టం చేశారు. కార్మికులకు రావాల్సిన ప్రతి హక్కు, ప్రతి ప్రయోజనం అందే వరకు యూనియన్ రాజీలేని పోరాటం కొనసాగిస్తుందని తెలిపారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ డిప్యూటీ జనరల్ సెక్రెటరీలు కందికట్ల వీరభద్రయ్య, ముస్కే సమ్మయ్య, బ్రాంచి సెక్రెటరీ ఇస్తే బాజీ సైదా, వైస్ ప్రెసిడెంట్ కొట్టే కిషన్‌రావు, జాయింట్ సెక్రెటరీ రాచర్ల చంద్రమోహన్, మైనింగ్ స్టాఫ్ నాయకులు వంగరి రాజేశ్వరరావు, జీఎం చర్చల ప్రతినిధులు బద్రి బుచ్చయ్య, బాలకృష్ణ, శ్రీనివాస్, సురేష్, గొర్రె నర్సయ్యతో పాటు పిట్ సెక్రెటరీలు, గని, డిపార్ట్‌మెంట్ కమిటీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# చేపల పెంపకంతో అదనపు ఆదాయం

## కుంటల్లో చేపలు పెంచి ఉపాధి పొందాలి : కలెక్టర్ హరిత

**ఆసిఫాబాద్, సెప్టెంబరు 3 ప్రజా జ్యోతి** స్వయం సహాయక సంఘాల మహిళలు, ఉపాధి కూలీలు చేపల పెంపకం ద్వారా అదనపు ఆదాయం పొందుతూ ఉపాధి అవకాశాలను మెరుగు పరచుకోవాలని జిల్లా కలెక్టర్ కె.హరిత సూచించారు. గురువారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ ఆవరణలో చేప పిల్లల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో వి.బి.జి. రామ్‌జీ పథకం కింద నిర్మించిన పంట, నీటి, ఊట కుంటల్లో చేపల పెంపకాన్ని ప్రోత్సహించేందుకు ప్రధానమంత్రి కె.ఎ.ఎస్.వై. ద్వారా జల్ జీవిక స్వచ్ఛంద సంస్థ చేప పిల్లలను పంపిణీ చేసింది. జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి దత్తారావుతో కలిసి కలెక్టర్ హరిత లబ్ధిదారులకు చేప పిల్లలను అందజేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వ్యవసాయ భూముల్లో కుంటలు నిర్మించుకుని చేపల పెంపకం చేపడితే రైతు కుటుంబాలతో పాటు ఉపాధి కూలీలకు అదనపు ఆదాయం లభిస్తుందన్నారు. చేప పిల్లలను అందించేందుకు ముందుకొచ్చిన జల్ జీవిక సంస్థను అభినందించారు. లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



కార్యక్రమంలో ప్రాజెక్టు అధికారి ఆంజనేయులు, జల్ జీవిక సంస్థ సంచాలకుడు పద్మాకర్, సిబ్బంది, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# సేవా కార్యక్రమాలతో డాక్టర్. కళ్లెం వెంకట్‌రెడ్డి జన్మదిన వేడుకలు







పేద పిల్లలకు ఉచితంగా సైకిళ్ల పంపిణీ..

**ఆదిలాబాద్ టౌన్, సెప్టెంబర్ 3 (ప్రజాజ్యోతి)** ఆదిలాబాద్ పట్టణంలోని ప్రముఖ వైద్యుడు డాక్టర్ కళ్లెం వెంకట్‌రెడ్డి జన్మదిన వేడుకలు గురువారం భుక్తాపూర్ లోని తన ఆసుపత్రి ఆవరణలో కుటుంబ సభ్యులు, విద్యార్థులు, సిబ్బంది సమక్షంలో ఘనంగా నిర్వహించారు. డాక్టర్.వెంకట్ రెడ్డి కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలు జరుపుకున్నారు.తన జన్మదినాన్ని పురస్కరించుకొని పేద పిల్లలకు ఉచితంగా సైకిళ్లు పంపిణీ చేశారు. అలాగే అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. 'మానవసేవే మాధవసేవ' అనే దృక్పథంతో ప్రతి ఏటా తనకు తోచినంతగా పేదలకు, విద్యార్థులకు సహాయం చేస్తూ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.డాక్టర్ కళ్లెం వెంకట్‌రెడ్డికి పలువురు ప్రముఖులు, కుటుంబ సభ్యులు, స్నేహితులు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసి అభినందించారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు కళ్లెం భూమారెడ్డి--జయశ్రీ, సతీమణి డాక్టర్ జీవిత, పిల్లలు, ఆసుపత్రి సిబ్బంది, మిత్రులు,మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

# లైఫ్ సర్టిఫికెట్ నమోదు చేసుకోండి.. సీపీఆర్ఎంఎస్ వైద్య సేవలు పొందండి

## శ్రీరాంపూర్ ఏరియాలో 1,381 మంది విశ్రాంత ఉద్యోగుల లైఫ్ సర్టిఫికెట్లు పెండింగ్

### పొరపాట్లు జరిగినా మరోసారి ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలి

### శ్రీరాంపూర్ ఏరియా డీజీఎం (పర్సనల్) ఎస్. అనిల్‌కుమార్



**మంచిర్యాల, 3, సెప్టెంబర్ (ప్రజా జ్యోతి):** సింగరేణి సంస్థ విశ్రాంత ఉద్యోగులకు అందిస్తున్న సీపీఆర్ఎంఎస్ వైద్య సేవలను నిరంతరం పొందేందుకు ప్రతి ఏడాది నవంబర్ మాసంలో లైఫ్ సర్టిఫికెట్‌ను ఆన్‌లైన్‌లో తప్పనిసరిగా రెన్యూవల్ చేసుకోవాలని శ్రీరాంపూర్ ఏరియా డీజీఎం (పర్సనల్) ఎస్. అనిల్‌కుమార్ సూచించారు. లైఫ్ సర్టిఫికెట్ ఆన్‌లైన్ ప్రక్రియ సక్రమంగా పూర్తయిందో లేదో విశ్రాంత ఉద్యోగులు ఒకసారి సరిచూసుకోవాలని, ఏవైనా పొరపాట్లు జరిగినా వెంటనే మరోసారి సక్రమంగా నమోదు చేసుకోవాలని ఆయన కోరారు. సింగరేణి సంస్థ విశ్రాంత ఉద్యోగులకు అందిస్తున్న సీపీఆర్ఎంఎస్ కార్డు ద్వారా వైద్య సేవలు పొందేందుకు ప్రతి సంవత్సరం నవంబర్ మాసంలో లైఫ్ సర్టిఫికెట్ రెన్యూవల్ చేయడం తప్పనిసరి. నవంబర్ మాసంలో ఆన్‌లైన్‌లో లైఫ్ సర్టిఫికెట్ సమర్పించిన విశ్రాంత ఉద్యోగులు మాత్రమే సీపీఆర్ఎంఎస్ సేవలకు అర్హులవుతారు. అయితే పలువురు విశ్రాంత ఉద్యోగులు నిర్ణీత సమయంలో ఆన్‌లైన్‌లో లైఫ్ సర్టిఫికెట్ నమోదు చేసుకోకపోవడం, అలాగే ఆన్‌లైన్‌లో నమోదు చేసే సమయంలో వివరాల్లో పొరపాట్లు చేయడం వల్ల సీపీఆర్ఎంఎస్ వైద్య సేవలు పొందడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని డీజీఎం తెలిపారు. శ్రీరాంపూర్ ఏరియాలోనే 1,381 మంది విశ్రాంత ఉద్యోగుల లైఫ్ సర్టిఫికెట్ నమోదు పెండింగ్‌లో ఉన్నట్లు ఆయన వెల్లడించారు. గనుల వారీగా పరిశీలిస్తే ఎస్ఆర్‌పీ-1 గనిలో 101 మంది, ఎస్ఆర్‌పీ-3 గనిలో 163 మంది, ఆర్కే-5 గనిలో 219 మంది, ఆర్కే-6 గనిలో 234 మంది, ఆర్కే-7 గనిలో 174 మంది, ఆర్కే-8 గనిలో 44 మంది, ఆర్కే-ఎన్‌టీ గనిలో 176 మంది, ఐకే-1ఏలో 75 మంది, ఎస్ఆర్‌పీ ఓసీలో 43 మంది ఉన్నారు. వీరితో పాటు వివిధ విభాగాలకు చెందిన మరికొందరు విశ్రాంత ఉద్యోగుల లైఫ్ సర్టిఫికెట్ నమోదు కూడా పెండింగ్‌లో ఉన్నట్లు తెలిపారు. లైఫ్ సర్టిఫికెట్ నమోదు చేయకపోవడం లేదా ఆన్‌లైన్ ప్రక్రియలో పొరపాట్లు చేయడం వల్ల విశ్రాంత ఉద్యోగులు సింగరేణి సంస్థ అందిస్తున్న సీపీఆర్ఎంఎస్ వైద్య సేవలను కోల్పోయే పరిస్థితి ఏర్పడకుండా ముందస్తుగా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. ఇప్పటి వరకు ఆన్‌లైన్‌లో లైఫ్ సర్టిఫికెట్ నమోదు చేసుకోని వారు, అలాగే ఇప్పటికే నమోదు చేసినప్పటికీ ప్రక్రియలో ఏవైనా పొరపాట్లు జరిగిన వారు వెంటనే మరోసారి ఆన్‌లైన్‌లో లైఫ్ సర్టిఫికెట్‌ను సక్రమంగా నమోదు చేసుకోవాలని డీజీఎం (పర్సనల్) ఎస్. అనిల్‌కుమార్ కోరారు. విశ్రాంత ఉద్యోగులు తమ లైఫ్ సర్టిఫికెట్ నమోదు స్థితిని సరిచూసుకుని, ఎలాంటి సమస్యలు లేకుండా సీపీఆర్ఎంఎస్ కార్డు ద్వారా సింగరేణి సంస్థ అందిస్తున్న వైద్య సేవలను నిరంతరం పొందాలని ఆయన సూచించారు.

## ఉపాధ్యాయుల సేవలు అభినందనీయం: రఘునాథ్ వెరబెల్లి



**మంచిర్యాల, సెప్టెంబర్ 3 (ప్రజాజ్యోతి):** సెప్టెంబర్ 5న ఉపాధ్యాయుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మంచిర్యాల పట్టణంలోని గర్మిళ్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులను బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు రఘునాథ్ వెరబెల్లి, 12వ డివిజన్ కార్పొరేటర్ కస్తూరి నాగరాజు గురువారం సన్మానించారు.ఈ సందర్భంగా రఘునాథ్ వెరబెల్లి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తూ, వారి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయుల కృషి అభినందనీయమన్నారు. విద్యార్థులు ఉపాధ్యాయులు చూపిన మార్గంలో నడుస్తూ క్రమశిక్షణతో విద్యనభ్యసించి తమ ప్రతిభను చాటుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అమిరిశెట్టి రాజ్‌కుమార్, కస్తూరి నాగరాజు, బుద్దారపు రాజమౌళి, పల్లి రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీల ఎన్నిక.



**దండేపల్లి, సెప్టెంబర్ 03(ప్రజాజ్యోతి ) :** దండేపల్లి మండలం నర్సాపూర్, అల్లీపూర్,గూడెం గ్రామాల ఎమ్మార్పీఎస్ కమిటీలను గురువారం ఎన్నుకున్నట్లు మండల అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు ఆవుల శ్రీనివాస్,జిల్లపెల్లి వినయ్ లు తెలిపారు. గూడెం గ్రామ కమిటీ అధ్యక్షుడుగా శతరాజీ మల్లేష్, అధికార ప్రతినిధిగా మాదుగుల బాపన్న, ప్రధాన కార్యదర్శి కూటికెలా రవి కుమార్, గౌరవ అధ్యక్షుడుగా శాతరాజీ రమేష్, ఉపాధ్యక్షుడిగా అంతర్పుల వెంకటేష్, కోశాధికారిగాశతరాజీ శంకరయ్య, అల్లీపూర్ గ్రామ కమిటీ అధ్యక్షుడుగా లింగాల గణేష్, అధికార ప్రతినిధిగా తగరపు రాజేష్, ప్రధాన కార్యదర్శిగా లింగాల శివ సాయి కృష్ణ, ఉపాధ్యక్షుడిగా ఊరడీ నగేష్,కోశాధికారిగా లింగాల రాములు, కార్యదర్శులుగా లింగాల దామోదర్, శాతరాజీ సత్తయ్య, నర్సాపూర్ గ్రామ కమిటీ అధ్యక్షుడుగా శాతరాజీ స్వామి, అధికార ప్రతినిధిగామంతెన చంద్రయ్య, ప్రధాన కార్యదర్శిగా దండేం సాయి, గౌరవ అధ్యక్షుడుగా దుమల సత్తయ్య, ఉపాధ్యక్షుడిగా భీమరాజు, కోశాధికారిగామంతెన తిరుపతి, ప్రచార కార్యదర్శిగా దుమాల శ్రీకాంత్ లను ఎన్నుకున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శనిగారపు మురళి కృష్ణ,మండల ఇంచార్జీలు తగరపు సత్యం, మల్యాల శ్రీనివాస్, నాతరి రమేష్ పాల్గొన్నారు.

# మన్నికగా ఉండేలా నిర్మాణ నాణ్యత నిర్ధారించాలి

**నిర్మించిన కొన్నాళ్లకే పగుళ్లు! భవనాన్ని పరిశీలించి వాస్తవాలు వెలుగులోకి తేవాలని డిమాండ్**

**జైత్‌పూర్‌బోర్డ్ గ్రామపంచాయతీ కార్యాలయ భవనంపై నాణ్యతా అనుమానాలు**

**ప్రభుత్వ భవనానికే ఈ దుస్థితి ఏమిటంటున్న,స్థానికులు, గ్రామస్థులు**

**ఆసిఫాబాద్ అర్బన్, సెప్టెంబర్ 03 (ప్రజాజ్యోతి):** ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండలం జైత్‌పూర్‌బోర్డ్ గ్రామపంచాయతీ కార్యాలయ భవనం నిర్మించిన కొంతకాలానికే గోడలకు పగుళ్లు ఏర్పడటం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. ప్రజల సౌకర్యార్థం, గ్రామ పరిపాలనను మరింత మెరుగుపర్చేందుకు ప్రభుత్వ నిధులతో నిర్మించిన భవనం ఇలా కొద్దికాలానికే పగుళ్లకు గురికావడంపై గ్రామస్థులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. భవనం గోడలపై పొడవుగా, పలుచోట్ల కనిపిస్తున్న పగుళ్లు నిర్మాణ నాణ్యతపై అనుమానాలకు తావిస్తున్నాయని వారు పేర్కొంటున్నారు. కొత్త భవనం కావడంతో ఎలాంటి పెద్ద సమస్యలు ఉండకూడదని, కానీ నిర్మాణం పూర్తయిన కొంతకాలానికే గోడలపై పగుళ్లు కనిపించడం పట్ల సంబంధిత అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉందని స్థానికులు అంటున్నారు. భవనం నిర్మాణ సమయంలో ఉపయోగించిన మెటీరియల్ నాణ్యత, పనుల పర్యవేక్షణ, సాంకేతిక ప్రమాణాల అమలు తదితర అంశాలపై సమగ్రంగా పరిశీలన జరపాలని కోరుతున్నారు.


**పగుళ్ల వెనుక కారణమేంటి?**

భవన గోడలకు పగుళ్లు రావడానికి వివిధ సాంకేతిక కారణాలు ఉండే అవకాశం ఉంది. పునాది స్థితి, గోడల నిర్మాణ విధానం, సిమెంట్, ఇసుక, ఇతర నిర్మాణ సామగ్రి నాణ్యత, క్యూరింగ్ వంటి అంశాలను నిపుణులు పరిశీలించిన తర్వాతే అసలు కారణం తేలనుంది. అందువల్ల అధికారులు కేవలం పగుళ్లను పూడ్చడం కాకుండా, వాటికి కారణాన్ని గుర్తించి శాశ్వత పరిష్కారం చూపాలని గ్రామస్థులు కోరుతున్నారు.

**అధికారుల పర్యవేక్షణపై ప్రశ్నలు**

ప్రభుత్వ నిధులతో చేపట్టే నిర్మాణ పనులకు సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించాల్సి ఉంటుంది. పనులు పూర్తయిన తర్వాత కూడా భవనం నాణ్యతను పరిశీలించి అప్పగించే ప్రక్రియ ఉంటుంది. అయితే ఇంత త్వరగా పగుళ్లు



కనిపించడంతో నిర్మాణ సమయంలో నాణ్యతా ప్రమాణాలను ఎంతవరకు పాటించారు? పనులను ఎవరు పర్యవేక్షించారు? నాణ్యతా పరీక్షలు జరిగాయా? అనే ప్రశ్నలు స్థానికుల నుంచి వినిపిస్తున్నాయి. భవన నిర్మాణానికి మంజూరైన నిధులు, పనుల అంచనా వ్యయం, కాంట్రాక్టర్ వివరాలు, పనుల పూర్తి తేదీ తదితర వివరాలను అధికారులు ప్రజలకు తెలియజేయాలని పలువురు కోరుతున్నారు. ప్రభుత్వ భవనాల నిర్మాణంలో నిర్లక్ష్యం జరిగితే భవిష్యత్‌లో మరింత నష్టం వాటిల్లే అవకాశం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**పేరుకే కొత్త భవనం కాకూడదు**

గ్రామపంచాయతీ కార్యాలయం గ్రామ ప్రజలకు అత్యంత అవసరమైన ప్రభుత్వ కార్యాలయం. పంచాయతీ పరిపాలనతో పాటు ప్రజలకు వివిధ సేవలు, ధ్రువపత్రాలు, అభివృద్ధి పనులకు సంబంధించిన సమాచారం, గ్రామ సమస్యలపై వినతులు తదితర కార్యకలాపాలు ఇక్కడే జరుగుతాయి. అలాంటి భవనం నిర్మించిన కొద్దికాలానికే పగుళ్లకు గురికావడం ప్రజల్లో అసంతృప్తికి కారణమవుతోంది. కొత్తగా నిర్మించిన భవనం ఎక్కువ కాలం మన్నికగా ఉండేలా నిర్మాణ నాణ్యతను నిర్ధారించాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉందని గ్రామస్థులు చెబుతున్నారు.

ప్రభుత్వ నిధులతో నిర్మించిన భవనం కొన్నాళ్లకే పగుళ్లు రావడం సాధారణ విషయం కాదని, అధికారులు స్పందించి వాస్తవాలను బయటపెట్టాలి" అని వారు కోరుతున్నారు.

**సాంకేతిక బృందంతో పరిశీలన చేయాలి**

జైత్‌పూర్‌బోర్డ్ గ్రామపంచాయతీ కార్యాలయ భవనాన్ని సంబంధిత ఇంజినీరింగ్ అధికారులు వెంటనే పరిశీలించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. పగుళ్లు కేవలం పైపూతకు సంబంధించినవా? లేక నిర్మాణానికి సంబంధించినవా? అనే అంశాన్ని సాంకేతికంగా నిర్ధారించాలని కోరుతున్నారు. అవసరమైతే నిపుణుల బృందంతో భవనానికి నాణ్యతా పరీక్షలు నిర్వహించాలని అంటున్నారు. పగుళ్లు ఉన్న ప్రాంతాల్లో తాత్కాలికంగా మరమ్మతులు చేసి వదిలేయకుండా, అసలు కారణాన్ని గుర్తించి శాశ్వతంగా పరిష్కరించాలని గ్రామస్థులు కోరుతున్నారు. నిర్మాణంలో నాణ్యతా లోపాలు ఉన్నట్లు విచారణలో తేలితే బాధ్యులపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వ భవనాలు ప్రజల కోసం నిర్మించేవి కావడంతో వాటి నాణ్యత, మన్నిక విషయంలో రాజీ పడకూడదని, జైత్‌పూర్‌బోర్డ్ పంచాయతీ కార్యాలయంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి పూర్తిస్థాయి పరిశీలన నిర్వహించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

# 22ఏ పేరుతో పేదల భూముల దోపిడీ
# బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు రఘునాథ్ వెరబెల్లి

**మంచిర్యాల, 3, సెప్టెంబర్ (ప్రజా జ్యోతి):**22ఏ నిషేధిత భూముల జాబితా పేరుతో పేద ప్రజల నివాస, వ్యవసాయ భూములను దోపిడీ చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు రఘునాథ్ వెరబెల్లి ఆరోపించారు. 22ఏ నిషేధిత భూముల జాబితాను పూర్తిగా రద్దు చేయాలని, అందులో ఉన్న అర్హులైన పేద భూములను వెంటనే తొలగించాలని ఆయన డిమాండ్ చేశారు. 22ఏ బాధిత ప్రజల సమస్యలపై బీజేపీ ఆధ్వర్యంలో గురువారం మంచిర్యాల ఆర్డీవో కార్యాలయం ఎదుట నిర్వహించిన ధర్నాలో రఘునాథ్ వెరబెల్లి పాల్గొని మాట్లాడారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ధరణి పోర్టల్ పేరుతో పేద ప్రజల భూములకు ఇబ్బందులు కలిగించిందని, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం భూ భారతి పేరుతో జీవో 22ఏను తీసుకువచ్చి పేదల నివాస, వ్యవసాయ భూములను దూరం చేసే ప్రయత్నం చేస్తోందని ఆయన విమర్శించారు. 22ఏ జాబితాలో చేర్చిన అర్హులైన పేదల భూములను వెంటనే జాబితా నుంచి తొలగించాలని రఘునాథ్ వెరబెల్లి డిమాండ్ చేశారు. పేదల భూములకు రక్షణ కల్పించాల్సిన ప్రభుత్వం అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. జీవో 22ఏకు బాధ్యత వహిస్తూ రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం 22ఏ జాబితాలో ఉన్న పేద భూములను తొలగించాలని కోరుతూ రఘునాథ్ వెరబెల్లి ఆధ్వర్యంలో ఆర్డీవో కార్యాలయ ఏఓకు మెమోరాండం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మంచిర్యాల జిల్లా అధ్యక్షులు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్, గాజుల ముఖేష్ గౌడ్, దుర్గం అశోక్, అమిరిశెట్టి రాజ్‌కుమార్, సత్రం రమేష్, కుర్రె చక్రవర్తి, బేర సత్యనారాయణ, కస్తూరి నాగరాజు, బొట్ల అనిత, పట్టి వెంకట కృష్ణ, రమణరావు, సతీష్‌రావు, రాచర్ల సంతోష్, వైద్య




శ్రీధర్, పచ్చ స్వప్నరాణి, ఆదే ప్రేమ్‌సింగ్, శివకృష్ణ, గోపతి రాజయ్య, హరిగోపాల్, బూర రాజశేఖర్, సూరం సంపత్, ఏట రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఈ నెల 9న నస్పూర్ సింగరేణి గార్డెన్స్‌లో విశ్రాంత ఉద్యోగుల మహా సమ్మేళనం

## రిటైర్డ్ కార్మికులకు కనీస పెన్షన్ రూ.15 వేలు ఇవ్వాలి 25 ఏళ్లుగా పెన్షన్ పెంచకపోవడం అన్యాయం

## సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షులు గజ్జెల్లి వెంకటయ్య, గౌరవ అధ్యక్షులు రాళ్లబండి రాజన్న

**మంచిర్యాల, 3, సెప్టెంబర్ (ప్రజా జ్యోతి):** సింగరేణిలో మొట్టమొదటిసారిగా ఈ నెల 9న నస్పూర్ కాలనీలోని సింగరేణి గార్డెన్స్‌లో సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో విశ్రాంత ఉద్యోగుల మహా సమ్మేళనం నిర్వహించనున్నట్లు సంఘం అధ్యక్షులు గజ్జెల్లి వెంకటయ్య, గౌరవ అధ్యక్షులు రాళ్లబండి రాజన్న, ప్రధాన కార్యదర్శి పూదరి నర్సయ్య లు తెలిపారు. గురువారం శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ మహా సమ్మేళనానికి రామగుండం సీఎంపీఎఫ్ కమిషనర్లు భరత్‌కుమార్, డాక్టర్ గోవర్ధన్, శ్రీరాంపూర్ జీఎం ఎం. శ్రీనివాస్ హాజరుకానున్నట్లు తెలిపారు. సమ్మేళనంలో విశ్రాంత ఉద్యోగుల సమస్యలపై విస్తృతంగా చర్చించి, భవిష్యత్ పోరాట కార్యాచరణను రూపొందించనున్నట్లు తెలిపారు . సుమారు 400 మంది విశ్రాంత ఉద్యోగులు పాల్గొంటారని తెలిపారు. రాజకీయాలు, పార్టీలకు అతీతంగా ఈ మహా సమ్మేళనాన్ని నిర్వహిస్తున్నట్లు స్పష్టం చేశారు. సింగరేణి పరిధిలో సుమారు 84 వేల మంది విశ్రాంత ఉద్యోగులు ఉన్నారని, కోల్ ఇండియా వ్యాప్తంగా సుమారు 5 లక్షల మంది పెన్షనర్లు ఉన్నారని వారు తెలిపారు. 1999లో ప్రారంభమైన కోల్‌మైన్స్ ప్రావిడెంట్ ఫండ్ పెన్షన్ విధానంలో 25 ఏళ్లుగా పెన్షన్ పెంపు లేకపోవడం తీవ్ర అన్యాయమన్నారు. ప్రతి మూడేళ్లకోసారి పెన్షన్‌ను పెంచాల్సి ఉన్నప్పటికీ సీఎంపీఎఫ్ యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. దేశంలోని తొమ్మిది రాష్ట్రాల్లో బొగ్గు గని రిటైర్డ్ కార్మికులు అత్యల్ప పెన్షన్లతో జీవనం సాగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా పెన్షన్‌ను పెంచాలని, రిటైర్డ్ కార్మికులకు కనీస పెన్షన్ రూ.15 వేలు చెల్లించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చాలీచాలని పెన్షన్‌తో విశ్రాంత కార్మికుల కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలిపారు. గతంలో సింగరేణిలో సీఎస్ఆర్, వీఆర్ఎస్, గోల్డెన్ హ్యాండ్‌షేక్ వంటి పథకాల ద్వారా అనేక మంది కార్మికులు సంస్థ నుంచి బయటకు వెళ్లాల్సి వచ్చిందని వారు పేర్కొన్నారు. సింగరేణిలో సుమారు 16,900 మంది కార్మికులు రూ.1,000 లోపు పెన్షన్ పొందుతున్నారని తెలిపారు. కనీస పెన్షన్ రూ.15 వేలకు పెంచాలని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు వివరించారు. పెన్షన్ చెల్లింపుల కోసం నెలకు సుమారు రూ.150 కోట్లు అప్పులు తెస్తున్నామని చెప్పడాన్ని వారు ప్రస్తావిస్తూ, విశ్రాంత కార్మికుల పెన్షన్‌ను ప్రభుత్వాలకు భారంగా చూపించడం సరికాదన్నారు. కార్మికుల వేతనాల నుంచి రికవరీ చేసిన మొత్తాల ఆధారంగానే పెన్షన్ చెల్లిస్తున్నారని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. సింగరేణి విశ్రాంత ఉద్యోగులకు అందిస్తున్న సీపీఆర్ఎంఎస్ వైద్య పరిమితిని కూడా పెంచాలని డిమాండ్ చేశారు. కార్మికులకు రూ.8 లక్షలు, అధికారులకు రూ.25 లక్షల వైద్య పరిమితి విధానం ఉందని, రిటైర్డ్ కార్మికులకు కూడా అధికారులతో సమానంగా రూ.25 లక్షల వరకు వైద్య పరిమితి కల్పించాలని కోరారు. అదేవిధంగా కార్మికులకు రూ.20 లక్షల గ్రాట్యుటీని జూలై,2016 నుంచి అరులైన వారికి అమలు చేయాలని, సింగరేణిలోని ఖాళీ స్థలాల్లో విశ్రాంత కార్మికులకు ఇంటి స్థలాలు కేటాయించాలని, అన్ని బ్యాంకుల్లో రిటైర్డ్ కార్మికులకు రూ.30 లక్షల ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సంఘం సలహాదారు పెట్టం లక్ష్మణ్, ఉపాధ్యక్షులు నల్లగొండ సదాశివచారి, కోశాధికారి బింగి రాజేష్, నాయకులు బొవనగిరి కృష్ణ, పూసాల వెంకటరత్నం, లక్ష్మీనారాయణ, దొంతుల సాయి తదితరులు పాల్గొన్నారు.




# శ్రీ సత్యనారాయణ స్వామి పవిత్రోత్సవాలు వైభవంగా ముగిశాయి.



**దండేపల్లి సెప్టెంబర్ 3(ప్రజాజ్యోతి ):** మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం గూడెం గుట్ట శ్రీ సత్యనారాయణ స్వామి దేవస్థానంలో మూడు రోజుల పాటు సాగిన పవిత్రోత్సవాలు గురువారం వైభవంగా ముగిశాయి.పవిత్రోత్సవాల్లో భాగం పూజల చివరి రోజైన మూడో రోజున యజ్ఞాచార్యులు అభిరామాచార్యులు గారి ఆధ్వర్యంలో మహా పూర్ణాహుతి, పవిత్ర అవరోహణము, స్నపన తిరుమంజనం, కుంభ ప్రోక్షణ, హారతి, మంత్ర పుష్పం, మహాదా శీర్వచనము తదితర ప్రత్యేక పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాద వితరణ చేపట్టారు. ఈ పూజా కార్యక్రమాల్లో ముఖ్య అర్చకులు గోవర్ధన రఘుస్వామి, వేదపండితులు డి.నారాయణ శర్మ, జి.భరత్ శర్మ, అర్చకులు జి.సంపత్ స్వామిలతో పాటు ఇతర అర్చకులు, ఆలయ సిబ్బంది, భక్తులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు.

# శ్రీరాంపూర్ పరిధిలో ప్రతి ఉద్యోగి వ్యక్తిగత ఈ-మెయిల్ ఐడీ వివరాలు వెంటనే సమర్పించాలి

## డీజీఎం(పర్సనల్) ఎస్. అనిల్‌కుమార్



**మంచిర్యాల, 3, సెప్టెంబర్ (ప్రజా జ్యోతి):** ప్రభుత్వ ఆదేశాల మేరకు కర్మయోగి పోర్టల్‌లో ఉద్యోగుల ఈ-మెయిల్ ఐడీ వివరాలను పొందుపరిచే ప్రక్రియను సింగరేణి యాజమాన్యం ప్రారంభించింది. ఈ నేపథ్యంలో శ్రీరాంపూర్ ఏరియా పరిధిలోని ప్రతి ఉద్యోగి తమ వ్యక్తిగత ఈ-మెయిల్ ఐడీ వివరాలను సంబంధిత వెల్ఫేర్ కార్యాలయాల్లో వెంటనే సమర్పించాలని డీజీఎం(పర్సనల్) ఎస్. అనిల్‌కుమార్ కోరారు. ఇప్పటికే గనులు, విభాగాలు, కార్యాలయాల్లో ఉద్యోగులు తమ ఈ-మెయిల్ ఐడీ వివరాలను అందించాలని నోటీసులు జారీ చేసినప్పటికీ, ఇప్పటికీ పెద్ద సంఖ్యలో ఉద్యోగులు వివరాలను సమర్పించలేదని తెలిపారు. శ్రీరాంపూర్ ఏరియాలో మొత్తం 5,629 మంది ఉద్యోగులు తమ వ్యక్తిగత ఈ-మెయిల్ ఐడీ వివరాలను సంబంధిత వెల్ఫేర్ కార్యాలయాల్లో ఇంకా అందజేయలేదన్నారు. గనుల వారీగా పరిశీలిస్తే ఐకే 1ఏ గనిలో 876 మంది, ఐకే ఓసీలో 167 మంది, ఆర్కే 5 గనిలో 821 మంది, ఆర్కే 7 గనిలో 1,137 మంది, ఆర్కే ఎన్‌టీ గనిలో 425 మంది, ఎస్ఆర్‌పీ ఓసీలో 553 మంది, ఎస్ఆర్‌పీ-1 గనిలో 273 మంది, ఎస్ఆర్‌పీ-3 గనిలో 1,208 మంది, సీహెచ్‌పీలో 169 మంది ఉద్యోగులు ఇప్పటివరకు తమ వ్యక్తిగత ఈ-మెయిల్ ఐడీ వివరాలు సమర్పించలేదని వివరాలు తెలిపారు . కర్మయోగి పోర్టల్ ద్వారా ప్రభుత్వ ఉద్యోగులు ఎప్పుడైనా, ఎక్కడి నుంచైనా ఆన్‌లైన్ కోర్సులు, శిక్షణా కార్యక్రమాలు, పరీక్షలు, సర్టిఫికేషన్ కోర్సులు పూర్తి చేసుకునే అవకాశం ఉంటుందని డీజీఎం (పర్సనల్) ఎస్. అనిల్‌కుమార్ తెలిపారు. దీనివల్ల ఉద్యోగులు తమ జ్ఞానం, నైపుణ్యాలు, సామర్థ్యాలను మరింత మెరుగుపరుచుకునే అవకాశం ఉంటుందన్నారు. అందువల్ల శ్రీరాంపూర్ ఏరియా పరిధిలో ఈ-మెయిల్ ఐడీ వివరాలు ఇంకా సమర్పించని ఉద్యోగులందరూ ఎలాంటి ఆలస్యం చేయకుండా వెంటనే తమ సంబంధిత వెల్ఫేర్ కార్యాలయాల్లో వ్యక్తిగత ఈ-మెయిల్ ఐడీ వివరాలను అందజేయాలని డీజీఎం(పర్సనల్) కోరారు.

# అలరించిన ఆట.. పాట.. పల్లె జానపదాలు.

## మంచిర్యాల జిల్లాలో 'డీడీ యాదగిరి' ఆటపాట సీజన్--4 ఆడిషన్స్.



మందమర్రి, సెప్టెంబర్ 03(ప్రజాజ్యోతి ): పల్లె మట్టి వాసనను మోసుకొచ్చిన జానపద గీతాలు శాంకరి గార్డెన్స్‌లో మార్మోగాయి. తమలో దాగిన కళను వేదికపై ఆవిష్కరించేందుకు వచ్చిన కళాకారులు ఆటపాటలతో అలరించారు. డీడీ యాదగిరి టీవీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'ఆటపాట సీజన్--4 పల్లె జానపదాల' ఆడిషన్స్ గురువారం మండలంలోని శాంకరి గార్డెన్స్‌లో నిర్వహిం చారు. మంచిర్యాల జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన సుమా రు 30 మంది గాయని, గాయకులు ఆడిషన్స్‌లో పాల్గొన్నారు. తరతరాలుగా పల్లెల్లో వినిపిస్తున్న జానపదాలను తమదైన శైలిలో ఆలపిస్తూ కళాకారులు ఆకట్టుకున్నారు. పల్లె జీవనం, కష్టం, ఆనందం, ఆచారాలు, అనుబంధాలను ప్రతిబింబించే పాటలు ఆహూతులను విశేషంగా అలరించాయి. గ్రామీణ ప్రాంతాల్లో మరుగునపడుతున్న జానపద కళలను వెలుగులోకి తీసుకు రావడంతో పాటు, పల్లెల్లోని ప్రతిభావంతులైన కళాకారులకు పెద్ద వేదిక కల్పించాలనే ఉద్దేశంతో 'ఆటపాట' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కళాకారులు ఉన్న ప్రాంతాల్లోనే ఆడిషన్స్ నిర్వహించి, పల్లె పదాలను ప్రపంచానికి పరిచయం చేయాలన్నదే తమ లక్ష్యమని సెలక్షన్ కమిటీ సభ్యులు ఉప్పులేటి నరేష్, గద్దం రమేష్ తెలిపారు. ఆడిషన్స్‌కు సీనియర్ కళాకారిణి బండ శాంకరి న్యాయనిర్ణేతగా వ్యవహరించగా, యాంకర్ నాగలక్ష్మి తనదైన శైలిలో కార్యక్రమాన్ని ఆద్యంతం ఆసక్తికరంగా నిర్వహించారు. కళాకారుల పాటలకు డోలక్ హరీష్ సంగీత సహకారం అందించగా, స్వామి డప్పుతో జానపద గీతాలకు మరింత జోష్ తీసుకొచ్చారు. డీడీ యాదగిరి ఛానల్ అధికారులు, కెమెరా యూనిట్ సభ్యులు పాల్గొన్నారు.

# ఏఎన్ఎంలపై ఆన్‌లైన్ పని భారం తగ్గించాలి

## ఏఎన్ఎంలకు సూపర్‌వైజర్ ప్రమోషన్లు కల్పించాలి

## తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ

**మంచిర్యాల, 3 సెప్టెంబర్ (ప్రజాజ్యోతి):** వైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న ఏఎన్ఎంలు, ఇతర సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) డిమాండ్ చేసింది. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గురువారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్‌కు ఏఎన్ఎంలు, ఇతర సిబ్బంది ఎదుర్కొంటున్న 15 డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా కార్యదర్శి మౌలాలి మాట్లాడుతూ వైద్య ఆరోగ్యశాఖలో రెగ్యులర్, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న ఏఎన్ఎంలు అనేక సమస్యలతో సతమతమవుతున్నారని తెలిపారు. ముఖ్యంగా అధిక లక్ష్యాలు విధించి, వాటిని ప్రతి వారం, ప్రతి నెల అధిగమించాలని ఒత్తిడి చేయడం వల్ల ఏఎన్ఎంలు తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారని పేర్కొన్నారు. ఒకేసారి ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ నమోదు చేయాలని ఆదేశించడంతో పని భారం మరింత పెరిగి అనారోగ్యానికి గురయ్యే పరిస్థితి ఏర్పడుతోందన్నారు. ఏఎన్ఎంలపై పని ఒత్తిడిని తగ్గించాలని కోరారు. రెగ్యులర్ ఏఎన్ఎంలకు ఎల్‌హెచ్‌వీ ట్రైనింగ్ పూర్తి కాలేదనే కారణంతో 12, 18 సంవత్సరాల స్పెషల్ ప్రమోషనల్ పోస్టు ఇంక్రిమెంట్లు మంజూరు చేయడం లేదని మౌలాలి తెలిపారు. దీంతో ఏఎన్ఎంలు ఆర్థికంగా తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. గతంలో మాదిరిగా ప్రభుత్వ ఖర్చుతో ఎల్‌హెచ్‌వీ ట్రైనింగ్ ఇప్పించాలని, ట్రైనింగ్ ఇచ్చేలోపు పెండింగ్‌లో ఉన్న ఇంక్రిమెంట్లను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా అర్హత కలిగిన ఏఎన్ఎంలకు సూపర్‌వైజర్ ప్రమోషన్లు కల్పించాలని కోరారు. గత




మూడు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న 1,931 ఏపీహెచ్ఏ ఫిమేల్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, ఇప్పటివరకు ఉన్న అన్ని ఖాళీలను కూడా భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. రెగ్యులర్ కాకుండా మిగిలిపోయిన కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఏఎన్ఎంలకు వేతనాలు పెంచి, ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ అందించాలని కోరారు. ప్రతి పనికి ఆభా లింకింగ్ చేయడం వల్ల క్షేత్రస్థాయిలో అనేక సమస్యలు ఎదురవుతున్నాయని, అందువల్ల ఆభా లింకింగ్ విధానాన్ని తొలగించాలని మౌలాలి డిమాండ్ చేశారు. ఏఎన్ఎంలకు జీతంతో కూడిన ఎఫ్‌టీఏ ఇవ్వాలని కోరారు. క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న ఏఎన్ఎంలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి వారి సమస్యలను తెలుసుకుని, వాటిపై చర్చించాలని కోరారు. ఏఎన్ఎంల సమస్యల పరిష్కారానికి తగిన సూచనలను ప్రభుత్వానికి పంపించి న్యాయం చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు పద్మావతి, మంగూభాయి, వసంత, విజయదర్శిని, కృష్ణవేణి, యేసువర, సుజాత, నరసమ్మ, మీనా తదితరులు పాల్గొన్నారు.

## మేకల కాపరి పై ఎలుగుబంట్లు దాడి



**తిర్యాణి, సెప్టెంబర్ 3 (ప్రజా జ్యోతి):** మండలంలోని రొంపల్లి అటవీ ప్రాంతంలో మేకలు మేపుతున్న నాయకపుగూడ గ్రామానికి చెందిన మోడితే శంకర్ (54)పై మూడు ఎలుగుబంట్లు మూకుమ్మడిగా దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల వివరాల ప్రకారం శంకర్ మేకలు మేపుతుండగా అకస్మాత్తుగా మూడు ఎలుగుబంట్లు అతనిపై దాడి చేశాయి. బాధితుడు కేకలు వేయడంతో సమీపంలోని పశువుల కాపరులు, రైతులు అక్కడికి చేరుకుని గట్టిగా కేకలు వేయడంతో ఎలుగు బంట్లు అడవిలోకి వెళ్లిపోయాయి. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన శంకర్‌ను స్థానికులు వెంటనే చెలిమల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడ చికిత్స అందించిన అనంతరం మెరుగైన చికిత్స కోసం మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

# విద్యా సంస్థలలో అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలి

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల, 3 సెప్టెంబర్ (ప్రజాజ్యోతి):** విద్యాభివృద్ధిలో భాగంగా విద్యా సంస్థలలో చేపట్టిన అభివృద్ధి పనులు వేగవంతం చేసి త్వరగా పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. జిల్లాలోని భీమిని మండల కేంద్రంలో గల కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంను గురువారం సందర్శించి అదనపు గదులు, భోజనశాల నిర్మాణ పనులను పరిశీలించి త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు అవసరమైన సకల సదుపాయాలు కల్పిస్తూ నాణ్యమైన విద్య అందించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఈ క్రమంలో విద్యార్థులకు మెనూ ప్రకారం పౌష్టిక ఆహారం అందించాలని, పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు నాణ్యమైన విద్యా బోధన చేయాలని తెలిపారు. పాఠశాలలో విద్యారుల సంఖ్య పెంపొందించాలని, విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని తెలిపారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయాన్ని సందర్శించి ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో నోటీసుల జారీ, ఓటర్లు సమర్పించిన వివరాల పరిశీలన అంశాలను పరిశీలించారు. మ్యాపింగ్ కాని, అనమలిస్ జాబితాలో ఓటర్లకు అందించిన నోటీసులకు సంబంధించి వారు సమర్పించిన ధృవపత్రాలను పరిశీలించి భారత ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం పారదర్శకంగా చర్యలు తీసుకొని, ప్రక్రియ నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్, మండల తహసిల్దార్ బికర్ణదాస్



లతో కలిసి తహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించి భూముల రీ సర్వే, సాదా బైనమా, భూభారతి, రెవెన్యూ సదస్సుల దరఖాస్తుల ప్రక్రియను పరిశీలించారు. రీ-సర్వే ప్రక్రియలో నిర్దేశిత విధానాలను తప్పనిసరిగా పాటించాలని, ఫీల్డ్ రిజిస్టర్, విలేజ్ రిజిస్టర్‌లలో వివరాలు నమోదు చేస్తూ, సంబంధిత రికార్డులను సక్రమంగా నిర్వహించాలని, రీ-సర్వే పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం నెన్నెల మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయాన్ని బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్, మండల తహసిల్దార్ శ్రీనివాస్ లతో కలిసి సందర్శించి భూముల రీ సర్వే, ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో నోటీసుల జారీ, విచారణ కార్యక్రమాల నిర్వహణను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి పాఠశాలలలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు.



అదనపు గదుల పనులు దాదాపు తుది దశకు చేరుకున్నాయని, త్వరగా పూర్తిచేసి వినియోగంలోకి తీసుకురావాలని సంబంధిత అధికారులకు సూచించారు. భోజనశాల, వంటశాల లను పరిశీలించి విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ఆహారం తయారీలో శుభ్రత నిబంధనలు పాటించాలని సూచించారు. విద్యార్థులకు సకల సదుపాయాలతో కూడిన నాణ్యమైన విద్య అందించే దిశగా ఉపాధ్యాయులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. బెల్లంపల్లి మండలం మాలగురిజాల గ్రామ శివారులో గల భూములలో రైతులు వరి సాగు చేస్తున్న విషయాన్ని గమనించి వారితో మాట్లాడారు. ప్రస్తుతం రాష్ట్రంలో నెలకొన్న ఎల్ నినో ప్రభావంతో లోటు వర్షపాతం నమోదు అయ్యే అవకాశం ఉందని, అధిక సాగునీటి అవసరం ఉన్న వరి సాగుతో నష్టపోయే ప్రమాదం ఉందని రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారంలో సర్పంచ్ విఫల్యం !

**అధికారులకు చెప్పినా స్పందన లేదంటూ చేతులు దులుపుకుంటున్నారా?**



**వాంకిడి సెప్టెంబర్ 03 ప్రజా జ్యోతి** వాంకిడి మండల కేంద్రం లోని జంబుల్దరి గ్రామంలో ఒదిక్కు పాఠశాల మరో దిక్కు అంగన్వాడి గ్రామపంచాయతీ కార్యాలయ ప్రాంగణంలో విద్యుత్ సంబంధిత సమస్యలు నెలకొన్నప్పటికీ వాటికి శాశ్వత పరిష్కారం చూపించడంలో స్థానిక సర్పంచ్ విఫలమయ్యారన్న విమర్శలు వినిపిస్తున్నాయి సమస్యను విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకెళ్లామని సర్పంచ్ చెబుతున్నా ప్రజలకు తక్షణ ఉపశమనం కల్పించేలా చర్యలు మాత్రం కనిపించడం లేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ పరికరం చుట్టూ గ్రీన్ షేడ్ నెట్ ఏర్పాటు చేయడం తాత్కాలిక చర్య మాత్రమేనని అసలు సమస్యను పరిష్కరించాల్సిన బాధ్యత ఎవరిది అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు అధికారులపై ఒత్తిడి తెచ్చి సమస్యను పరిష్కరించాలి చెప్పాం స్పందన లేదు అంటూ తప్పించుకోవడం సరికాదని స్థానికులు అంటున్నారు

## ఆర్.ఓ.ఎఫ్.ఆర్., భూ సమస్యల పరిష్కారానికి సమిష్టి కృషి



**మంచిర్యాల, 3 సెప్టెంబర్ (ప్రజాజ్యోతి):** జిల్లాలోని ఆర్.ఓ.ఎఫ్.ఆర్., భూ సమస్యల పరిష్కారానికి సమిష్టిగా కృషి చేద్దామని సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ--ఉట్నూర్ ప్రాజెక్టు అధికారి మంద మకరందు అన్నారు. జిల్లా కేంద్రంలోని అటవీ శాఖ కార్యాలయంలో జిల్లా అటవీ శాఖ అధికారి రాహుల్ కిషన్ జాదవ్ ను మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లాలోని గిరిజనుల (అటవీ హక్కుల గుర్తింపు చట్టం), భూ సమస్యలు తదితర అంశాలపై చర్చించారు. గిరిజనులకు సంబంధించిన భూ సమస్యలను చట్టపరమైన నిబంధనలకు అనుగుణంగా పరిష్కరించేందుకు సంబంధిత శాఖల సమన్వయంతో చర్యలు తీసుకోవడం, అర్హులైన గిరిజనులకు అటవీ హక్కుల చట్టం ద్వారా కల్పించాల్సిన హక్కుల అమలు అంశాలపై చర్చించారు. ఆర్.ఓ.ఎఫ్.ఆర్., భూములకు సంబంధించిన సమస్యలను పరిశీలించి, క్షేత్రస్థాయిలో అవసరమైన చర్యలు చేపట్టడం ద్వారా గిరిజనులకు ఇబ్బందులు లేకుండా చూడాలని, గిరిజనుల భూ హక్కుల పరిరక్షణకు సంబంధిత శాఖలు సమన్వయంతో సమిష్టిగా కృషి చేద్దామని తెలిపారు.

## సీనియారిటీతో 24 మందికి క్వార్టర్లు.



**మందమర్రి,సెప్టెంబర్ 03(ప్రజాజ్యోతి ):** సింగరేణి మందమర్రి ఏరియాకు చెందిన ఎన్‌సీడబ్ల్యూఏ ఉద్యోగులకు సీనియారిటీ ప్రాతిపదికన క్వార్టర్ల కేటాయింపు కోసం గురువారం కౌన్సెలింగ్ నిర్వహించారు. స్థానిక సీఈఆర్ క్లబ్‌లో నిర్వహించిన ఈ ప్రక్రియలో మొత్తం 105 క్వార్టర్లు అందుబాటులో ఉండగా.. 88 మంది ఉద్యోగులు దరఖాస్తు చేసుకున్నారు. నిబంధనల మేరకు సీనియారిటీ ఆధారంగా పారదర్శకంగా కౌన్సెలింగ్ నిర్వహించి 24 మంది అర్హులైన ఉద్యోగులకు క్వార్టర్లు కేటాయించారు. కార్యక్రమాన్ని సీనియర్ పర్సనల్ ఆఫీసర్ కార్తీక్, ఓఎస్ (పర్సనల్) ఎం. రాయలింగు, మేనేజ్‌మెంట్ ట్రైనీ (సివిల్) ఆర్. వీణతో పాటు పర్సనల్ విభాగం సిబ్బంది పర్యవేక్షించారు.

## హియరింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలి

**అర్హత కలిగిన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా చూడాలి**

**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



**మంచిర్యాల, 3, సెప్టెంబర్ (ప్రజాజ్యోతి):** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ--2026లో నోటీసుల జారీ అనంతరం సంబంధిత ఓటర్ల నుంచి స్వీకరిస్తున్న ధ్రువపత్రాల పరిశీలన, హియరింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్లు పి.చంద్రయ్య, వి.రాములు, ప్రత్యేక ఉపపాలనాధికారి చంద్రకళ, జిల్లా రెవెన్యూ అధికారి మోతీరామ్, డి.ఎ.ఓ. రమేష్‌లతో కలిసి రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ--2026లో హియరింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. మార్కింగ్ కాని, అనామలీస్ జాబితాలో ఉన్న ఓటర్లకు జారీ చేసిన నోటీసులకు సంబంధించి వారు సమర్పిస్తున్న ధ్రువపత్రాలను క్షుణ్ణంగా పరిశీలించి విచారణ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఓటరు జాబితాలో ఉన్న ఓటర్లు తమకు సంబంధించిన వివరాలు, అవసరమైన ధ్రువపత్రాలను సకాలంలో సమర్పించేలా రాజకీయ పార్టీలు తమ బూత్ స్థాయి ఏజెంట్ల ద్వారా అవగాహన కల్పించి సహకరించాలని కలెక్టర్ కోరారు. ఎస్.ఐ.ఆర్.--2026 ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు అన్ని రాజకీయ పార్టీలు, ప్రజలు సహకరించాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో సంబంధిత అధికారులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## పురాతన రావి చెట్టు నరికి వేతపై ఫిర్యాదు

**అనుమతులు లేకుండా చెట్టు నరికివేశారంటూ అధికారులకు ఫిర్యాదు**



**మంచిర్యాల, 3,సెప్టెంబర్ (ప్రజాజ్యోతి):** చెన్నూర్ మున్సిపల్ పట్టణంలోని పురాతన శివాలయ ప్రాంగణంలో సుమారు 200 సంవత్సరాల చరిత్ర కలిగిన రావి చెట్టును ఎలాంటి అనుమతులు లేకుండా నరికివేశారని ఆరోపిస్తూ మున్సిపల్ కోఆప్షన్ సభ్యురాలు తనుగుల సరోజన, రవికుమార్ ఆధ్వర్యంలో సంబంధిత అధికారులకు గురువారం ఫిర్యాదు చేశారు. శివాలయం ముందు ఉన్న ఈ పురాతన రావి చెట్టును చిల్లప్ప గోపాల్ అనే వ్యక్తి మున్సిపల్, అటవీ శాఖల నుంచి ఎలాంటి అనుమతులు పొందకుండా నరికివేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దేవాలయ ప్రాంగణంలో ఉన్న పురాతన చెట్టును తొలగించడం వల్ల హిందూ భక్తుల మనోభావాలు దెబ్బతిన్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి, చెట్టును నరికివేసిన వ్యక్తితో పాటు అందుకు సహకరించిన వారిపై కూడా చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజల మధ్య ఉద్రిక్తతలు, మతపరమైన భావోద్వేగాలను రెచ్చగొట్టే పరిస్థితులు ఏర్పడకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఫారెస్ట్ ఎఫ్‌డీఓ, పోలీస్ శాఖ అధికారులతో పాటు చెన్నూర్ మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ డీసీసీ జనరల్ సెక్రటరీ చింతల శ్రీనివాస్, చెన్నూర్ పట్టణ కాంగ్రెస్ కన్వీనర్ లింగంపల్లి మహేష్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పాతర్ల నాగరాజు, తనుగుల సతీష్, బొమ్మ రమేష్ రెడ్డి, ఎం.డి. సుల్తాన్ తదితరులు పాల్గొని అధికారులకు ఫిర్యాదు చేశారు.

## కాంగ్రెస్ పార్టీ వెయ్యి రోజుల ప్రజా పాలన కార్యక్రమం ర్యాలీ మరియు సంబరాలు



**రెబ్బెన సెప్టెంబర్ 3 ప్రజా జ్యోతి** ఈరోజు రబ్బెన మండల కేంద్రంలో డి సి సి అధ్యక్షురాలు సుగుణక్క ఆదేశాల మేరకు రెబ్బెన మండలంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కేసరి కిషన్ గౌడ్,ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, కార్యకర్తలు ర్యాలీ మరియు సంబరాలు జరుపుకున్నారు 1000 రోజులలో కాంగ్రెస్ పార్టీ ఎన్నో పథకాలు అమలు చేసింది ముఖ్యంగా ఫ్రీ బస్సు రెండు లక్షల రుణమాఫీ ఉచిత కరెంటు రేషన్ కార్డు 5 లక్షల ఇందిరమ్మ ఇల్లు, 500 గ్యాస్ ఇంకా ఎన్నో పథకాలు అమలు చేసింది ఎన్ని చేసినా బి ఆర్ఎస్ పార్టీ ఏం చేసిందని అడుగుతుంది.బి ఆర్ఎస్ పార్టీ 15లు పరిపాలించింది ఏం అభివృద్ధి చేసింది అని రెబ్బెన మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బి ఆర్ఎస్ పార్టీకి గట్టి కౌంటర్ ఇచ్చారు ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు పల్లె ప్రకాష్, అధికార ప్రతినిధి దుర్గం రవీందర్ కార్యవర్గ సభ్యులు చిన్న సోమశేఖర్, మోడీ చిరంజీవి గౌడ్, నాయకులు కార్యకర్తలు మాజీ ప్రజా ప్రతినిధులు పాల్గొని సంబరాలు చేసుకున్నారు

# నేడు గోకులాష్టమి

## ధర్మానికి వెలుగుబాట చూపిన శ్రీకృష్ణుడు

**మంచిర్యాల, 3 సెప్టెంబర్ (ప్రజాజ్యోతి):** భారతీయ సంస్కృతిలో గోకులాష్టమి లేదా శ్రీకృష్ణ జన్మాష్టమికి విశిష్టమైన స్థానం ఉందని విశ్లేషకులు ఆళవందార్ వేణు మాధవ్ తెలిపారు. భాద్రపద మాసం కృష్ణపక్ష అష్టమి రోజున శ్రీకృష్ణుడు జన్మించాడని పురాణాలు చెబుతున్నాయని, ఇది కేవలం ఒక పండుగ మాత్రమే కాదని, అధర్మంపై ధర్మం, అన్యాయంపై న్యాయం, ద్వేషంపై ప్రేమ, నిరాశపై ఆశ విజయం సాధిస్తాయనే శాశ్వత సందేశాన్ని అందించే పర్వదినమని పేర్కొన్నారు. మథురను కంసుడు నిరంకుశంగా పాలిస్తున్న కాలంలో దేవకీ, వసుదేవులకు ఎనిమిదవ సంతానంగా శ్రీకృష్ణుడు జన్మించాడు. దేవకికి పుట్టే ఎనిమిదవ సంతానం తనను సంహరిస్తాడని ఆకాశవాణి ద్వారా తెలుసుకున్న కంసుడు దేవకీ, వసుదేవులను కారాగారంలో బంధించాడు. దేవకికి పుట్టిన తొలి ఆరుగురు పిల్లలను కంసుడు సంహరించగా, ఎనిమిదవ సంతానంగా అష్టమి అర్ధరాత్రి కృష్ణుడు జన్మించాడు. ఆయన జన్మించిన వెంటనే కారాగార ద్వారాలు తెరుచుకున్నాయని, వసుదేవుడి సంకెళ్ళ తొలగిపోయాయని పురాణ కథనం. వసుదేవుడు శిశువు కృష్ణుడిని బుట్టలో పెట్టుకుని యమునా నదిని దాటి గోకులానికి చేరుకుని నందుడు, యశోద దంపతుల ఇంట కృష్ణుడిని ఉంచి, అక్కడ ఉన్న ఆడ శిశువును తీసుకుని తిరిగి మథురకు చేరుకున్నాడు. కృష్ణుడిని సంహరించడానికి ప్రయత్నించిన కంసుడికి ఆ శిశువు దివ్యరూపం ధరించి, తనను సంహరించేవాడు ఇప్పటికే జన్మించాడని చెప్పి అంతర్ధానమైందని పురాణాలు చెబుతున్నాయి. కృష్ణుడి బాల్యం గోకులంలో గడిచింది. నందగోపుడు, యశోదమ్మల ఇంట పెరిగిన కృష్ణుడు గోకుల ప్రజలందరికీ ముద్దుబిడ్డగా మారాడు. గోపబాలురతో కలిసి ఆడుకోవడం, గోవులను మేపడం, గోపికల ఇళ్లలోని వెన్నను దొంగిలించడం వంటి చిలిపి పనులతో బాలకృష్ణుడు అందరి మనసులను దోచుకున్నాడు. అందుకే ఆయనను ప్రేమగా “వెన్నదొంగ”, “నవనీత చోరుడు”, “గోపాలుడు” అని పిలుస్తారని తెలిపారు. కృష్ణుడి బాల్య లీలలు నేటికీ పిల్లల నుంచి పెద్దల వరకు అందరినీ ఆకట్టుకుంటున్నాయని, ఒకసారి కృష్ణుడు మట్టి తిన్నాడని గోపబాలురు యశోదమ్మకు ఫిర్యాదు చేయగా, యశోదమ్మ కృష్ణుడి నోరు తెరవమన్నప్పుడు అందులో సకల జగత్తును దర్శించిందని పురాణం చెబుతుందని పేర్కొన్నారు. అయినప్పటికీ తల్లి ప్రేమ ముందు కృష్ణుడు దైవంగా కాకుండా తన ముద్దుబిడ్డగానే కనిపించాడన్నారు. కృష్ణుడిని చిన్నతనంలోనే సంహరించేందుకు కంసుడు అనేక రాక్షసులను గోకులానికి పంపగా, పూతన విషపూరితమైన పాలతో కృష్ణుడిని చంపేందుకు ప్రయత్నించగా ఆమెను సంహరించాడని, శకటాసురుడు, తృణావర్తుడు వంటి రాక్షసులను కూడా కృష్ణుడు సంహరించాడని పురాణ కథనం. యమునా నదిలో విషాన్ని వ్యాపింపజేసిన కాళీయ నాగును కృష్ణుడు అదుపులోకి తీసుకుని గోకుల ప్రజలను, పశువులను రక్షించాడని చెబుతారు. ఈ కథలు చెడుపై మంచికి ఉన్న విజయాన్ని సూచిస్తాయని తెలిపారు. కృష్ణుడి బాల్య లీలల్లో గోవర్ధన గిరి ఘట్టం అత్యంత ప్రసిద్ధమైనదని, భారీ వర్షాల నుంచి గోకుల ప్రజలను, పశువులను రక్షించేందుకు కృష్ణుడు గోవర్ధన గిరిని తన చిటికెన వేలిపై ఎత్తాడని పురాణం చెబుతుందని పేర్కొన్నారు. బాల్యం అనంతరం కృష్ణుడు మథురకు వెళ్లి కంసుడిని సంహరించి నిరంకుశ పాలనకు ముగింపు పలికి ప్రజలకు విముక్తి కల్పించాడని, అధర్మం ఎంత బలంగా కనిపించినా చివరకు ధర్మమే విజయం సాధిస్తుందనే సత్యాన్ని ఈ ఘట్టం తెలియజేస్తుందని అన్నారు. అనంతరం మహాభారత కాలంలో కృష్ణుడు పాండవులకు మార్గదర్శిగా నిలిచి, కురుక్షేత్ర యుద్ధభూమిలో అర్జునుడికి భగవద్గీతను బోధించాడని, కర్తవ్యాన్ని నిర్వర్తించడం, ధర్మం కోసం నిలబడటం, ఫలితాలపై అధికాసక్తి లేకుండా పనిచేయడం వంటి విలువలను ప్రపంచానికి అందించాడని తెలిపారు. నేటి సమాజంలో స్వార్థం, అసహనం, అన్యాయం, కుటుంబ విభేదాలు పెరుగుతున్న సమయంలో కృష్ణుడి జీవితం ఎంతో స్ఫూర్తిదాయకమని ఆళవందార్ వేణు మాధవ్ పేర్కొన్నారు. కృష్ణుడి బాల్యం ప్రేమను నేర్పుతుందని, సుదాముడితో స్నేహం నిజమైన స్నేహానికి ప్రతీక అని, కంస సంహారం అన్యాయాన్ని ఎదుర్కొనే ధైర్యాన్ని ఇస్తుందని, భగవద్గీత కర్తవ్యనిష్ఠను బోధిస్తుందని తెలిపారు. కాబట్టి ఈ సంవత్సరం సెప్టెంబర్ 4న గోకులాష్టమి సందర్భంగా పూజలు, ఉత్సవాలు నిర్వహించడంతో పాటు శ్రీకృష్ణుడి జీవితంలోని విలువలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని ఆయన కోరారు. ప్రేమ, ధర్మం, సత్యం, స్నేహం, కర్తవ్యనిష్ఠతో జీవించడమే శ్రీకృష్ణుడికి నిజమైన నివాళి అని ఆళవందార్ వేణు మాధవ్ తెలిపారు.





## జేబీసీసీఐ--12 ఏర్పాటుకు కదులుతున్న అడుగులు

**బొగ్గు మంత్రిత్వ శాఖకు లేఖ పంపుతామని కోల్ ఇండియా యాజమాన్యం హామీ**

**మంచిర్యాల, 3, సెప్టెంబర్ (ప్రజాజ్యోతి):** కోల్ ఇండియా లిమిటెడ్ లో 12వ జేబీసీసీఐ (బొగ్గు పరిశ్రమ కోసం సంయుక్త ద్వైపాక్షిక కమిటీ) ఏర్పాటుపై చాలాకాలంగా కొనసాగుతున్న ప్రతిష్టంభన తొలగే పరిస్థితులు కనిపిస్తున్నాయి. గురువారం జరిగిన కోల్ ఇండియా అపెక్స్ జేసీసీ కీలక సమావేశంలో జేబీసీసీఐ--12 ఏర్పాటుకు అనుమతి కోరుతూ బొగ్గు మంత్రిత్వ శాఖకు లేఖ పంపుతామని యాజమాన్యం హామీ ఇచ్చింది. యాజమాన్యం నుంచి ఈ హామీ రావడంతో జేబీసీసీఐ--12 ఏర్పాటులో జాప్యాన్ని నిరసిస్తూ కార్మిక సంఘాలు సెప్టెంబర్ 12న రాంచీలో నిర్వహించ తలపెట్టిన సంయుక్త సమావేశాన్ని వాయిదా వేశాయి. అపెక్స్ జేసీసీ సమావేశంలో జేబీసీసీఐ--12 ఏర్పాటు అంశంపై సవివరంగా చర్చ జరిగింది. జేబీసీసీఐ ఏర్పాటులో జాప్యంపై కార్మిక సంఘాలు చాలాకాలంగా యాజమాన్యంపై ఒత్తిడి తెస్తూ వస్తున్నాయి. ఈ నేపథ్యంలో బొగ్గు మంత్రిత్వ శాఖకు లేఖ పంపుతామని యాజమాన్యం హామీ ఇవ్వడంతో ప్రస్తుతానికి తమ ఆందోళనను నిలిపి వేయాలని సంఘాలు నిర్ణయించాయి. అయితే కోల్ ఇండియా నుంచి మంత్రిత్వ శాఖకు లేఖ ఎప్పుడు వెళ్తుంది, దానిపై మంత్రిత్వ శాఖ ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనేది ఇప్పుడు కీలకంగా మారింది. మంత్రిత్వ శాఖ ఆమోదం లభించిన తర్వాతే 12వ జేబీసీసీఐ ఏర్పాటుకు సంబంధించిన అధికారిక ప్రక్రియ ముందుకు సాగే అవకాశం ఉంది. సమావేశంలో ఏఐటీయూసీ, హెచ్ఎంఎస్, సీఐటీయూ నాయకులు జేబీసీసీఐతో పాటు కార్మిక చట్టాలకు సంబంధించిన ప్రక్రియల్లో ఐఎన్టీయూసీని కూడా చేర్చాలని డిమాండ్ చేశారు. ఈ ప్రక్రియ నుంచి ఐఎన్టీయూసీని మినహాయించడం అనుచితమని వారు యాజమాన్యం దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై కోల్ ఇండియా యాజమాన్యం స్పందిస్తూ ఐఎన్టీయూసీకి సంబంధించిన కోర్టు కేసును పరిశీలిస్తామని తెలిపింది. కేసు ప్రస్తుత స్థితితో పాటు పెండింగ్‌లో ఉన్న న్యాయపరమైన అంశాలను సమీక్షించిన అనంతరం తదుపరి చర్యలపై నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. అపెక్స్ జేసీసీ సమావేశంలో పారిశ్రామిక సంబంధాల కోడ్--2020లోని నిబంధనలు, వాటిని కోల్ ఇండియాలో అమలు చేసే అవకాశాలపై కూడా చర్చ జరిగింది. కార్మిక సంఘాల ప్రతినిధులు కొత్త కార్మిక చట్టాలోని వివిధ నిబంధనలు, వాటి వల్ల కార్మికులపై పడే ప్రభావం, ఉద్యోగుల ప్రయోజనాలకు సంబంధించిన అంశాలపై తమ ఆందోళనలు, అభిప్రాయాలను యాజమాన్యానికి వివరించారు. జేబీసీసీఐ--12 ఏర్పాటైన అనంతరం పారిశ్రామిక సంబంధాలు, కార్మికుల హక్కులు, ఉద్యోగులకు సంబంధించిన పలు కీలక సమస్యలు ఈ వేదిక ద్వారా చర్చకు వచ్చే అవకాశం ఉందని కార్మిక సంఘాల ప్రతినిధులు తెలిపారు. కోల్ ఇండియా యాజమాన్యం తరపున చైర్మన్ బి. సాయిరామ్, డైరెక్టర్ (మానవ వనరులు) అదనపు బాధ్యతలు




నిర్వహిస్తున్న ముఖేష్ చౌదరి, డైరెక్టర్ (వ్యాపార అభివృద్ధి) ప్రతినిధులు సమావేశంలో పాల్గొన్నారు. కార్మిక సంఘాల తరపున బీఎంఎస్ నుంచి కె. లక్ష్మా రెడ్డి, హెచ్ఎంఎస్ నుంచి హర్భజన్ సింగ్ సిధు, ఐఎన్టీయూసీ నుంచి రామేంద్ర కుమార్, సీఐటీయూ నుంచి డి.డి. రామానందన్ పాల్గొన్నారు. జేబీసీసీఐ--12 ఏర్పాటులో జాప్యానికి నిరసనగా కార్మిక సంఘాలు సెప్టెంబర్ 12న రాంచీలో సంయుక్త సమావేశం నిర్వహించాలని ముందుగా నిర్ణయించాయి. అయితే అపెక్స్ జేసీసీ సమావేశంలో బొగ్గు మంత్రిత్వ శాఖకు లేఖ పంపుతామని యాజమాన్యం హామీ ఇవ్వడంతో ఆ కార్యక్రమాన్ని వాయిదా వేశారు. దీంతో ప్రస్తుతం అందరి దృష్టి కోల్ ఇండియా యాజమాన్యం మంత్రిత్వ శాఖకు లేఖ ఎప్పుడు పంపుతుంది, కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ దానిపై ఎలాంటి నిర్ణయం తీసుకుంటుంది అనే అంశాలపైనే కేంద్రీకృతమైంది. మంత్రిత్వ శాఖ ఆమోదం లభించిన అనంతరం 12వ జేబీసీసీఐ అధికారిక ఏర్పాటుకు సంబంధించిన ప్రక్రియ వేగం పుంజుకునే అవకాశాలు ఉన్నాయని పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి.

# జేబీసీసీఐ ఏర్పాటుకు బీఎంఎస్ కీలక ముందడుగు

**ఏబీకేఎంఎస్--బీఎంఎస్ కార్యదర్శి, నేషనల్ డస్ట్ ప్రివెన్షన్ కమిటీ సభ్యులు పి. మాధవ నాయక్**

**ఐఆర్ కోడ్‌లోని సెక్షన్ 14 నుంచి మినహాయింపు ఇవ్వాలని కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖకు లేఖ**



**మంచిర్యాల, 3, సెప్టెంబర్ (ప్రజాజ్యోతి):** కోల్ ఇండియా లిమిటెడ్‌లో జేబీసీసీఐ (జాయింట్ బైపార్టైట్ కమిటీ ఫర్ ది కోల్ ఇండస్ట్రీ) ఏర్పాటుకు బీఎంఎస్ కీలక ముందడుగు వేసిందని ఏబీకేఎంఎస్--బీఎంఎస్ కార్యదర్శి, నేషనల్ డస్ట్ ప్రివెన్షన్ కమిటీ సభ్యులు పి. మాధవ నాయక్ తెలిపారు. గురువారం సెప్టెంబర్ 3న కోల్‌కతాలో కోల్ ఇండియా ఏపెక్స్ బోర్డు సమావేశం జరిగింది. ఈ సమావేశంలో బొగ్గు పరిశ్రమకు సంబంధించిన పలు అంశాలతో పాటు జేబీసీసీ ఏర్పాటుపై ప్రత్యేకంగా కీలక చర్చ జరిగింది. కొత్త లేబర్ కోడ్ అమలులోకి వచ్చిన నేపథ్యంలో జేబీసీసీ ఏర్పాటు విషయంలో ఉన్న న్యాయపరమైన అంశాలు, ఎదురవుతున్న అడ్డంకులపై సమావేశంలో చర్చించినట్లు ఏబీకేఎంఎస్--బీఎంఎస్ కార్యదర్శి, నేషనల్ డస్ట్ ప్రివెన్షన్ కమిటీ సభ్యులు పి. మాధవ నాయక్ తెలిపారు. ఈ సందర్భంగా బీఎంఎస్ జాతీయ నాయకులు కొత్తకాపు లక్ష్మారెడ్డి కోల్ ఇండియా యాజమాన్యంతో జేబీసీసీ ఏర్పాటుకు సంబంధించిన అంశాలపై చర్చించారు. ఐఆర్ కోడ్‌లోని సెక్షన్ 14 నుంచి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక మినహాయింపు ఇవ్వడం ద్వారా జేబీసీసీ ఏర్పాటు చేయడానికి మార్గం సుగమం చేయవచ్చని కొత్తకాపు లక్ష్మారెడ్డి సమావేశంలో వివరించినట్లు మాధవ నాయక్ తెలిపారు. కార్మికులు, యాజమాన్యం మధ్య ద్వైపాక్షిక చర్చల వ్యవస్థ కొనసాగేందుకు జేబీసీసీ ఏర్పాటు ఎంతో కీలకమన్నారు. జేబీసీసీ ఏర్పాటు కోసం ఐఆర్ కోడ్‌లోని సెక్షన్ 14 నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరుతూ కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖకు లేఖ రాయాలని గురువారం జరిగిన కోల్ ఇండియా ఏపెక్స్ బోర్డు సమావేశంలో నిర్ణయించినట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఈ మినహాయింపును మంజూరు చేస్తే జేబీసీసీ ఏర్పాటుకు సంబంధించిన న్యాయపరమైన అడ్డంకులు తొలగి, కమిటీ ఏర్పాటుకు మార్గం సుగమం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. జేబీసీసీ ఏర్పాటు ద్వారా బొగ్గు పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికుల వేతన సవరణలు, కార్మిక సంక్షేమం, ఉద్యోగ భద్రత, ఉద్యోగ సంబంధిత సమస్యలు, ఇతర కార్మిక ప్రయోజనాలపై యాజమాన్యం--కార్మిక సంఘాల మధ్య ద్వైపాక్షిక చర్చలకు ఒక సమర్థవంతమైన వేదిక ఏర్పడుతుందని తెలిపారు. కార్మికుల సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించేందుకు ఇది ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. బొగ్గు పరిశ్రమలో కార్మికుల ప్రయోజనాలను కాపాడటంలో ద్వైపాక్షిక చర్చల వ్యవస్థకు ప్రత్యేక ప్రాధాన్యత ఉందని, జేబీసీసీ ఏర్పాటుతో కార్మికుల సమస్యలు, వేతన సవరణలు, సంక్షేమ అంశాలపై ప్రతినిధుల ద్వారా చర్చించి పరిష్కార మార్గాలు కనుగొనే అవకాశం ఉంటుందని తెలిపారు. కార్మికుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని జేబీసీసీ ఏర్పాటు కోసం బీఎంఎస్ నిరంతరం కృషి చేస్తోందని పి. మాధవ నాయక్ తెలిపారు. కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖకు లేఖ రాసి ఐఆర్ కోడ్‌లోని సెక్షన్ 14 నుంచి అవసరమైన మినహాయింపు కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరనున్నట్లు తెలిపారు . బొగ్గు పరిశ్రమలోని వేలాది మంది కార్మికులకు సంబంధించిన వేతనాలు, సంక్షేమం, ఉద్యోగ సంబంధిత అంశాలపై సమగ్రంగా చర్చించేందుకు జేబీసీసీ ఏర్పాటు అవసరమని, ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించి త్వరితగతిన నిర్ణయం తీసుకోవాలని బీఎంఎస్ తరఫున కోరుతున్నట్లు ఏబీకేఎంఎస్--బీఎంఎస్ కార్యదర్శి, నేషనల్ డస్ట్ ప్రివెన్షన్ కమిటీ సభ్యులు పి. మాధవ నాయక్ తెలిపారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను, రైతులను మోసం చేస్తున్నారు.

**--మాజీ ఎమ్మెల్యే దివాకర్ రావు**



**లక్షెట్టిపేట, సెప్టెంబర్ 3(ప్రజాజ్యోతి) :** కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి వెయ్యి రోజులు అవుతున్న ప్రజలను, రైతులకు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా మోసం చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే దివాకర్ రావు విమర్శించారు. గురువారం స్థానిక ఐబి చౌరస్తా నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు బీ ఆర్ ఎస్ నాయకులు, ప్రజలతో కలిసి పెద్ద ఎత్తున ర్యాలీగా తరలివచ్చి అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజే శారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం దోచుకోవడం, దాచుకోవడమే ధ్యేయంగా పని చేస్తుందని. కాంగ్రెస్ ప్రభుత్వం గద్దె నెక్కడానికి అనేక రకాల హామీలిచ్చి, ఇప్పుడు ప్రజలను అన్ని రకాలుగా మోసం చేస్తోందని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం పాలన చేతకాని ప్రభుత్వం అని విమర్శలు గుప్పించారు. మూడు నెలల్లో హామీలు అమలులోకి వస్తాయని చెప్పి, 33 నెలలు గడిచిన ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుందని, మళ్ళీ కేసీఆర్ సీఎం అవుతారని ధీమా వ్యక్తం చేశారు. అప్పుడు ఇలాంటి మోసపురిత స్కాములు జరగవని అన్నారు. మళ్ళీ మాజీ సీఎం కేసీఆర్ అధికారం చేపడితేనే తెలంగాణ ప్రజలకు మేలు జరుగుతుం దని వివరించారు. ఈ ప్రభుత్వం రైతులను, నిరుద్యోగులను, కార్మికు లను అందరినీ మోసం చేస్తుందని విమర్శించారు. దోచుకోవడం, దాచుకోవడమే కాంగ్రెస్ పనిగా పెట్టుకుందన్నారు. మహిళలకు ప్రతి నెల రూ. 2500 లతో పాటు కల్యాణ లక్ష్మీలో తులం బంగారం ఇస్తామని ఆశ పెట్టి ఓట్లు వేయించుకున్నారని ఏద్దేవా చేశారు. ప్రజలు కాంగ్రెస్ పాలనలో అన్ని రకాలుగా నష్టపోయారని, ఇప్పటికైనా ప్రభుత్వం ప్రజలకు మేలు చేయకుంటే మరిన్ని ఆందో ళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. అనంతరం వంట వార్పు నిర్వహించి ప్రభుత్వం విధానాలపై నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీ ఆర్ ఎస్ రాష్ట్ర నాయకులు విజిత్ రావు, మాజీ మున్సిపల్ చైర్మన్ నల్మాసు కాంతయ్య, వైస్ చైర్మన్ పోడేటి శ్రీనివాస్ గౌడ్, మాజీ డీసీ ఎమ్మెస్ చైర్మన్ కేతిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, మండ లాధ్యక్షుడు చుంచు చిన్నయ్య, నాయకులు అంకతి గంగాధర్, తిరుపతి, అంకతి రమేష్, రవిలతో పాటు లక్షెట్టిపేట, దండేపల్లి మండలాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు సతీమణిని పరామర్శించిన కాంగ్రెస్ నాయకులు



**తిర్యాణి, సెప్టెంబర్ 3 (ప్రజాజ్యోతి):** ఆసిఫాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు సతీమణిని గురువారం తిర్యాణి మండల కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు చిత్తారీ సాగర్‌తో పాటు పలువురు సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పరామర్శించారు. ఆమె ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, ధైర్యం చెప్పారు. త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తిర్యాణి గ్రామ పంచాయతీ సర్పంచ్ మాడావి రాజేష్, గంభీరావుపేట సర్పంచ్ జుమ్మిడి కిష్టయ్య, నాయకపుగూడ సర్పంచ్ ఎదుల సుమలత--శ్రీనివాస్, కన్నెపల్లి సర్పంచ్ తుంరం మాన్కు, తలండి సర్పంచ్ నైతం మంగు, ఉపసర్పంచ్ పవన్ నంద, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మల్యాల అశోక్, కోర్వి శ్రీనివాస్, పెద్దల చిన్నయ్య, చుంచు చంద్రమౌళి, బోర్లా కుంట విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

## నీటి సరఫరా ప్రణాళిక బద్ధంగా చేపట్టాలి

**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**





**మంచిర్యాల, 3,సెప్టెంబర్ (ప్రజాజ్యోతి):** ఎల్ నినో ప్రభావంతో లోటు వర్షపాతం నమోదయ్యే నేపథ్యంలో నీటి సరఫరా ప్రణాళిక బద్ధంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్లు పి. చంద్రయ్య, వి.రాములు, జిల్లా అటవీ అధికారి రాహుల్ కిషన్ జాదవ్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ విలాయత్ అలీ, జిల్లా రెవెన్యూ అధికారి మోతిరామ్ లతో కలిసి నీటిపారుదల, వ్యవసాయ, పంచాయితీ, మత్స్య, పర్యాటక శాఖల అధికారులతో సమీక్ష సమావేశంను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎల్ నినో ప్రభావంతో లోటు వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నందున ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నీటి సరఫరా చేసేందుకు ప్రణాళిక కార్యాచరణ రూపొందించి ప్రణాళిక బద్ధంగా అమలు చేయాలని తెలిపారు. చెరువులకు సమీప అటవీ ప్రాంతాలలో ఎలాంటి ఆక్రమిత చర్యలకు పాల్పడకుండా నిబంధనల ప్రకారం అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. వ్యవసాయ, రెవెన్యూ, అటవీ అధికారుల సమన్వయంతో చర్యలు చేపట్టాలని తెలిపారు. ఎల్ నినో ప్రభావం ఉన్నందున నీటి సంరక్షణకు చర్యలు తీసుకోవా లని, నీటి విడుదలలో ఉన్నతాధికారుల ఆదేశాలను పాటిస్తూ తదుపరి చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## వివేకానంద పాఠశాలలో కృష్ణాష్టమి వేడుకలు



**జన్నారం, సెప్టెంబర్3(ప్రజాజ్యోతి)** జన్నారం మండలంలోని కలమడుగు వివేకానంద ఆంగ్లమ పాఠశాలలో గురువారం రోజున శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. శ్రీకృష్ణ జన్మాష్టమి రోజు సెలవు దినం కావడంతో ఒక్కరోజు ముందుగానే పాఠశాలల్లో ఈ వేడుకలు నిర్వహించారు. వివేకా నంద పాఠశాలలో చిన్నారులు గోపికలు, శ్రీకృష్ణుని వేషధారణలతో అలరించారు. గోపికమ్మ చాలును లేమా అంటూ శ్రీకృష్ణ వేషాదరణ గల చిన్నారులు నృత్యాలు చేయడం పలువురిని ఆకర్షించింది. పాఠశాల కరస్పాండెంట్ సతీష్ గౌడ్ మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం వలన పిల్లలకు మన సంస్కృతి, సాంప్రదాయాల పైన అవగాహన కలుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో వివేకానంద పాఠశాల కరస్పాండెంట్ సతీష్ గౌడ్, ఇన్చార్జీలు తిరుపతి, మహేష్ ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలి

## జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్

**ఆసిఫాబాద్ సెప్టెంబర్ 3 ప్రజా జ్యోతి** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో నాణ్యమైన విద్యాబోధన అందించాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్ సూచించారు. గురువారం ఆసిఫాబాద్ మండలం బూరుగూడ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. తరగతి గదులు, విద్యార్థుల హాజరు పట్టికలు, బోధన తీరు, పాఠశాల పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి విద్యా ప్రగతిపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి అదనపు బోధన అందిస్తూ వారి అభ్యసన సామర్థ్యాన్ని పెంపొందించాలని సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం విద్యార్థులకు పౌష్టికాహారం నాణ్యమైన భోజనం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థుల ఆరోగ్యం, పరిశుభ్రతకు



ప్రాధాన్యం ఇవ్వడంతోపాటు పాఠశాల పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలని తెలిపారు. విద్యతోపాటు విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి అనుకూల వాతావరణాన్ని పాఠశాలలో కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఉత్పత్తి కన్నా ఉద్యోగుల భద్రతే ప్రధానం








**ప్రమాద రహిత సింగరేణి కోసం అన్ని రకాల చర్యలు**

**రక్షణ పెంపుదలకు ఆధునిక సాంకేతికత వినియోగం**

**సింగరేణి సీఎండీ డా. బుద్ధప్రకాష్ జ్యోతి**

**కార్మిక సంఘాల ప్రతినిధుల తో 50వ త్రైపాక్షిక భద్రతా సమీక్షా సమావేశం**

**మంచిర్యాల, 3,సెప్టెంబర్ (ప్రజాజ్యోతి):** సింగరేణిలో బొగ్గు ఉత్పత్తి కన్నా ఉద్యోగుల భద్రతకే అధిక ప్రాధాన్యత ఇస్తామని, ప్రమాదరహిత సింగరేణి కోసం అన్ని రకాల చర్యలు తీసుకుంటామని సింగరేణి ఛైర్మన్, ఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి తెలిపారు. కార్మిక సంఘాల ప్రతినిధులు చేసిన సూచనలను పరిగణనలోకి తీసుకుని భద్రతా చర్యలను మరింత పటిష్టం చేస్తామని ఆయన స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో గురువారం జరిగిన 50వ త్రైపాక్షిక భద్రతా సమీక్షా సమావేశంలో ఆయన మాట్లడారు . ఈ సమావేశంలో డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ అధికారులు, సింగరేణి అధికారుల సంఘం, గుర్తింపు, ప్రాతినిధ్య కార్మిక సంఘాల నాయకులు, యాజమాన్య ప్రతినిధులు పాల్గొని సింగరేణి గనుల్లో రక్షణ చర్యలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి మాట్లాడుతూ ప్రమాదాల నివారణకు తీసుకుంటున్న చర్యలు క్షేత్రస్థాయిలో ఏ విధంగా అమలవుతున్నాయి, గతంలో జరిగిన పొరపాట్లు మళ్లీ పునరావృతమవుతున్నాయా, ప్రమాదరహిత మైనింగ్ కోసం అందుబాటులో ఉన్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఏమిటి అనే అంశాలను పరిశీలించి తగిన నిర్ణయాలు తీసుకుంటామని తెలిపారు. సమావేశంలో యూనియన్ నాయకులు చేసిన సూచనలపై తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు . ఈ సమావేశంలో పాల్గొన్న డైరెక్టర్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ డాక్టర్ సగేష్ కుమార్ మాట్లాడుతూ, కార్మిక సంఘాలు ఎన్నో విలువైన సూచనలు చేశారని, భద్రత విషయంలో సింగరేణి యాజమాన్యం, కార్మిక సంఘాలు నిబద్ధతతో పనిచేయడం సంతోషకరమన్నారు. గతంతో పోలిస్తే ఈ ఏడాది ప్రాణాపాయ ప్రమాదాల సంఖ్య గణనీయంగా తగ్గడం అభినందనీయమన్నారు. ఓపెన్‌కాస్ట్ గనుల్లో సింగరేణి ఉద్యోగులతో పాటు కాంట్రాక్ట్ కార్మికులు కూడా ఒకే చోట బయోమెట్రిక్ విధానంలో హాజరు నమోదు చేసే పద్ధతిని వెంటనే అమలు చేయాలని సూచించారు. సింగరేణి ఉద్యోగుల రక్షణ పెంపుదలకు అవసరమైన శిక్షణ అందించేందుకు తాము ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటామని తెలిపారు. ఈ సమావేశంలో సింగరేణి కాలరీస్ వర్కర్స్ గుర్తింపు కార్మిక సంఘం అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, కార్యదర్శి రాజ్ కుమార్, ప్రాతినిధ్య కార్మిక సంఘం ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఎస్. నరసింహారెడ్డి, అధికారుల సంఘం అధ్యక్షుడు తాళ్లపల్లి లక్ష్మీపతిగౌడ్, ప్రధాన కార్యదర్శి పెద్ది నరసింహులు పాల్గొన్నారు. వివిధ ఏరియాల నుంచి హాజరైన ప్రతినిధులు సింగరేణి వ్యాప్తంగా భద్రతా చర్యలను మరింత పెంచడంతో పాటు ఆరోగ్య, వైద్య సేవలను మెరుగుపరచాలని పలు సూచనలు చేశారు. తమ గనుల్లో నెలకొన్న సమస్యలను సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. సిబ్బంది కొరతను తగ్గించాలని, ఆధునిక వైద్య సేవలు అందించాలని, కాంట్రాక్ట్ కార్మికులకు కూడా తగిన శిక్షణ ఇప్పించాలని, నాణ్యమైన బూట్లు సరఫరా చేయాలని, గనుల్లో అవసరమైన సూపర్‌వైజర్లు, సిబ్బంది, అధికారులను నియమించాలని, స్పేర్ పార్ట్స్ అందుబాటులో ఉంచాలని సూచించారు. దీనిపై యాజమాన్యం తరపున తగిన చర్యలు తీసుకుంటామని ఉన్నతాధికారులు హామీ ఇచ్చారు. ఈ సమావేశానికి జనరల్ మేనేజర్ (సేఫ్టీ) సాయిబాబు స్వాగతం పలికారు. ముందుగా ఇటీవలి ప్రమాదాల్లో మృతి చెందిన కార్మికులకు సమావేశం సంతాపం తెలిపింది. అనంతరం గత ఏడాది త్రైపాక్షిక భద్రతా సమావేశంలో తీసుకున్న నిర్ణయాలపై చర్చించారు. సుహృద్భావ వాతావరణంలో సమావేశం కొనసాగింది. ఈ సమావేశంలో సీఎండీతో పాటు డైరెక్టర్ (ఆపరేషన్స్) ఎల్.వి. సూర్యనారాయణ, డైరెక్టర్ (ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్) కె. వెంకటేశ్వర్లు, డైరెక్టర్ (పర్సనల్ అండ్ ఫైనాన్స్) గౌతమ్ పొట్రు, డైరెక్టర్ (ఈ అండ్ ఎం) ఎం. తిరుమలరావు, జనరల్ మేనేజర్ (కోఆర్డినేషన్ అండ్ మార్కెటింగ్) తాడబోయిన శ్రీనివాస్, అన్ని ఏరియాల జనరల్ మేనేజర్లు, కార్పొరేట్ జనరల్ మేనేజర్లు, డీజీఎంఎస్ నుంచి డైరెక్టర్స్ ఆఫ్ మైన్ సేఫ్టీ డాక్టర్ సగేష్ కుమార్, డాక్టర్ ఐ. సత్యనారాయణ, రాజ్ కుమార్, కె. మహేశ్వరరెడ్డి, పంకజ్ కుమార్ జైన్, డిప్యూటీ డైరెక్టర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## గూడెం అంగన్వాడీ కేంద్రంలో ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు



దండేపల్లి, సెప్టెంబర్ 3(ప్రజాజ్యోతి ):స్థానిక గూడెం ప్రాథమిక పాఠ శాల ప్రాంగణంలోని అంగన్వాడీ కేంద్రంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడు కలను గురువారం నాడు అత్యంత వైభవంగా, ఉత్సాహభరిత వాతావ రణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా అంగ న్వాడీ కార్యకర్తలు చిన్నా రులకు శ్రీకృష్ణుడు, రాధమ్మల వేషధారణలు వేసి ముస్తాబు చేశారు. చిన్నారి గోపాలుర లీలలు, నృత్యాలు ఆకట్టుకున్నాయి. అనంతరం సాంప్రదాయబద్ధంగా ఏర్పాటు చేసిన "ఉట్టి కొట్టే" కార్యక్రమం వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఉట్టిని కొట్టేందుకు చిన్నారులు పోటీపడటంతో వాతావరణం అంతా కోలాహలంగా మారింది. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్, ఆయా, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొని పిల్లలకు తీపి పదార్థాలు పంపిణీ చేశారు. మన సంస్కృతీ సాంప్రదాయాలను పిల్లలకు చిన్నతనం నుంచే తెలియజేయడానికే ఇలాంటి పండుగలను కేంద్రంలో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

## సకాలంలో స్పందించిన 108.. తల్లీబిడ్డ సురక్షితం



**ఆసిఫాబాద్ సెప్టెంబర్ శ్రీ** పురిటి నొప్పులతో ఆస్పత్రికి వెళ్తున్న మహిళకు మార్గమధ్యంలోనే 108 అంబులెన్సులో ప్రసవం జరిగింది. ఆసిఫాబాద్ మండలం అంకుసాపూర్ గ్రామానికి చెందిన బండే సుజాతకు పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108కు సమాచారం అందించారు. దీంతో ఈఎంటీ ప్రవీణ్ యాదవ్, పైలట్ రమేష్ అంబులెన్సులో ఆమెను ఆసిఫాబాద్ ఆస్పత్రికి తరలిస్తున్నారు. అయితే మార్గమధ్యంలో నొప్పులు తీవ్రం కావడంతో అంబులెన్సును నిలిపి ఈఎంటీ ప్రవీణ్ యాదవ్ ప్రసవం చేశారు. సుజాత మగబిడ్డకు జన్మని చ్చింది. తల్లీబిడ్డను అనంతరం ఆస్పత్రికి తరలించి వైద్యుల పర్య వేక్షణలో ఉంచారు. సకాలంలో స్పందించి సురక్షితంగా ప్రసవం చేయడంలో సహకరించిన 108 సిబ్బంది ప్రవీణ్ యాదవ్, పైలట్ రమేష్‌కు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

## వైభవంగా ముగిసిన సత్యదేవుని పవిత్రోత్సవాలు



**దండేపల్లి సెప్టెంబర్ 3 (ప్రజాజ్యోతి):** మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం గూడెం గుట్ట శ్రీ సత్యనా రాయణ స్వామి దేవస్థా నంలో మూడు రోజుల పాటు సాగిన పవిత్రోత్స వాలు గురువారం వైభ వంగా ముగిశాయి. పవి త్రోత్సవాల్లో భాగం పూజల చివరి రోజైన మూడో రోజున యజ్ఞాచార్యులు అభిరామాచార్యులు గారి ఆధ్వర్యంలో మహా పూ ర్ణాహుతి, పవిత్ర అవరోహణము, స్నపన తిరుమంజనం, కుంభ ప్రోక్షణ, హారతి, మంత్ర పుష్పం, మహాదాశీర్వచనము తదితర ప్రత్యేక పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాద వితరణ చేపట్టారు. ఈ పూజా కార్యక్రమాల్లో ముఖ్య అర్చకులు గోవర్ధన రఘుస్వామి, వేదపండితులు డి.నారాయణ శర్మ, జి.భజరత్ శర్మ, అర్చకులు జి.సంపత్ స్వామిలతో పాటు ఇతర అర్చకులు, ఆలయ సిబ్బంది, భక్తులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు.

## తెలంగాణలో కాంగ్రెస్ ప్రజా పాలనకు 1000 రోజులు

### గుడిహత్నూర్‌లో కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు



**గుడిహత్నూర్, సెప్టెంబర్ 3, (ప్రజా జ్యోతి )**తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలన ప్రారంభించి 1000 రోజులు పూర్తిచేసుకున్న సందర్భంగా గుడిహత్నూర్ మండల కేంద్రంలోని అంబేద్కర్ స్తూపం వద్ద కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఘనంగా సంబ రాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్య కర్తలు మిఠాయిలు పంచుకొని హర్షం వ్యక్తం చేశారు. గుడి హత్నూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమా నికి పలు వురు పార్టీ నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తొడసం దౌలత్ రావు మాట్లా డుతూ తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రజా సంక్షేమం, అభివృద్ధి, సా మాజిక న్యాయానికి ప్రాధా న్యత ఇస్తూ ముందుకు సాగుతోందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజలకు ఇచ్చిన హామీ లను అమలు చేస్తూ ప్రజా పాలనకు కొత్త దిశను చూపుతున్నామని పేర్కొన్నారు కేంద్రంలోని మోదీ ప్రభుత్వం తెలంగాణ పట్ల వివక్ష చూపుతోంద ని తొడసం దౌలత్ రావు విమర్శించారు. రాష్ట్రానికి రావాల్సిన నిధులు, హక్కుల విషయంలో కేంద్రం తగిన సహకారం అందించడం లేదని ఆరోపించారు. అయినప్పటికీ రాష్ట్రప్రభుత్వం ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం నిరంతరం కృషి చే స్తోందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల కోసం చేపడుతున్న కార్యక్రమాలను కార్యకర్తలు ప్రతి గ్రామానికి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డీసీసీ జనరల్ సెక్రెటరీ ఉయిక అనసూయ, మండల ఎస్సీ సె ల్ అధ్యక్షులు వాగ్మారె వి శ్వాంబర్, సూర్యగూడ సర్పంచ్ రహీం, మాజీ గుడి హత్నూర్ జడ్పీటీసీ మాస్కె మాధవ్, కోలారి మాజీ సర్పంచ్ బాలాజీ పటేల్, లింగాపూర్ ఉప సర్పంచ్ మోతివర్ గణపతి, వార్డు మెంబర్లు మాజీద్, ఆసిఫ్, అరీఫ్, గణేష్ గౌడ్, పోలె విష్ణు, జలీల్, సత్యనా రాయణ, మెస్రం నారాయణ, ఆడే జైపాల్, రాథోడ్ రమేష్, తార రమేష్, శేఖర్ దోమటి సురేష్, వసిం ఖాన్ తదితర మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## జేబీసీసీఐ ఏర్పాటుకు బొగ్గు మంత్రిత్వ శాఖకు లేఖ

### కోల్ ఇండియా యాజమాన్యం హామీ
### సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు మంద నరసింహారావు



**మంచిర్యాల, 3,సెప్టెంబర్ (ప్రజాజ్యోతి):** కోల్ ఇండియాలో 12వ జాయింట్ బైపార్టైట్ కమిటీ ఫర్ ది కోల్ ఇండస్ట్రీ (జేబీసీసీఐ) ఏర్పాటు కోసం బొగ్గు మంత్రిత్వ శాఖకు లేఖ రాయనున్నట్లు కోల్ ఇండియా యాజమాన్యం హామీ ఇచ్చిందని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు మంద నరసింహారావు తెలిపారు. కోల్‌కతాలో కోల్ ఇండియా యాజమాన్యం, ట్రేడ్ యూనియన్లతో గురువారం జరిగిన అపెక్స్ జేసీసీ సమావేశంలో ఈ హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు. జేబీసీసీఐ ఏర్పాటు విషయంలో జరుగుతున్న దీర్ఘకాలిక జాప్యంపై నాలుగు ప్రధాన కార్మిక సంఘాలు ఐక్యంగా యాజమాన్యంపై ఒత్తిడి తీసుకువస్తున్నాయని తెలిపారు. ఇందులో భాగంగా జూలై 1న డిమాండ్ డే, ఆగస్టు 10న జీఎం కార్యాలయాల ఎదుట పెద్ద ఎత్తున ధర్నాలు నిర్వహించినట్లు తెలిపారు . యాజమాన్యం హామీ నేపథ్యంలో రాంచీలో సెప్టెంబర్ 12న హెచ్ఎంఎస్, ఐఎన్‌టీ యూసీ, ఏఐటీయూసీ, సీఐటీయూ ఆధ్వర్యంలో జరగాల్సిన సంయుక్త సమావేశాన్ని వాయిదా వేసినట్లు మంద నరసింహారావు తెలిపారు. బొగ్గు మంత్రిత్వ శాఖ ఆమోదం లభించిన అనంతరం మాత్రమే అధికారిక వేతన ఒప్పంద కమిటీ ఏర్పాటు ప్రక్రియ ముందుకు సాగుతుందని పేర్కొన్నారు.

**ఐఎన్‌టీయూసీని కూడా చేర్చాలి**

అపెక్స్ జేసీసీ సమావేశంలో ఏఐటీయూసీ, హెచ్ఎంఎస్, సీఐటీయూ నాయకులు జేబీసీసీఐతో పాటు కార్మిక చట్టానికి సంబంధించిన ప్రక్రియలో ఐఎన్‌టీయూసీని కూడా చేర్చాలని డిమాండ్ చేసినట్లు మంద నరసింహారావు తెలిపారు. ఐఎన్‌టీయూసీని ఈ ప్రక్రియ నుంచి మినహాయించడం సరికాదని యూనియన్ నాయకులు స్పష్టం చేశారని చెప్పారు. ఐఎన్‌టీయూసీకి సంబంధించిన కోర్టు కేసు నిర్ణయాన్ని సమీక్షించిన అనంతరం తదుపరి నిర్ణయం తీసుకుంటామని యాజమాన్యం తెలిపిందన్నారు.

**పారిశ్రామిక సంబంధాల కోడ్‌పైనా చర్చ**

అపెక్స్ జేసీసీ సమావేశంలో పారిశ్రామిక సంబంధాల కోడ్ 2020లోని నిబంధనలు, కోల్ ఇండియాలో దాని అమలుపై కూడా చర్చ జరిగినట్లు ఆయన తెలిపారు. కార్మిక చట్టంలోని వివిధ నిబంధనలు, వాటి అమలు వల్ల కార్మికులపై పడే ప్రభావం, ట్రేడ్ యూనియన్లు ఎదుర్కొంటున్న సమస్యలను యూనియన్ ప్రతినిధులు యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లారని తెలిపారు. జేబీసీసీఐ ఏర్పాటు అనంతరం పారిశ్రామిక సంబంధాలు, కార్మిక రంగానికి సంబంధించిన అనేక ముఖ్యమైన అంశాలపై సమగ్రంగా చర్చించనున్నట్లు యాజమాన్యం తెలిపిందన్నారు. జేబీసీసీఐ ఏర్పాటుకు బొగ్గు మంత్రిత్వ శాఖకు లేఖ రాయాలనే యాజమాన్య నిర్ణయం కార్మిక సంఘాల ఐక్య పోరాటానికి లభించిన కీలక ముందడుగు అని మంద నరసింహారావు అన్నారు. ఈ సమావేశానికి కోల్ ఇండియా యాజమాన్యం తరఫున చైర్మన్ బి. సాయిరామ్, డైరెక్టర్ (మానవ వనరులు), డైరెక్టర్ (వ్యాపార అభివృద్ధి) అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న ముఖేష్ చౌదరి హాజరయ్యారు. ట్రేడ్ యూనియన్ల తరఫున బీఎంఎస్ నుంచి కె. లక్ష్మా రెడ్డి, హెచ్ఎంఎస్ నుంచి హర్భజన్ సింగ్ సిద్ధు, ఏఐటీయూసీ నుంచి రామేంద్ర కుమార్, సీఐటీయూ నుంచి డి.డి. రామానందన్ పాల్గొన్నారు.

# భగీరథ ట్యాంకులకు 'నీటి' కరువు!

**నిర్మాణాలు పూర్తయినా.. ప్రజల దాహం తీరని వైనం అర్జుగూడ, శివకేశనగర్‌లో లక్షల రూపాయలతో నిర్మించిన ట్యాంకులు నిరుపయోగం ట్యాంకులు ఉన్నాయి. నీళ్లు మాత్రం రావడం లేదు అంటున్న స్థానికులు అధికారుల నిర్లక్ష్యంపై బీజేపీ జిల్లా యువనాయకుడు దుర్గం ప్రశాంత్ ఆగ్రహం**

**ఆసిఫాబాద్ ఆర్సీ, సెప్టెంబర్ 03 (ప్రజాజ్యోతి):** ప్రతి ఇంటికీ తాగునీరు.. మిషన్ భగీరథ పథకం ప్రధాన లక్ష్యం ఇదే. ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం భారీగా నిధులు కేటాయించి నీటి ట్యాంకులు, పైపులైన్లు, పంపింగ్ వ్యవస్థలను ఏర్పాటు చేసింది. కానీ కొన్ని ప్రాంతాల్లో నిర్మాణాలు పూర్తయినా.. వాటి ద్వారా ప్రజలకు ఆశించిన స్థాయిలో నీరు అందడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. వాంకిడి మండల కేంద్రంలోని అర్జుగూడ, శివకేశనగర్ ప్రాంతాల్లో మిషన్ భగీరథ పథకం కింద నిర్మించిన ట్యాంకుల పరిస్థితి ప్రస్తుతం ఇదే తీరుగా ఉందని బీజేపీ జిల్లా యువనాయకుడు దుర్గం ప్రశాంత్ ఆరోపించారు. లక్షల రూపాయల ప్రజాధనంతో నిర్మించిన ట్యాంకులు వినియోగంలోకి రాకపోవడం, మరోవైపు ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు ఎదుర్కోవాల్సి రావడం ఆందోళన కలిగించే విషయమన్నారు. ప్రభుత్వం ఒకవైపు తాగునీటి మౌలిక వసతుల కోసం నిధులు వెచ్చిస్తుంటే.. మరోవైపు క్షేత్రస్థాయిలో వాటి నిర్వహణ, నీటి సరఫరాపై పర్యవేక్షణ లోపించడం వల్ల అసలు లక్ష్యం నీరుగారుతోందని పేర్కొన్నారు.

**ట్యాంకుల నిర్మాణంతోనే బాధ్యత పూర్తయిందా?**

అర్జుగూడ, శివకేశనగర్‌లో ట్యాంకుల నిర్మాణం పూర్తయినప్పటికీ వాటిని పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకురావడంలో ఎందుకు జాప్యం జరుగుతోందో అధికారులు సమాధానం చెప్పాలని ప్రశాంత్ డిమాండ్ చేశారు. ట్యాంకు నిర్మించడం ఒక నిర్మాణ పనిగా మాత్రమే చూడకూడదు. దానికి నీరు చేరాలి.. నీరు నిల్వ కావాలి.. అక్కడి నుంచి పైపులైన్ల ద్వారా ప్రతి కుటుంబానికి సరఫరా కావాలి. అప్పుడే ఆ నిర్మాణానికి అర్థం ఉంటుంది. ట్యాంకు ఉంది.. పైపులైన్ ఉంది.. కానీ నల్లాల్లో నీరు రాకపోతే ప్రజలకు దాని వల్ల ప్రయోజనం ఏమిటి?" అని ఆయన ప్రశ్నించారు. ప్రభుత్వ రికార్డుల్లో పనులు పూర్తయినట్లు కనిపించడం కంటే క్షేత్రస్థాయిలో ప్రజలకు సేవలు అందుతున్నాయా లేదా అనేది అధికారులు పరిశీలించాల్సిన అవసరం ఉందన్నారు.

**రూ.25 లక్షలు ఖర్చు.. ప్రయోజనం శూన్యమా?**

ఒక్కో ట్యాంకు నిర్మాణానికి సుమారు రూ.25 లక్షల వరకు ఖర్చు చేసినట్లు చెబుతున్న నేపథ్యంలో.. ఇంతటి భారీ మొత్తాన్ని వెచ్చించి నిర్మించిన మౌలిక వసతులు ప్రజలకు ఉపయోగపడకపోవడంపై ప్రశ్నలు తలెత్తుతున్నాయని ప్రశాంత్ అన్నారు.ప్రజల సొమ్ముతో నిర్మించిన ట్యాంకులు ప్రజల దాహం తీర్చడానికి ఉపయోగపడాలి. నిర్మాణానికి లక్షలు ఖర్చు చేసి, తర్వాత నిర్వహణను పట్టించుకోక పోతే అది ప్రజాధనానికి న్యాయం చేసినట్లు కాదు. నిధులు ఎక్కడ ఖర్చయ్యాయి అనే దానితో పాటు.. ఆ నిధులతో నిర్మించిన వసతులు ప్రజలకు ఎంత మేరకు ఉపయోగపడుతున్నాయో కూడా అధికారులు చెప్పాలి" అని ఆయన అన్నారు. ట్యాంకులు ఎందుకు పనిచేయడం లేదనే అంశంపై అధికారులు సాంకేతికంగా తనిఖీ నిర్వహించి పూర్తి నివేదిక రూపొందించాలని డిమాండ్ చేశారు.

**పైపులైన్ల పరిస్థితిపై తనిఖీ ఏది?**

మిషన్ భగీరథ నీటి సరఫరా వ్యవస్థలో ట్యాంకులు ఒక భాగం మాత్రమేనని ప్రశాంత్ తెలిపారు. నీటి వనరు నుంచి ట్యాంకుకు నీరు చేరడం, మోటార్ల ద్వారా పంపింగ్ చేయడం, విద్యుత్ సరఫరా ఉండటం, ట్యాంకు నుంచి పైపులైన్ల ద్వారా ఇళ్లకు నీరు చేరడం.. ఇలా మొత్తం వ్యవస్థ సమన్వయంతో పనిచేయాల్సి ఉంటుందని అన్నారు.ఎక్కడైనా పైపులైన్ దెబ్బతిన్నా, లీకేజీ ఏర్పడినా, మోటార్ పనిచేయకపోయినా లేదా విద్యుత్ సమస్య ఉన్నా మొత్తం నీటి సరఫరా వ్యవస్థపై ప్రభావం పడుతుందని పేర్కొన్నారు. సమస్య ఎక్కడ ఉందో గుర్తించకుండా ఒకరిపై ఒకరు నెపం వేసుకోవడం వల్ల ప్రజల సమస్య పరిష్కారం కాదు. సంబంధిత శాఖల అధి కారులు కలిసి క్షేత్రస్థాయిలో తనిఖీ చేసి లోపాన్ని గుర్తించాలి. అవస రమైన మరమ్మతులు వెంటనే చేపట్టాలి అని ఆయన సూచించారు.

**నీటి కోసం ప్రజలు అవస్థలు**

తాగునీటి సరఫరా సక్రమంగా లేకపోతే ముఖ్యంగా మహిళలు, వృద్ధులు, చిన్నారులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ప్రశాంత్ అన్నారు. ఇంటి అవసరాల కోసం నీటిని సమకూర్చుకోవడంలో ప్రజల సమయం, శ్రమ వృథా అవుతున్నాయని పేర్కొన్నారు. ప్రజలకు తాగునీటిని అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా పథకం అమలు చేస్తున్న సమయంలోనే.. అదే పథకం కింద నిర్మించిన ట్యాంకులు సక్రమంగా పనిచేయకపోవడం అధికారుల పర్యవేక్షణ లోపానికి నిదర్శనమని ఆయన విమర్శించారు. నీరు ప్రజల ప్రాథమిక హక్కు. తాగునీటి కోసం ప్రజలు తిరిగే పరిస్థితి రాకూడదు. ప్రజల సమస్యను అధికారులు అత్యవసర అంశంగా పరిగణించాలి" అని అన్నారు.

**కార్యాలయాల్లో కూర్చుంటే వాస్తవాలు తెలియవు**

నీటి సరఫరా వ్యవస్థపై కేవలం కార్యాలయాల నుంచి నివేదికలు తెప్పించుకోవడం కాకుండా.. అధికారులు స్వయంగా ప్రాంతాలను సందర్శించాలని ప్రశాంత్ కోరారు. ట్యాంకుల వద్దకు వెళ్లి అవి పనిచేస్తున్నాయా లేదా, మోటార్లు సక్రమంగా ఉన్నాయా, ట్యాంకుల్లో నీటి నిల్వ ఎంత ఉంది, పైపులైన్ల పరిస్థితి ఎలా ఉంది, ప్రజలకు ఎన్ని గంటలు నీటి సరఫరా అవుతోంది వంటి అంశాలను పరిశీలించాలని అన్నారు. కాగితాలపై అంతా సక్రమంగా ఉన్నట్లు కనిపించవచ్చు. కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితి వేరుగా ఉండొచ్చు.



అందుకే అధికారులు ప్రజల మధ్యకు వెళ్లి వాస్తవ పరిస్థితిని తెలుసుకోవాలి. అప్పుడే సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది" అని ప్రశాంత్ పేర్కొన్నారు.

**పథకం లక్ష్యం నీరుగారకూడదు**

మిషన్ భగీరథ వంటి ప్రతిష్ఠాత్మక పథకం ద్వారా నిర్మించిన మౌలిక వసతులు నిర్వహణ లోపంతో నిరుపయోగంగా మారకూడదని ఆయన అన్నారు. నిర్మాణాలు పూర్తయిన తర్వాత వాటి నిర్వహణకు ప్రత్యేక వ్యవస్థ ఉండాలని, లోపాలు ఏర్పడినప్పుడు వెంటనే మరమ్మతులు చేపట్టాలని కోరారు. ప్రతి ఇంటికీ తాగునీరు అందించాలనే లక్ష్యాన్ని కేవలం ప్రకటనల్లో కాకుండా క్షేత్రస్థాయిలో అమలు చేయాలని అన్నారు. పథకం పేరు గొప్పగా ఉండటం మాత్రమే కాదు.. దాని ప్రయోజనం ప్రజలకు అందాలి. ట్యాంకులు నిర్మించామని చెప్పుకోవడం కన్నా వాటి నుంచి నీరు సరఫరా అవుతోందా లేదా అనేదే ముఖ్యం. ప్రజల దాహం తీరినప్పుడే మిషన్ భగీరథ లక్ష్యం నెరవేరినట్లు" అని ప్రశాంత్ అన్నారు.

**ప్రజలకు స్పష్టత ఇవ్వాలి**

అర్జుగూడ, శివకేశనగర్ ప్రాంతాల్లో నిర్మించిన ట్యాంకులకు సంబంధించి ఇప్పటివరకు జరిగిన పనులు, ఖర్చయిన నిధులు, నీటి సరఫరా ఎందుకు నిలిచిపోయింది, మరమ్మతులకు ఎంత నిధులు అవసరం, ఎప్పటిలోగా సమస్యను పరిష్కరిస్తారనే అంశాలపై అధికారులు ప్రజలకు స్పష్టత ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించకపోతే ఉన్నతాధి కారుల దృష్టికి తీసుకెళ్లి ప్రజల తరఫున సమస్యను ముందుకు తీసుకెళ్తామని తెలిపారు.


**ప్రజల దాహం తీర్చాల్సిందే**


ప్రజల డబ్బుతో నిర్మించిన ట్యాంకులు ఖాళీగా ఉండటం బాధాకరం. ట్యాంకులు అలంకారప్రాయంగా ఉండటానికి కాదు.. ప్రజల దాహం తీర్చడానికి. నిర్మాణం పూర్తయిందా లేదా అనేది అధికారుల పనితీరు కు కొలమానం కాదు. ఆ ట్యాంకు ద్వారా ఎన్ని కుటుంబాలకు నీరు అందుతోంది అనేదే అసలు కొలమానం. అర్జుగూడ, శివకేశనగర్‌లోని ట్యాంకులను వెంటనే పరిశీలించి, అవసరమైన మరమ్మతులు చేపట్టి నిరంతర తాగునీటి సరఫరా పునరుద్ధరించాలి. ప్రజలకు నీరు అందే వరకు అధికారులు సమస్యను వదిలిపెట్టకూడదు" అని బీజేపీ జిల్లా యువనాయకుడు దుర్గం ప్రశాంత్ స్పష్టం చేశారు. ప్రజలకు తాగునీరు అందించాల్సిన మిషన్ భగీరథ ట్యాంకులు నిరుపయోగంగా మారకుండా సంబంధిత ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించి తక్షణ చర్యలు చేపట్టాలని ఆయన కోరారు.

## భూభారతి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

**జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా**

**నిర్మల్ జిల్లా ప్రతినిధి ,సెప్టెంబర్ 3 ,( ప్రజాజ్యోతి ).**నిర్మల్ జిల్లాలో పెండింగ్‌లో ఉన్న భూభారతి దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి, ఎలాంటి జాప్యం లేకుండా నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో భూభారతి దరఖాస్తుల పరిష్కారంపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమగ్ర సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మండలాల వారీగా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు, వాటి పరిష్కార ప్రగతిని పరిశీలించారు.ప్రతి దరఖాస్తును క్షేత్రస్థాయిలో పూర్తిస్థాయిలో పరిశీలించిన అనంతరం నిబంధనల ప్రకారం తగిన నిర్ణయం తీసుకోవాలని సూచించారు. దరఖాస్తుల పరిష్కారంలో ఎలాంటి నిర్లక్ష్యం, జాప్యానికి తావులేకుండా నిర్ణీత గడువులోగా పెండింగ్ కేసులన్నింటినీ క్లియర్ చేయాలని స్పష్టం చేశారు.ఏదైనా సాంకేతిక లేదా ఇతర కారణాలతో దరఖాస్తును తిరస్కరించాల్సి వస్తే, తిరస్కరణకు గల స్పష్టమైన కారణాలను రికార్డుల్లో తప్పనిసరిగా నమోదు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అలాగే 22ఏ నిషేధిత జాబితాలోని భూములకు సంబంధించిన సమస్యలను ప్రత్యేకంగా పరిశీలించి, నిబంధనల మేరకు తక్షణమే పరిష్కరించాలని సూచించారు.





దరఖాస్తుదారులకు పారదర్శకంగా, నిబంధనల ప్రకారం సేవలు అందించడంతో పాటు భూభారతి దరఖాస్తుల పరిష్కార ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, ఆర్డీవో దేవీదాస్, సంబంధిత శాఖల అధికారులు, తహసీల్దార్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఉయిక శీరిష హంతకులను కఠినంగా శిక్షించాలి

**శిరీష కుటుంబానికి న్యా యం చేయాలి**

**ఆదిలాబాద్ లో ఆదివాసీ గిరిజనుల కొవ్వొత్తుల ర్యాలీ**

**ఆదిలాబాద్ బ్యూరో, సెప్టెంబర్ 3, (ప్రజా జ్యోతి )**ఆదివాసీ గిరిజన యువతి శిరీష ను హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని, శిరీష కుటుంబానికి న్యాయం చేయాలనీ ఆదివా సీ గిరిజనులు డిమాండ్ చేశారు. బుధవారం రాత్రి ఆదిలాబాద్ జిల్లా మావల మండలం కొమరం భీం కాలనీ లోభారీ కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఊయికె శిరీష ని అత్యాచారం చేసి అత్యంత వాసవికంగా హత్య చేసిన నిందితుడొన, ఉల్లాఖాన్‌ను వెంటనే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఉరితీ యాలని డిమాండ్ చేస్తూ కొ వ్వొత్తుల భారీ ర్యాలీ నిర్వ హించిన అనంతరం తుడుం దెబ్బ రాష్ట్ర అధ్రక్షుడు గోడం గణేష్ మాట్లాడుతూ ఊయి కే శిరీష నీ అత్యాచారం చేసి హత్య చేసిన నిందితు ని కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే ఉరి తీయాలని డి మాండ్ చేశారు.భద్రాద్రి కొ త్త గూడెం జిల్లా ములకలపల్లి మండలం చేవిటీ గుడెం గ్రామానికి చెందిన ఆదివాసి, ముద్దు బిడ్డ ఉయికే శిరీష నీ అత్యాచారం చేసి అత్యంత కిరాతకంగా, అతి దారుణ గా హత్య చేయడాని, తుడుం దెబ్బ రాష్ట్ర అధ్యక్షులు గోడం గణేష్ తీవ్రంగా ఖండించారు.ఈ సందర్భంగా కొమరం భీమ్ కాలనీ నిర్వాహణ కమిటీ ఆధ్వర్యంలో మహిళలతో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి ఈ ర్యాలీని ఉద్దేశించి గోడం గణేష్, అర్కా శేషారావు, గోడం రేణుక, ఉయిక ఇందిరా మా ట్లాడుతూ అడవి తల్లి ముద్దు బిడ్డ శిరీషను అతి దారుణంగా హత్య చేసిన నిం దితులను కఠినంగా శిక్షించి, బాధిత కుటుంబానికి సంపూర్ణ న్యాయం చేయాలని,శిరీష మృతి ఘటనపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో, జ్యుడిషియల్ విచారణ జరపాలని డిమాండ్ చేశారు.రాష్ట్ర వ్యాప్తంగా దళిత, గిరిజన బలహీన వర్గాల మహిళలకు రక్షణ కల్పించాలని, ఆది వాసి సమాజానికి చెందిన ఒక అమాయక యువతి ప్రాణాలు కోల్పోయిన తర్వా త కూడా, ఘటనకు సంబంధించిన పూర్తి నిజాలు వెలుగులోకి రాకపోవడం అనేక అనుమానాలకు తావిస్తోంద న్నారు. వాస్తవాలను



ప్రజల ముందుంచాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో దళిత, గిరిజన బలహీన వర్గాల మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, హత్యలు, వేధింపులు, దౌర్జన్యాలు పెరుగుతుండటం అత్యంత దారుణమని అన్నారు. రాజ్యాంగం కల్పించిన, చట్టాలు హక్కులు ఉన్నప్పటికీ, దళిత, గిరిజన బలహీన వర్గాల మహిళల ప్రాణాలకు గౌరవం, భద్రతకు పూర్తి స్థాయిలో రక్షణ లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత కుటుంబానికి రూ.ఒక కోటి రూపాయల ఎక్స్ గ్రేషియా, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం, 10, ఎకరాల వ్యవసాయ, సాగుభూమి, ఇందిరమ్మ ఇళ్ళు మంజూరు చేసి ప్రభుత్వం అండగా నిలవాలని కోరారు. శిరీష కుటుంబానికి పూర్తి న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగుతుందని, అవసరమైతే తుడుం దెబ్బ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో గ్రామ మహిళలు,అర్కా శేషారావు రాష్ట్ర కార్యదర్శి, గోడం రేణుక ఆదివాసి మ హిళా సంఘం ప్రధాన కార్యదర్శి, ఉయిక ఇందిరా ఆదివాసి మహిళా సంఘం రాష్ట్ర కార్యదర్శి, ఆత్రం గణపతి అదిలాబాద్ డివిజన్ అధ్యక్షుడు, వెడ్మ ముకుంద రావు మండల అధ్యక్షులు మావల, మడావి అనసూయ మహిళా సంఘం ఉపా ధ్యక్షురాలు,వెడ్మ, మనుకుబాయి మహిళా సంఘం కార్యదర్శి, చాహకటి అనసూయ,మహిళా ఉపాధ్యక్షురాలు గ్రామస్తులు పాల్గొన్నారు.

# క్రీడలు శారీరక, మానసిక వికాసానికి ఎంతగానో దోహదపడతాయి



: సర్పంచ్ దోనికేని లక్ష్మీ దయానంద్



**మస్కాపూర్‌లో ఘనంగా ప్రారంభమైన జిల్లా స్థాయి టేబుల్ టెన్నిస్ ఎంపిక పోటీలు**

**ఖానాపూర్ సెప్టెంబర్ 3 (ప్రజా జ్యోతి )** నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలంలోని మస్కాపూర్ పి.ఎం.శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పాఠశాల క్రీడా సమాఖ్య ( ఎస్ జి ఎఫ్ ) ఆధ్వర్యంలో గురువారం అండర్-17 బాలబాలికల జిల్లా స్థాయి టేబుల్ టెన్నిస్ ఎంపిక పోటీలు అత్యంత ఉత్సాహపూరిత వాతావరణంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను స్థానిక గ్రామ సర్పంచ్ శ్రీమతి దోనికేని లక్ష్మీ దయానంద్ ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో సర్పంచ్ శ్రీమతి దోనికేని లక్ష్మీ దయానంద్ మాట్లాడుతూ "విద్యార్థి దశ నుంచే చదువుతో పాటు క్రీడలను తమ జీవితంలో ఒక భాగం చేసుకోవాలి. క్రీడలు మానసిక ఉల్లాసానికి, శారీరక దృఢత్వానికి మరియు సంపూర్ణ వికాసానికి ఎంతగానో దోహదపడతాయి. ఆటల్లో గెలుపోటములను సమానంగా స్వీకరించే క్రీడా స్ఫూర్తిని విద్యార్థులు అలవర్చుకోవాలి. నేటి గ్రామీణ స్థాయి క్రీడాకారుల్లో అద్భుతమైన ప్రతిభ దాగి ఉంది. పాఠశాల స్థాయి నుంచే పట్టుదలతో సాధన చేస్తే జిల్లా, రాష్ట్ర మరియు జాతీయ స్థాయిలలో రాణించి తమ గ్రామానికి, జిల్లాకు మంచి పేరు తీసుకురావచ్చు. క్రీడల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు, ఉన్నత విద్య ఉద్యోగ అవకాశాలలో ప్రత్యేక ప్రాధాన్యత లభిస్తుంది. విద్యార్థులు సెల్‌ఫోన్లు, టీవీలకు పరిమితం కాకుండా నిత్యం మైదానంలో ఆడుతూ శారీరక ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి." అని పిలుపునిచ్చారు. అలాగే పోటీలలో పాల్గొనడానికి వచ్చిన క్రీడాకారులందరరు గెలుపు ఓటమిలతో సంబంధం లేకుండా ఆడాలని కోరారు ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు జాడి శ్రీనివాస్, గ్రామ పెద్దలు దొనికేని దయానంద్, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ ఆర్. లక్ష్మణ్, టి.జి.పెటా అధ్యక్షులు ఎన్. సత్తయ్య, కార్యదర్శి వి. భూమన్న, పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు షేక్ ఇమ్రాన్, సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు రమణారావు, నవీన్, రామారావు, వెంకటరమణ, రాము గౌడ్, పాఠశాల ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.ఈ ఎంపిక పోటీల్లో జిల్లా వ్యాప్తంగా ఉన్న వివిధ పాఠశాలల నుంచి సుమారు 65 మంది క్రీడాకారులు పాల్గొని తమ నైపుణ్యాన్ని ప్రదర్శించారు. ఈ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

## కలం పట్టినవాడు రచయిత.. సమాజాన్ని కదిలించేవాడు సాహితీవేత్త!



**ఆసిఫాబాద్ ఆర్సీ, సెప్టెంబర్ 03 (ప్రజాజ్యోతి):** రచయిత అంటే కేవలం కాగితంపై అక్షరాలను పేర్చే వ్యక్తి కాదు. సమాజాన్ని చదివే మనసు.. కాలాన్ని అర్థం చేసుకునే దృష్టి.. వాస్తవాలను వెలికితీసే ఆలోచన.. ప్రజల భావాలను అక్షరాల్లో పలికించే ప్రతిభ కలిగినవాడే అసలైన రచయిత. ఇతరులు చూసి వెళ్లిపోయే సంఘటనలో ఒక రచయిత ఎన్నో కోణాలను చూస్తాడు. సాధారణంగా కనిపించే విషయాల్లో అసాధారణమైన ప్రశ్నలను వెతుకుతాడు. అందుకే రచయిత కలం నుంచి వచ్చే ప్రతి పదానికి ఒక ప్రత్యేకమైన విలువ ఉంటుంది. రచయిత కలం సమాజానికి అద్దం లాంటిది. ప్రజల కష్టాలు, కన్నీళ్లు, ఆశలు, ఆకాంక్షలు, పోరాటాలు, విజయాలు.. ఇలా జీవితంలోని ప్రతి కోణాన్ని అక్షరాల రూపంలో భద్రపరుస్తుంది. ఒక మంచి రచన చదువుతున్నప్పుడు పాఠకుడికి కేవలం విషయం తెలియడం మాత్రమే కాదు.. ఆ విషయంపై ఆలోచన మొదలవుతుంది. అదే రచయిత విజయానికి అసలైన కొలమానం. కలం పదును ఉన్న చోట ప్రశ్న పుడుతుంది.. ప్రశ్న పుట్టిన చోట మార్పుకు పునాది పడుతుంది. అందుకే రచయిత సమాజంలో ఒక మౌన శక్తి. ఆయన చేతిలోని కలం ఎవరి మీద వ్యక్తిగత కోపాన్ని చూపించడానికి కాదు.. వాస్తవాన్ని వెలుగులోకి తీసుకురావడానికి ఉపయోగపడాలి. నిజాన్ని రాయడానికి ధైర్యం, తప్పును ప్రశ్నించడానికి నిబద్ధత, మంచి విషయాన్ని గుర్తించి అభినందించే విశాల హృదయం రచయితకు అవసరం. కాలంతో పాటు రచన కూడా మారాలి. నేటి సమాజంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అర్థం చేసుకుని, వాటిని సరళమైన భాషలో ప్రజలకు చేరువ చేయడం రచయిత బాధ్యత. గ్రామీణ ప్రాంతాల్లోని చిన్న సమస్య నుంచి సమాజాన్ని ప్రభావితం చేసే పెద్ద అంశం వరకు ప్రతి విషయాన్నీ పరిశీలించి రాయగలిగితే ఆ రచనకు ప్రత్యేక గుర్తింపు లభిస్తుంది. ఎందుకంటే ఒక మంచి రచన పాఠకుడిని కాసేపు ఆలోచింపజేయడమే కాదు.. అవసరమైతే తన చుట్టూ ఉన్న పరిస్థితులను ప్రశ్నించేలా చేస్తుంది. రచయితకు ప్రశంసలు ఎంత ముఖ్యమో విమర్శలు కూడా అంతే ముఖ్యమైనవి. ప్రశంసలకు పొంగిపోకుండా, విమర్శలకు కుంగిపోకుండా తన రచనా ప్రయాణాన్ని కొనసాగించగలగడం గొప్ప రచయిత లక్షణం. ప్రతి రచనతో తనను తాను మెరుగుపరుచుకుంటూ, కొత్త విషయాలను నేర్చుకుంటూ, సమాజాన్ని మరింత లోతుగా అర్థం చేసుకుంటూ ముందుకు సాగాలి. అక్షరాలు కనిపించకుండా పోవచ్చు.. కానీ అక్షరాల్లో దాగిన ఆలోచనలు తరతరాలకు ప్రయాణిస్తాయి. ఒక రచయిత రాసిన మంచి మాట ఒకరి జీవితాన్ని మార్చవచ్చు. ఒక మంచి కథనం ఒక సమస్యకు పరిష్కారం చూపవచ్చు. ఒక ఆలోచనాత్మక వ్యాసం వందల మందిలో చైతన్యం కలిగించవచ్చు. అందుకే రచయిత బాధ్యత సాధారణమైనది కాదు. రచయిత తన కాలానికి సాక్షి. తాను చూసిన సమాజాన్ని తన అక్షరాల్లో రికార్డు చేస్తాడు. నేటి సంఘటనలు రేపటి చరిత్రగా మారినప్పుడు, వాటిని అక్షరాల్లో నిలిపిన రచయిత పాత్ర మరింత స్పష్టమవుతుంది. అందుకే రచయితకు పదాలపై పట్టు మాత్రమే కాదు.. సమాజంపై అవగాహన, మానవత్వంపై నమ్మకం, వాస్తవాలపై గౌరవం, తన రచనపై బాధ్యత ఉండాలి. కలం ఒక సాధనం మాత్రమే.. దానికి ప్రాణం పోసేది రచయిత ఆలోచన. అక్షరం చిన్నదే కావచ్చు.. కానీ ఆ అక్షరం రేపటి మార్పుకు బీజం కావచ్చు. అందుకే సమాజం కోసం రాసే రచయితను కేవలం రచయితగా కాకుండా.. ప్రజల గొంతుకగా, ఆలోచనలకు మార్గదర్శిగా, మార్పుకు నాంది పలికే సృజనశీలిగా గుర్తించాలి.

## బిజెపి ఓబిసి మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా చరణ్ గౌడ్



అదిలాబాద్ టౌన్, సెప్టెంబర్ 3 ( ప్రజా జ్యోతి ) అదిలాబాద్ మండలం అంకోలి గ్రామానికి చెందిన అంగల్ వార్ చరణ్ గౌడ్ భారతీయ జనతా పార్టీ (బీజేపీ ) ఓబిసి మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా ఎంపికయ్యారు. ఇందుకు సంబంధించిన నియామక పత్రాన్ని గురువారం పట్టణ బిజెపి కార్యాలయంలో ఎంపీ గోడం నగేష్, ఎమ్మెల్యే పాయల్ శంకర్ చేతుల మీదుగా ఆయన అందుకున్నారు. ఈ సందర్భంగా చరణ్ గౌడ్ మాట్లాడుతూ... నాపై నమ్మకంతో బిజెపి ఓబిసి మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా నియమించినందుకు బీజేపీ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రారావు, ఎంపీ, ఎమ్మెల్యే కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. పార్టీ బలోపేతానికి, అందరితో కలిసి నిరంతరం కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పతంగే బ్రహ్మానంద్ , కుంచెట్టి సంతోష్ ,అంకోలి ఉప సర్పంచ్ దండ్ల దత్తు, బిజెపి కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాల విద్యనే బలంగా ఉంటుంది

. బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్
.ఎస్సి బాలుర వసతి గృహాన్ని ప్రారంభించిన బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్
విద్యార్థులకు చేరువలోనే హాస్టల్ ఏర్పాటు
.నేను ప్రభుత్వ పాఠశాలలో చదివే ఎమ్మెల్యే అయ్యా
.ప్రభుత్వ పాఠశాలలన్నీ ఇంటిగ్రేటెడ్ పాఠశాలలుగా మారుస్తాం





బజార్హత్నూర్ సెప్టెంబర్ 03,(ప్రజా జ్యోతి) అదిలాబాద్ జిల్లా బజార్హత్నూర్ మండల కేంద్రంలో ఎస్సి బాలుర వసతి గృహాన్ని ప్రవేటు భవనం నుండి మండల కేంద్రంలో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల జడ్పీ ఎస్ ఎస్ లో ఏర్పాటు చేసిన సందర్భంగా ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా హాజరయి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్ గురువారం మాట్లాడుతూ విద్యార్థులకు చేరువలోనే హాస్టల్ ఉండాలన్న ఉద్దేశ్యంతో ప్రభుత్వ భవనం గల జడ్పీఎస్ఎస్ పాఠశాలకు మార్చడం జరిగిందన్నారు. విద్యార్థులు చదువులో రాణించి తల్లిదండ్రులతో పాటు పాఠశాలకు సైతం పేరు తీసుకురావాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల శాతం పెంచాలన్నారు. గ్రామస్తులు అందరూ బాధ్యతగా ఉంటేనే అభివృద్ధి జరుగుతుందన్నారు కార్యక్రమంలో మండల అధికారులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు



నేరడిగొండ సెప్టెంబర్ 03 (ప్రజాజ్యోతి ) : మండల కేంద్రంలోని శ్రీ సేవ పబ్లిక్ స్కూల్‌లో ముందస్తు శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా విద్యార్థులు శ్రీకృష్ణుడు, రాధ, గోపికలు తదితర పాత్రల వేషధారణలో అలరించారు. చిన్నారులు ఉట్టికొట్టి (ఉట్టి కొట్టే కార్యక్రమం) ఎంతో ఉత్సాహంగా సంబరాలు జరుపుకోవడంతో పాఠశాల ప్రాంగణం భక్తి, ఆనందోత్సాహాలతో కళకళలాడింది. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ మూస నాటక్కల్, కరస్పాండెంట్ శ్రీ నానక్ సింగ్, హెడ్‌మాస్టర్ టి.దాస్ పాల్గొని విద్యార్థులకు శ్రీకృష్ణుని ఆదర్శాలను ఆచరణలో పెట్టాలని సూచించారు. ఈ వేడుకల్లో పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## నిజాయితీ చాటుకున్న నిర్మల్ కండక్టర్....



దిలావర్ పూర్ సెప్టెంబర్ 03 (ప్రజాజ్యోతి ) : ఆర్టీసీ నిర్మల్ డిపో బస్సు నిర్మల్ బస్టాండ్ నుండి బయలు దేరి ఓలా వెళ్లుచున్నది. దిలావర్ పూర్ లో బస్సు ఎక్కి ఓలా లో దిగిపోయారు. కండక్టర్ విధిగ బస్సును ముందు వెనకాల చెక్ చేసుకున్న సమయంలో లాస్ట్ సీట్ కిందా ఒక పర్సు కనిపించింది. తెరచి చూడగా దానిలో 5010 రూ!!లు నగదు రెండు ఆధార్ కార్డులు కనిపించాయి. ఆధార్ కార్డ్ లో ఉన్న ఫోన్ నంబర్ ఆధారంగా ప్రయాణికురాలిని పిలిపించి పర్స్ అప్పగించడం జరిగింది. నిజాయితీగా పర్సును సదరు ప్రయాణికురాలికి అందచేసిన కండక్టర్ కళ్యాణిని డ్రైవర్ మొబిన్ ను డిపోమేనేజర్ పండరి అభినందించారు.

## రైతులు డిజిటల్ క్రాఫ్ సర్వే ద్వారా ఆన్లైన్ పంట నమోదు చేసుకోవాలి

వ్యవసాయ అధికారి బి నాగరాజు




లక్ష్మణ చాంద, సెప్టెంబర్ 3 (ప్రజా జ్యోతి) మండల కేంద్రంలోని నర్సాపూర్ డబ్ల్యూ గ్రామంలో గురువారం రోజున వ్యవసాయ అధికారి బి. నాగరాజు డిజిటల్ పంట ఈ బుకింగ్ కార్యక్రమాన్ని రైతులతో నిర్వహించారు. ఆయన రైతులతో మాట్లాడుతూ ప్రభుత్వం నియమించిన పంట నమోదు సిబ్బంది పొలాలను సందర్శించి రైతు సాగు చేసిన పంట, సర్వే నంబర్ మరియు ఇతర వివరాలను నమోదు చేశారు. ఈ పంటల నమోదు ఆధారంగానే ప్రభుత్వం పంటల ఉత్పత్తులను కొనుగోలు చేయడం జరుగుతుందని అన్నారు. రైతులందరూ పంట నమోదు సిబ్బంది తమ గ్రామానికి వచ్చినప్పుడు తమ పొలాల వద్ద అందుబాటులో ఉండి, సరైన పంట వివరాలను తెలియజేసి పంట నమోదు చేయించుకోవాలని సూచించారు. పంట నమోదు చేయించుకోవడం ప్రతి రైతుకు ఎంతో ముఖ్యమైనదని అన్నారు. ఈ కార్యక్రమం లో కె మౌనిక, సర్పంచ్ రేణి మల్లేష్, జీవన్ రెడ్డి, విద్యాసాగర్,వాలంటీర్ బర్కం రాజు, రైతులు పాల్గొన్నారు.

## సెప్టెంబర్ 15 లోపు పెన్షన్ల కోసం దరఖాస్తు చేసుకోవాలి.



నిర్మల్ టౌన్ : సెప్టెంబర్ 03( ప్రజా జ్యోతి ) సెప్టెంబర్ 15 లోపు పెన్షన్ల కోసం అర్హులైన దివ్యాంగులు దరఖాస్తు చేసుకోవాలని స్పందన దివ్యాంగుల సంక్షేమ సంఘం నిర్మల్ జిల్లా అధ్యక్షులు ఇసాక్ అలీ అన్నారు. గురువారం నిర్మల్ పట్టణ సంఘ భవనంలో మాట్లాడుతూ ఒంటరి మహిళ, దివ్యాంగులు, కల్లు గీత కార్మికులు వితంతువు, చేనేత కార్మికులు, డయాలసిస్, ఫైలేరియా కలిగిన వాళ్ళు గడువు ముగియకముందు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

## పీహెచ్‌సీలో హెచ్‌పీవీ టీకాల పంపిణీ



నేరడిగొండ సెప్టెంబర్ 3 (ప్రజాజ్యోతి) :ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం హెచ్‌పీవీ టీకాలను అందించి, మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాల చెందిన విద్యార్థులకు టీకా ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. హెచ్‌పీవీ వైరస్ వల్ల కలిగే పలు ఆరోగ్య సమస్యలను నివారించేందుకు టీకా ఎంతో ఉపయోగకరమని వైద్య సిబ్బంది తెలిపారు. ప్రజలు ఆరోగ్య శాఖ అందిస్తున్న టీకా కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ లు స్వర్ణలత,ఏ. సంతోష్, హెల్త్ అసిస్టెంట్ సాయన్న, ఏఎన్ఎంలు అమ్మీబాయి, రాణి, ఆశా కార్యకర్త భూలక్ష్మి పాల్గొన్నారు.

## కాంగ్రెస్ శ్రేణుల కదంతొక్కుడు..

ఇచ్చోడకు భారీ బైక్ ర్యాలీ



సిరికొండ, సెప్టెంబర్ 3( ప్రజాజ్యోతి) ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం విజయవంతమైన పాలనను అందిస్తున్న శుభసందర్భాన్ని పురస్కరించుకుని, సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు మరియు బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ ఆడే గజేందర్ పర్యవేక్షణలో సిరికొండ మండల కాంగ్రెస్ నాయకులు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు.సిరికొండ మండల కేంద్రం నుండి ప్రారంభమైన ఈ బైక్ ర్యాలీ ఇచ్చోడ వరకు ఉత్సాహపూరితంగా సాగింది. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేస్తూ ఇచ్చోడ పట్టణంలో నాయకులు, కార్యకర్తలు భారీ ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ... ప్రజా సంక్షేమమే ధ్యేయంగా రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పాలన సాగిస్తోందని, ప్రజలకు ఇచ్చిన హామీలను వరుసగా అమలు చేస్తూ ప్రజాదరణ పొందుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిరికొండ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కంచర లక్ష్మణ్, సర్పంచ్ దత్తు, ఉప సర్పంచ్ తోకల రాజు, మైనార్టీ సెల్ చైర్మన్ రంజాన్, తిరుపతి,పలువురు కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, మండల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆదివాసీల హక్కులు, సంక్షేమం కోసం క్షేత్రస్థాయిలో పనిచేసే వారికి ప్రాధా న్యం

## ఎస్టీ విభాగం అబ్జర్వర్ మల్లీ శ్వరి





**ఆదిలాబాద్ బ్యూరో, సెప్టెంబర్ 3, (ప్రజా జ్యోతి )**ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఆదివాసీ కాంగ్రెస్ జిల్లా, మండల కమిటీల నిర్మాణ ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా జిల్లా, మండల స్థాయిల్లోని వివిధ బాధ్యతలకు ఆసక్తి ఉన్న అభ్యర్థుల నుంచి గురువారం దరఖాస్తులను స్వీకరించారు. ఈ కార్యక్ర మానికి ఎస్టీ విభాగం అబ్జర్వర్ మల్లీశ్వరి హాజరై, జిల్లా, మండల స్థాయి కమిటీలలో వివిధ బాధ్యతల కోసం ఆసక్తి ఉన్న అభ్యర్థుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు.అనంతరం నిర్వ హించిన పత్రికా సమావేశంలో ఎస్టీ విభాగం అబ్జర్వర్ మల్లీశ్వరి మాట్లాడుతూ,పార్టీ సిద్ధాంతాలకు కట్టు బడి ఆదివాసీల హక్కులు, సంక్షేమం కోసం క్షేత్రస్థాయిలో నిరంతరం పనిచేసే కార్యకర్త లకు కమిటీలలో సముచిత ప్రాధాన్యత కల్పిస్తామని తెలిపారు. జిల్లా, మండల స్థా యిల్లో కమిటీల ఏర్పాటును పారదర్శకంగా పూర్తి చేస్తా మని పేర్కొన్నారు. భారత దేశ అభివృద్ధి ప్రయాణంలో ఆదివాసీలకు సముచిత స్థానం కల్పించడంలో కాంగ్రెస్ పార్టీ కీలక పాత్ర పోషించిందని ఆమె అన్నారు. కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసి, రాహుల్ గాంధీ నాయకత్వాన్ని బలోపేతం చేసేల కృతో ప్రతి నాయకుడు, కార్యకర్త సమిష్టిగా పనిచే యాలని పిలుపునిచ్చారు. ఆదిలాబాద్ జిల్లాలో కాంగ్రె స్ పార్టీని మరింత అభివృద్ధి చేసి, పార్టీ విజయానికి కృషి చేయాలని సూచించారు. ఆ దిలాబాద్ జిల్లా కాంగ్రెస్ పా ర్టీ అధ్యక్షులు డాక్టర్ నరేష్ జాదవ్ మాట్లాడుతూ, కాం గ్రెస్ పార్టీ ఆదివాసీ వర్గాలకు పార్టీలో తగిన ప్రాధాన్యత, ప్రాతినిధ్యం కల్పించేందుకు కృషి చేస్తోందని తెలిపారు. పార్టీ బలోపేతం కోసం మొ దటి నుంచి కష్టపడి పనిచే సిన ఎస్టీ సెల్ కార్యకర్తలకు తప్పకుండా న్యాయం చేస్తా మని ఈ సందర్భంగా ఆయ న హామీ ఇచ్చారు.ప్రజా సం క్షేమం కోసం ప్రభుత్వం ప్రవే శపెడుతున్న వివిధ సంక్షే మ పథకాలను ఆయన కొ నియాడారు. పార్టీ అంది స్తు న్న అవకాశాలను నాయకు లు, కార్యకర్తలు సద్వినియో గం చేసుకొని, ప్రజల్లోకి వెళ్లి పార్టీ బలోపేతానికి నిరంత రం కృషి చేయాలని పిలుపు నిచ్చారు.ఆదివాసీ కాంగ్రెస్ జిల్లా, మండల కమిటీల ఏ ర్పాటు ద్వారా గ్రామీణ స్థా యి నుంచి జిల్లా స్థాయి వర కు పార్టీని మరింత బలోపే తం చేయడంతో పాటు, ఆ దివాసీ వర్గాలకు విస్తృత ప్రాతినిధ్యం కల్పించడమే ప్రధాన లక్ష్యమని నాయకు లు పేర్కొన్నారు. పార్టీ పట్ల నిబద్ధత కలిగి, ప్రజా సమ స్యలపై నిరంతరం పనిచేసే వారికి సముచిత అవకాశా లు కల్పించే దిశగా కమిటీల నిర్మాణ ప్రక్రియ కొనసాగు తుందని తెలిపారు. ఈ కా ర్యక్రమంలో మాజీ డీసీసీ అ ధ్యక్షుడు సాజిద్ ఖాన్, అ ల్లూరి సంజీవ్ రెడ్డి, అంబ కంటి అశోక్, దేవదాస్ చారి, గొలి సంజయ్, పరమేశ్వర్, జిల్లా మీడి యా కోఆర్డినేటర్ మేకల జితేందర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఆదివాసీ కాంగ్రెస్ నాయకులు, కార్య కర్తలు పాల్గొన్నారు.

# నాగభూషణ విద్యాలయంలో ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు







**బాసర, సెప్టెంబర్ 3 (ప్రజా జ్యోతి)** బాసరలోని నాగభూషణ విద్యాలయంలో గురువారం ముందస్తు కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో ఆకట్టుకున్నారు. పాఠశాలలో కృష్ణాష్టమి విశిష్టతను వివరించి, విద్యార్థులతో పలు సాంస్కృతిక కార్యక్రమా లు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ బాబురావు, ఇంచార్జీ ప్రిన్సిపల్ సులోచన, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రైవేట్ పాఠశాలల్లో ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు







**ఖానాపూర్ సెప్టెంబర్ 3( ప్రజా జ్యోతి )**శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు ఖానాపూర్ లోని పలు సంకల్ప కృష్ణవేణి విజేత ఇషన్ పాఠశాలలో గురువారం ఘనంగా జరుపుకున్నారు. వేడుకల్లో భాగంగా విద్యార్థినీ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాలబాలికలు చిన్ని కృష్ణుడు, గోపిక, రాధల వేషధారణలతో చూపరులను ఆకట్టుకున్నారు. రాధాకృష్ణుల జీవిత చరిత్రను పాఠశాల కరెస్పాండెంట్లు కల్వకుంట్ల వినయ్ కుమార్ గాండ్ల శ్రీనివాస్ మదిరే శ్రీనివాస్ వెంకటేష్ విద్యార్థులకు వివరించి అవగాహన కల్పించారు. వెన్నకుండల తో బాలబాలికల హడావుడి ముచ్చటగొలిపింది. పిల్లనగ్రోవితో చిన్నారులు ఆటా పాటలు అందరినీ అలరించాయి. ఈ సందర్భంగా ఉట్లు కొట్టే కార్యక్రమాన్ని ఉత్సాహంగా జరుపుకు న్నారు. ఇందులో పాఠశాల ప్రిన్సిపాల్స్ ఉపాధ్యాయులు, విద్యార్థులు, విద్యార్థులు తల్లిదండ్రులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. హైందవ సాంప్రదాయంలో శ్రీకృష్ణ జన్మాష్టమి కృష్ణుడు పుట్టిన రోజు వేడుకలు అత్యంత వైభవంగా వినోదంగా ఆకర్షణీయంగా జరుపుకున్నారు







# పెంబి మండలంలో విద్యుత్ వైర్లు తెగి ఆదివాసీ ఇల్లు దగ్ధం

**– ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణం – బాధితుడికి 10 లక్షల పరిహారం ఇవ్వాలి టి ఏ జి ఎస్ కార్యదర్శి తోడసం శంభు డిమాండ్**

**ఖానాపూర్ (పెంబి )సెప్టెంబర్ 3 (ప్రజా జ్యోతి)** ఖానాపూర్ నియో జకవర్గంలోని గిరిజన పెంబి మండలం, యాపల్ గూడ గ్రామపం చాయతీ, నైతం కృష్ణ గ్రామంలో ఈరోజు తెల్లవారు జామున 2 గంటలకు విద్యుత్ వైర్లు తెగి ఇంటిపై పడి ఒక ఆదివాసీ కుటుంబ ఇల్లు పూర్తిగా కాలిపోయింది. దీనికి పూర్తి బాధ్యత ప్రభుత్వానిదే నని టి ఏ జి ఎస్ ఆరోపించింది ఈ మేరకు ప్రధాన డిమాండ్లు 10 లక్షల నష్టపరిహారం ఇవ్వాలి ఇల్లు, ధాన్యం, బట్టలు, సామాను అంతా కాలిపోయింది. రూ. లక్ష కాదు, 10 లక్షల నష్టపరిహారం వెంటనే చెల్లించాలని వెంటనే ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలి ట్రాన్స్‌ఫార్మర్, వైర్లు మార్చాలిఊరి నడిబొడ్డున ఉన్న కరెంట్ ట్రాన్స్‌ఫార్మర్ ను, ఇండ్లపై నుండి వెళ్తున్న వైర్లను వెంటనే ఊరి పక్కకు మార్చాలని జోత్తి బ్రిడ్జి వెం టనే నిర్మించాలి బ్రిడ్జి లేకపోవడం వల్లే ఫైర్ ఇంజన్, 108, 102 వాహనాలు గ్రామానికి రాలేకపో యాయి. అనేకసార్లు విన్నవించినా, యాపల్ గూడ నుండి నిర్మల్ వర కు 3 రోజులు పాదయాత్ర చేసినా ప్రభుత్వం హామీ ఇచ్చి మర్చిపో యింది. ఇదే నిర్లక్ష్యం వల్లే ఈ ప్రమాదం జరిగింది. జోత్తి బ్రిడ్జి నిర్మించే వరకు, బాధిత కుటుంబా నికి రూ. 10 లక్షలు ఇచ్చే వరకు మా పోరాటం కొనసాగిస్తామన్నారు



## నూతన ఎస్సైకి సావర్‌ఖేడ గ్రామ ప్రతినిధుల సన్మానం



**కేరమేరి సెప్టెంబర్ 3 ప్రజా జ్యోతి** కేరమేరి పోలీస్‌స్టేషన్‌లో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎస్సై. రాజును సావర్‌ఖేడ గ్రామపంచాయతీ ప్రతినిధులు గురువారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్సైకి శుభాకాంక్షలు తెలిపారు. గ్రామంలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసుల సహకారం ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కావుడే తులసిరామ్, ఉపసర్పంచ్ దేవరావు, వార్డు సభ్యుడు ఏ. శంకర్, గ్రామస్తులు నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## బొగ్గు పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి సమిష్టి పోరాటం

నాగ్‌పూర్‌లో అఖిల భారత బొగ్గు పెన్షనర్ల సమాఖ్య జాతీయ కార్యవర్గ సమావేశం



**మంచిర్యాల, 3, సెప్టెంబర్ (ప్రజా జ్యోతి):** అఖిల భారత బొగ్గు పెన్షనర్ల సమాఖ్య జాతీయ కార్యవర్గ సమావేశం బుధవారం నాగ్‌పూర్‌లో ముగిసింది. నాగ్‌పూర్‌లోని భారతీయ మజ్దూర్ సంఘ్ విదర్భ రాష్ట్ర కార్యాలయంలో సెప్టెంబర్ 2న నిర్వహించిన ఒక రోజు సమావేశానికి సమాఖ్య జాతీయ అధ్యక్షుడు పులి రాజ్‌రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సమావేశానికి విదర్భ రాష్ట్ర బీఎంఎస్ ప్రధాన కార్యదర్శి ప్రముఖంగా హాజరయ్యారు. దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన బొగ్గు పరిశ్రమ విశ్రాంత కార్మికులు, అధికారులు సమావేశంలో పాల్గొన్నారు. సింగరేణి, సెంట్రల్ కోల్‌ఫీల్డ్స్--రాంచీ, బీసీసీఎల్--ధన్‌బాద్, మధ్యప్రదేశ్, డబ్ల్యూసిఎల్ తదితర బొగ్గు సంస్థలకు చెందిన ప్రతినిధులు హాజరై విశ్రాంత బొగ్గు పరిశ్రమ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై విస్తృతంగా చర్చించారు. ప్రధానంగా పెన్షన్ చెల్లింపుల్లో నెలకొంటున్న ఇబ్బందులు, పెన్షన్ సవరణ, పెన్షన్ నిధిని స్థిరీకరించడంతో పాటు మరింత బలోపేతం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలు, వైద్య ప్రయోజన పథకంలో మెరుగుదలలు, వైద్య సేవలను సులభతరం చేయడం తదితర అంశాలపై సమావేశంలో లోతైన చర్చ జరిగింది. పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం సంబంధిత ప్రభుత్వ, బొగ్గు సంస్థల యాజమాన్యాలపై సమిష్టిగా ఒత్తిడి తీసుకురావాల్సిన అవసరాన్ని ప్రతినిధులు వివరించారు. అలాగే సమాఖ్యను మరింత విస్తరించడం, దేశవ్యాప్తంగా బొగ్గు పెన్షనర్లను సంఘటితం చేయడం, భవిష్యత్‌లో చేపట్టాల్సిన కార్యక్రమాలపై ప్రత్యేకంగా చర్చించి భవిష్యత్ కార్యాచరణకు బ్లూప్రింట్‌ను రూపొందించారు. భారతీయ మజ్దూర్ సంఘ్ జాతీయ ప్రధాన కార్యదర్శి సురేంద్ర కుమార్ పాండే ఢిల్లీలో ఉన్నప్పటికీ ఆన్‌లైన్ ద్వారా సమావేశంలో కొంతసేపు పాల్గొని ప్రతినిధులకు మార్గదర్శనం చేశారు. పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి సంఘటితంగా కృషి చేయాలని ఆయన సూచించారు. సమావేశాన్ని సమాఖ్య ప్రధాన కార్యదర్శి రమేష్ బల్లేవార్ నిర్వహించగా, ఆర్.ఎస్. సింగ్ వందన సమర్పణ చేశారు. దేశవ్యాప్తంగా బొగ్గు పరిశ్రమ విశ్రాంత కార్మికుల సమస్యల పరిష్కారానికి భవిష్యత్‌లో మరింత సమర్థవంతమైన కార్యక్రమాలు చేపట్టాలని సమావేశంలో నిర్ణయించారు .

## కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్‌గా హర్ష చౌదరి.. బాధ్యతలు స్వీకరణ



**ఆసిఫాబాద్ సెప్టెంబర్ 3 ప్రజా జ్యోతి** కొమురంభీం ఆసిఫాబాద్ కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్‌గా నూతనంగా నియమితులైన హర్ష చౌదరి గురువారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయానికి వెళ్లి జిల్లా కలెక్టర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు పూల మొక్కను అందజేశారు. నూతన సబ్ కలెక్టర్‌కు జిల్లా కలెక్టర్ శుభాకాంక్షలు తెలిపారు. కాగజ్‌నగర్ సబ్ డివిజన్ పరిధిలో ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తూ అధికార యంత్రాంగాన్ని సమన్వయం చేసుకుని ముందుకు సాగాలని తెలిపారు.

## 42.2 కిలోమీటర్ల పరుగులో విజయం సాధించిన డాక్టర్ కిరణ్ కుమార్ ను సన్మానించిన మెడికల్ అసోసియేషన్



**ఖానాపూర్ సెప్టెంబర్ 3( ప్రజా జ్యోతి )**హైదరాబాద్ లో నిర్వహించిన ఎన్ఎండిసి మారతాన్ 42.2 కిలోమీటర్ల పరుగుని విజయవంతంగా పూర్తి చేసి ప్రశంసలు పొందిన డాక్టర్ కిరణ్ కుమార్ నిర్మల్ జిల్లా ఖానాపూర్ భవాని హాస్పిటల్ నిర్వాహకులను మర్యాద పూర్వకంగా ఖానాపూర్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం అధ్యక్షులు కుమారం రామానుజ చారి (డాక్టర్ రామ్ ) అసోసియేషన్ సభ్యులు సన్మానించారు సమాజం గర్వించేలా వైద్య వృత్తిలో ఉంటూ మారతాన్లో విజయం సాధించడం అభినందనీయమని పలువురు మెడికల్ అసోసియేషన్ సభ్యులు అన్నారు

# జేబీసీసీఐ ఏర్పాటుకు బీఎంఎస్ కీలక ముందడుగు

### ఐఆర్ కోడ్ సెక్షన్ 14 నుంచి మినహాయింపు ఇవ్వాలని కేంద్రానికి లేఖ

### కోల్‌కతా ఏపెక్స్ బోర్డు సమావేశంలో కీలక నిర్ణయం బీఎంఎస్ జాతీయ నాయకులు కొత్తకాపు లక్ష్మారెడ్డి




**మంచిర్యాల, 3,సెప్టెంబర్ (ప్రజాజ్యోతి):** బొగ్గు పరిశ్రమలో జేబీసీసీఐ (జాయింట్ బైపార్టైట్ కమిటీ ఫర్ ది కోల్ ఇండస్ట్రీ) ఏర్పాటుకు బీఎంఎస్ కీలక ముందడుగు వేసింది. కొత్త లేబర్ కోడ్ అమలులోకి వచ్చిన నేపథ్యంలో జేబీసీసీఐ ఏర్పాటుకు సంబంధించి ఎదురవుతున్న న్యాయపరమైన అంశాలపై గురువారం కోల్‌కతాలో జరిగిన కోల్ ఇండియా ఏపెక్స్ బోర్డు సమావేశంలో విస్తృతంగా చర్చ జరిగింది. ఈ సమావేశంలో బీఎంఎస్ జాతీయ నాయకులు కొత్తకాపు లక్ష్మారెడ్డి కోల్ ఇండియా యాజమాన్యంతో జేబీసీసీఐ ఏర్పాటుకు సంబంధించిన అంశాలను చర్చించారు. కార్మికుల వేతన సవరణలు, సంక్షేమం, ఉద్యోగ సంబంధిత సమస్యలపై యాజమాన్యం--కార్మిక సంఘాల మధ్య ద్వైపాక్షిక చర్చలకు జేబీసీసీఐ ఎంతో కీలకమైన వేదికగా ఉంటుందని ఈ సందర్భంగా ప్రస్తావించారు. కొత్త లేబర్ కోడ్ అమలులోకి వచ్చిన నేపథ్యంలో జేబీసీసీఐ ఏర్పాటుకు సంబంధించి చట్టపరమైన అంశాలు అడ్డంకిగా మారుతున్న విషయాన్ని సమావేశంలో చర్చించారు. ఇండస్ట్రియల్ రిలేషన్స్ కోడ్‌లోని సెక్షన్ 14 నుంచి మినహాయింపు కల్పించడం ద్వారా జేబీసీసీఐ ఏర్పాటుకు మార్గం సుగమం చేయవచ్చని కొత్తకాపు లక్ష్మారెడ్డి సమావేశంలో వివరించారు. ఈ నేపథ్యంలో జేబీసీసీఐ ఏర్పాటు కోసం ఐఆర్ కోడ్‌లోని సెక్షన్ 14 నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరుతూ కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖకు లేఖ రాయాలని సమావేశంలో నిర్ణయించినట్లు ఆయన తెలిపారు. కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించి మినహాయింపు మంజూరు చేస్తే జేబీసీసీఐ ఏర్పాటుకు ఉన్న న్యాయపరమైన అడ్డంకులు తొలగే అవకాశం ఉంటుందన్నారు. జేబీసీసీఐ ఏర్పాటైతే బొగ్గు పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికుల వేతన సవరణలు, కార్మిక సంక్షేమం, ఉద్యోగ భద్రత, ఉద్యోగ సంబంధిత సమస్యలు, ఇతర పారిశ్రామిక అంశాలపై యాజమాన్యం--కార్మిక సంఘాల మధ్య ద్వైపాక్షిక చర్చలకు మరింత బలమైన వ్యవస్థ ఏర్పడుతుందని తెలిపారు. కార్మికుల ప్రయోజనాలను పరిరక్షించడమే లక్ష్యంగా జేబీసీసీఐ ఏర్పాటుకు బీఎంఎస్ నిరంతరం కృషి చేస్తోందని కొత్తకాపు లక్ష్మారెడ్డి స్పష్టం చేశారు. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం కార్మికుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని సానుకూల నిర్ణయం తీసుకోవాలని బీఎంఎస్ తరఫున కోరుతున్నట్లు తెలిపారు. కోల్‌కతాలో జరిగిన ఏపెక్స్ బోర్డు సమావేశంలో జేబీసీసీఐ ఏర్పాటుపై చర్చ జరగడం, సెక్షన్ 14 నుంచి మినహాయింపు కోసం కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖకు లేఖ రాయాలని నిర్ణయించడం బొగ్గు పరిశ్రమ కార్మికులకు ప్రాధాన్యత కలిగిన పరిణామంగా బీఎంఎస్ నాయకులు తెలిపారు.

# కాంగ్రెస్ పార్టీ బలోపేతమే లక్ష్యం.. ప్రజల సంక్షేమమే ధ్యేయం

ఉప్పుల కృష్ణ



**ఆసిఫాబాద్ ఆర్సీ, సెప్టెంబర్ 03 (ప్రజాజ్యోతి):** ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండల కాంగ్రెస్ పార్టీ యువజన యూత్ అధ్యక్షుడు ఉప్పుల కృష్ణ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అంటేనే ప్రజల పార్టీ అని, పేదలు, రైతులు, కార్మికులు, యువత, మహిళలు, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి నిరంతరం కృషి చేసే పార్టీ అని అన్నారు. దేశంలో ప్రజాస్వామ్య విలువలను కాపాడటంతో పాటు సామాజిక న్యాయం, సమానత్వం కోసం కాంగ్రెస్ పార్టీ ఎన్నో సంవత్సరాలుగా పోరాటం చేస్తోందని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఉన్న చరిత్ర, సిద్ధాంతాలు, ప్రజలతో ఉన్న అనుబంధమే పార్టీకి అసలైన బలమని ఉప్పుల కృష్ణ అన్నారు. పదవులు, రాజకీయాలు మాత్రమే కాకుండా ప్రజల మధ్య ఉండి వారి సమస్యలను తెలుసుకోవడం, అవసరమైన సమయంలో వారికి అండగా నిలవడం కాంగ్రెస్ కార్యకర్తల బాధ్యత అని తెలిపారు. గ్రామస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారం కోసం కృషి చేయడమే తమ ప్రధాన లక్ష్యమన్నారు. యువత ముందుకు వస్తేనే మార్పు దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని ఉప్పుల కృష్ణ పేర్కొన్నారు. యువత రాజకీయాల్లో చురుకుగా పాల్గొని ప్రజాసేవకు ముందుకు రావాల్సిన అవసరం ఉందన్నారు. యువతలో ఉన్న శక్తి, ఆలోచనా విధానం, సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రజాసేవకు ఉపయోగిస్తే గ్రామాల అభివృద్ధిలో మరింత మంచి ఫలితాలు సాధించవచ్చని చెప్పారు. వాంకిడి మండలంలోని ప్రతి గ్రామంలో యువతను కాంగ్రెస్ పార్టీతో అనుసంధానం చేసి పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని తెలిపారు. యువజన కాంగ్రెస్ కార్యకర్తలు కేవలం రాజకీయ కార్యక్రమాలకే పరిమితం కాకుండా సామాజిక సేవా కార్యక్రమాలు, ప్రజా సమస్యల పరిష్కారం, విద్యార్థులు--యువతకు సంబంధించిన అంశాలపై కూడా చురుకుగా పనిచేయాలని సూచించారు.

**కార్యకర్తలే పార్టీకి వెన్నెముక**

కాంగ్రెస్ పార్టీకి కార్యకర్తలే వెన్నెముక అని ఉప్పుల కృష్ణ అన్నారు. ఎలాంటి పరిస్థితుల్లోనైనా పార్టీ కోసం పనిచేసే కార్యకర్తలను గుర్తించి వారికి అండగా నిలవాల్సిన బాధ్యత నాయకత్వంపై ఉందన్నారు. గ్రామస్థాయి కార్యకర్త నుంచి మండల స్థాయి నాయకుడి వరకు ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేసినప్పుడే పార్టీ మరింత బలపడుతుందని చెప్పారు. పార్టీలో చిన్నచిన్న విభేదాలు ఉన్నా వాటిని పక్కనపెట్టి పార్టీ ప్రయోజనాల కోసం అందరూ ఒక్కతాటిపైకి రావాలని పిలుపునిచ్చారు. వ్యక్తిగత ప్రయోజనాల కంటే పార్టీ సిద్ధాంతాలు, ప్రజల ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇవ్వాలని అన్నారు. కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు, గౌరవం లభించేలా కృషి చేస్తామని తెలిపారు.

**ప్రజల నమ్మకమే అసలైన బలం**

ప్రజలు కాంగ్రెస్ పార్టీపై ఉంచుతున్న నమ్మకాన్ని మరింత పెంచేలా నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని ఉప్పుల కృష్ణ అన్నారు. ప్రజల మధ్యకు వెళ్లి వారి సమస్యలను నేరుగా తెలుసుకుని, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేయడమే తమ విధానమని పేర్కొన్నారు. వాంకిడి మండల అభివృద్ధిలో యువతను భాగస్వామ్యం చేస్తామని, గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై నిరంతరం స్పందిస్తామని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ ఆశయాలను ప్రతి ఇంటికీ తీసుకెళ్లడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు కృషి చేస్తామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ కోసం పనిచేయడం ఒక బాధ్యతగా భావిస్తున్నాం. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవడం మా కర్తవ్యం. యువతను ఏకం చేసి పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేస్తాం. ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఎల్లప్పుడూ ముందుండి పనిచేస్తాం అని ఉప్పుల కృష్ణ పేర్కొన్నారు.

## మాలి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు సెండే వాసుకు ఘన సన్మానం



**ఆసిఫాబాద్ ఆర్సీ, సెప్టెంబర్ 03 (ప్రజాజ్యోతి):** ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండల కేంద్రంలో మాలి సంక్షేమ సంఘం కుమురంభీం జిల్లా అధ్యక్షులు సెండే వాసును నూతనంగా ఎన్నికైన ఆదివాసీ తుడుం దెబ్బ వాంకిడి మండల కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. తుడుం దెబ్బ కుమురంభీం జిల్లా ప్రధాన కార్యదర్శి సిడం నాగోరావు, నూతనంగా ఎన్నికైన వాంకిడి మండల అధ్యక్షులు పెందూర్ సురేష్ ఆధ్వర్యంలో ఈ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన మండల కమిటీ సభ్యులు సెండే వాసును శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ ఆదివాసీ, మాలి తదితర సామాజిక వర్గాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి సంఘాల ప్రతినిధులు సమన్వయంతో ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజల సమస్యలపై నిరంతరం స్పందిస్తూ, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేయాలని పేర్కొన్నారు. సంఘాల బలోపేతంతోనే ప్రజల సమస్యలను మరింత సమర్థవంతంగా పరిష్కరించుకునే అవకాశం ఉంటుందని నాయకులు అన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో విద్య, ఉపాధి, మౌలిక వసతులు, తాగునీరు, రహదారులు, సంక్షేమ పథకాల అమలు వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. యువతను సంఘాల కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేస్తూ సామాజిక చైతన్యం పెంపొందించేందుకు కృషి చేయాలని సూచించారు. నూతనంగా ఎన్నికైన తుడుం దెబ్బ వాంకిడి మండల కమిటీ ప్రజా సమస్యలపై చురుగ్గా పనిచేస్తుందని, ఆదివాసీ ప్రజల హక్కులు, సంక్షేమం కోసం ఐక్యంగా ముందుకు సాగుతుందని నాయకులు తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రజలను కలుస్తూ వారి సమస్యలను తెలుసుకుని, అవసరమైన సందర్భాల్లో అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు కార్యాచరణ రూపొందించుకోవాలని పేర్కొన్నారు. అనంతరం సెండే వాసు మాట్లాడుతూ తనను సన్మానించిన తుడుం దెబ్బ నూతన మండల కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. సంఘాల మధ్య పరస్పర సహకారం, ఐక్యతతోనే ప్రజా సమస్యల పరిష్కారానికి మరింత బలమైన వేదిక ఏర్పడుతుందని అన్నారు. భవిష్యత్తులో కూడా సామాజిక అభివృద్ధి, ప్రజా సంక్షేమ కార్యక్రమాలకు తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. నూతన కమిటీకి నాయకులు, సంఘ ప్రతినిధులు శుభాకాంక్షలు తెలియజేస్తూ, బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించి ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో తుడుం దెబ్బ మండల కమిటీ సభ్యులు, మాలి సంక్షేమ సంఘం ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పార్టీ బలోపేతానికి సమష్టిగా కృషి చేయాలి



**కెరమెరి సెప్టెంబర్ 3 ప్రజా జ్యోతి** అసిఫాబాద్ నియోజకవర్గం లోని కెరమెరి మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నాయకుల సమావేశం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ నాయకుడు అజ్మీరా శ్యామ్ నాయక్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో పార్టీ బలోపేతం, రాబోయే కార్యక్రమాల నిర్వహణ, ప్రజా సమస్యల పరిష్కారం తదితర అంశాలపై చర్చించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని నాయకులు నిర్ణయించారు. కాంగ్రెస్ పార్టీని మండలంలో మరింత బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని అజ్మీరా శ్యామ్ నాయక్ సూచించారు. పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో కెరమెరి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సుజాయ్ త్ ఖాన్ తో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆదర్శ విద్యార్థి స్కూల్‌లో భక్తిశ్రద్ధలతో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు



**దిలావర్ పూర్ సెప్టెంబర్ 03 (ప్రజాజ్యోతి):** మండల కేంద్రంలోని ఆదర్శ విద్యార్థి స్కూల్‌లో ముందస్తు శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా విద్యార్థులు శ్రీకృష్ణుడు, రాధ, గోపికలు తదితర పాత్రల వేషధారణలో అలరించారు. చిన్నారులు ఉట్టికొట్టి (ఉట్టికొట్టే కార్యక్రమం)ఎంతో ఉత్సాహంగా సంబరాలు జరుపుకోవడం తో పాఠశాల ప్రాంగణం భక్తి, ఆనందోత్సాహాలతో కళకళలాడింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ పాల్గొని విద్యార్థులకు శ్రీకృష్ణుని ఆదర్శాలను ఆచరణలో పెట్టాలని సూచించారు. ఈ వేడుకల్లో పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# విద్యార్థుల పట్ల వివక్ష చూపుతున్న హెచ్ ఎం

**ఆందోళన కు సిద్దమైన విద్యార్థులు**

**అధికారుల హామీతో ఆందో ళన విరమణ**

**ఎచ్ ఎం పై చర్యలు తీసుకోవాలి**

**తుడుందెబ్బ రాష్ట్ర అద్యక్షుడు గోడం గణేష్**


**ఆదిలాబాద్ బ్యూరో, సెప్టెంబర్ 3, (ప్రజా జ్యోతి )**విధులు సక్రమం గా నిర్వహించకుండా అవినీతి అక్ర మాలకు పాల్పడుతూ, వి ద్యార్థుల పట్ల వివక్ష చూపు తున్న ఝరి పునాగూడ ఆశ్రమ పాఠశాల హెచ్ ఎం పై కఠిన చర్యలు తీసుకోవాలని తుడుందెబ్బ రాష్ట్ర అద్య క్షుడు గోడం గణేష్ డిమాండ్ చేశారు. ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం ఝరి పూన గూడ ఆశ్రమ పాఠశాలో పిల్లలు అనేక స మస్యలతో గత కొంత కాలం నుంచి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు ఆదివాసి లంబాడీల వివక్షతను కూడా ఎదుర్కొంటున్నట్లు తెలు స్తోంది. ఈ సమస్యలు, ఇబ్బందులకు విసుగు చెందిన విద్యార్థులు ఆందోళనకు సిద్ధమయ్యారు. గురువారం ప్రార్థన ముగిసిన వెంటనే తరగతి గదులకు వెల్ల కుండా బయటనే ఉండిపోయారు. ముందుగా సంబందిత అధికారులకు సమాచారం అందించీ తరగతులు బహిష్కరించి బరటనే ఉండి పోయారు. గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డి ఈ ఓ గోడం చందన్, ఏపిఓ ఆత్రం బాస్కర్‌లు ఉటా హుటీన ఆాటశాలకు చేరుకన్నా రు. అదే సమయంలో ఆది వాసి హక్కుల పోరాట సమితి (తుడుం దెబ్బ) రాష్ట్ర అద్యక్షడు గోడం గణేష్ కూడా తన అనుచరులతోఅక్కడికి చేరుకున్నారు.ఈ సందర్భంగా పాఠశాలలో దుర్కొంటున్న సమసైయలను విద్యార్థులు వివరించారు. పా ఠశాల హెచ్ఎం అనేక అవి నీతి, అక్రమాలకు పాల్పడు తోందని, విద్యార్థుల పట్ల వి వక్షకుడా చూపుతోందని వి వరించారు. విద్యార్థుల నుంచి అక్రమ వసూల్లతో పాటు ఆదివాసీ పిల్లలపై చిన్న చుపుచూస్తున్నారని, లంబాడా ఉపాధ్యాయులు ఆదివాసీ పిల్లల పై చిన్న చూపి చూ స్తూ, పిల్లలకు మెనూ ప్రకారము భోజనం పెట్టడం లేదని, ఉడకని అన్నం, నీల్ల ప ప్పు, మరుగు దొడ్లు అఫరి శుబ్రత, సక్ర మంగా లేవని వాటి గురించి పట్టించుకో వడం లేదని అన్నారు.



ఆశ్ర మ పాఠశాలలో ఉపాధ్యా యులు ఎవరు కూడా రాత్రి పూట ఉండడం లేదని, కనీ సం సమయ పాలన పాటించడం లేదని, ఇష్టాను సారంగా విధులకు హాజరవుతున్నారని ఆరోపించారు. కనీసం విద్యార్థులకు పాటాలు సక్రమంగా బోదించడం లేదని, పూర్థిగా ఆదివాసి గిరిజన పిల్లలపై విపక్ష చూపుతున్నారని పేర్కొన్నా రు. పిర్యాదులు చేసినా ఉపా ధ్యాయులు, అధికారులు ఎవరు పట్టించు కోవడం లేదని అన్నారు. పాటశాలలో నీళ్లు లేక ఇబ్బందులు పడుతున్నారని, ఈ సమస్యల వల్ల 200 మంది విద్యార్థులలో కేవలం సగం మంది విద్యార్థులు మాత్రమే హాజర వుతున్నారని అన్నారు. పిల్లలకు జ్వరం వచ్చినా ఎవరూ పట్టించుకోవడం లేదని, ఈ విషయం ఐటిడిఏ అధికారులకు అలాగే ఆదివాసీ సంఘాలకు తెలియాడంతో పాటశాలకు చేరుకొని పిల్లలతో మాట్లాడి వారం రోజుల్లో పాఠశాల సమస్యలు పరిష్కరిస్థా మని హామీ ఇవ్వడంతో పిళ్లలు ఆందోళన విరమించారు. ఈ కార్యక్ర మంలో ఐటిడిఎ ఎపిఒ ఆ త్రం భాస్కర్, డిప్యూటి డి ఈ ఓ గోడం చందన్, ఏటి డబ్లుఓ అనిల్, తల మడు గు ఎమ్మార్వో రాజు మోహా న్, ఎస్ ఐ రాదిక, తుడం దెబ్బ రాష్ట్రా అధ్యక్షుడు గోడం గణేష్, మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు గోడం రేణుక, ఉయిక ఇంద్ర, అర్క శేషరావు, కుమ్ర జ్ఞానేశ్వర్, సార్ మేడి సిడాం మాధవ్ పటేల్, కుమ్ర కృష్ణ, పెందోర్ జైతు ప టేల్, గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాఠశాలకు తరలివచ్చారు.

# పేదలకు ఉచిత వైద్య సేవలే మెగా హెల్త్ క్యాంప్ లక్ష్యం

**ఖానాపూర్ ఎమ్మెల్యే వెద్మ బొజ్జు పటేల్**




**ఉట్నూర్, సెప్టెంబర్ 3, (ప్రజా జ్యోతి)** పేదలకు ఉచిత వైద్యం అందించడమే మెగా హెల్త్ క్యాం ప్ లక్ష్యమని ఖానాపూర్ ఎమ్మెల్యే వెద్మ బొజ్జు పటేల్ అన్నారు. అదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్ లో గురువారం మెగా హెల్త్ క్యాంప్ అంగరంగ వైభవంగా ప్రారం భమైంది. హెడ్ సొసైటీ – ఉట్నూర్ ఆధ్వర్యంలో, ప్రతిమ ఫౌండేషన్ – కరీంనగర్ వారి సహకారంతో నిర్వహి స్తున్న ఈ ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఖానాపూర్ ఎ మ్మెల్యే వెడ్మా బోజ్జు పటేల్, ఉట్నూరు సర్పంచ్ అనిత శ్రీనివాస్ జాదవ్ తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ఘనంగా ప్రారంభించారు. వారితో పాటు హెడ్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు శ్రీకాంత్ జాదవ్, డైరెక్టర్ డాక్టర్.శ్రీనాథ్ నారాయణ, ఐటిడిఎ పిఓ మంద మకరందం, మాజీ జెడ్పీ ఛైర్ పర్సన్ జనార్ధన్ రాథోడ్ , మాజీ ఎంపీపీ పంద్రా జైవం త్ రావు, లక్కారం సర్పంచ్ అజ్మీరా రేణుక ,డిసిసి వైస్ ప్రసిడెంట్ చంద్రయ్య, పి ఎ సి ఎస్ చైర్మెన్ ఎస్. పి రెడ్డి, వార్డు సభ్యులు హెడ్ స్వ చ్ఛంద సంస్థ సభ్యులు పా ల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెద్మ బోజ్జు పటేల్ మాట్లాడుతూ గిరిజన ప్రాం తమైన ఉట్నూర్ లో ఇలాం టి మెగా హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేయడం ఎంతో అవసరమని, పేద, గిరిజన ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు ఉచితంగా అందడం గొప్ప విషయమని అన్నారు. హెడ్ సొసైటీ, ప్ర తిమ ఫౌండేషన్ చేస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలు అభినందనీయమని కొనియాడారు. ప్రజలందరూ ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.డైరెక్టర్ శ్రీ కాంత్ మాట్లాడుతూగత కొ న్నేళ్లుగా హెడ్ సొసైటీ ద్వా రా విద్య, వైద్య, సామాజిక రంగాల్లో అనేక సేవా కార్య క్రమాలు చేస్తున్నామని, ప్రతిమ ఫౌండేషన్ సహకారంతో ఈ రోజు ఉట్నూర్ ప్రజల కోసం ఈ మెగా హెల్త్ క్యాంప్ ను ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రజల ఆరోగ్యమే తమ లక్ష్యమని అన్నారు.

**క్యాంప్ లో సేవలు**

ఈ శిబిరంలో అనుభవజ్ఞు లైన వైద్యులచే బీపీ, షుగర్, గుండె, కంటి, దంత, స్త్రీల ఆరోగ్య పరీక్షలు, జనరల్ మెడిసిన్, ఆర్థోపెడిక్ పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తున్నారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నారు.ఈ కార్యక్ర మంలో ఉట్నూర్ సర్పంచ్ అనిత శ్రీనివాస్ జాదవ్, స్థా నిక ప్రజా ప్రతినిధులు, హెడ్ సొసైటీ, ప్రతిమ ఫౌండేషన్ సభ్యులు, వైద్య బృందం, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొ న్నారు.

# సెప్టెంబర్ 12న జాతీయ లోక్ అదాలత్.

**రాజీకి అవకాశం ఉన్న కేసులను పరిష్కరించుకోవాలి**

**-జిల్లా జడ్జి వీరయ్య.**




**మందమర్రి, సెప్టెంబర్ 03(ప్రజాజ్యోతి ):** ఈ నెల 12న శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు జిల్లా జడ్జి వీరయ్య తెలిపారు. లోక్ అదాలత్ సందర్భంగా రాజీకి అవకాశం ఉన్న కేసులను పరిష్కరించుకునేందుకు ప్రజలు ముందుకు రావాలని సూచించారు.కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న క్రిమినల్, సివిల్, చెక్ బౌన్స్ తదితర రాజీ చేయదగిన కేసులను లోక్ అదాలత్ ద్వారా సత్వరమే పరిష్కరించుకునే అవకాశం ఉందన్నా రు. ఇరుపక్షాల అంగీకారంతో కేసులను పరిష్కరించుకోవడం ద్వారా సమయం, ఖర్చు ఆదా అవుతుందని పేర్కొన్నారు.ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ కేసులను సామరస్యపూర్వకంగా పరిష్కరించుకోవాలని జిల్లా జడ్జి వీరయ్య సందేశం ఇచ్చారు.

# రైతు బాంధవుడు కేసీఆర్..

# రైతు ద్రోహి రేవంత్ రెడ్డి

**బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు వ్యాల హరీష్ రెడ్డి ధ్వజం**

**గోదావరిఖని**బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల్లో హామీలు అమలు చేయలేదని నిరసిస్తూ చేపట్టిన కార్యక్రమాల్లో భాగంగా రెండో రోజు పాలకుర్తి మండలం బసంత్‌నగర్ జీఎం గార్డెన్‌లో “వ్యవసాయ విధ్వంసం?22ఏ” అంశంపై రైతు సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు వ్యాల హరీష్ రెడ్డి మాట్లాడుతూ.. “రైతు బాంధవుడు కేసీఆర్.. రైతు ద్రోహి రేవంత్ రెడ్డి” అని విమర్శించారు. కేసీఆర్ హయాంలో రైతుబంధు, రైతుబీమా, 24 గంటల ఉచిత విద్యుత్‌తో పాటు సాగునీటి ప్రాజెక్టుల ద్వారా రైతులకు అండగా నిలిచారని అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం రైతుబంధు హామీని పూర్తిస్థాయిలో అమలు చేయలేదని, రైతుబీమాపై నిర్లక్ష్యం వహించిందని, యూరియా?డీఏపీ కోసం రైతులను ఇబ్బందులకు గురిచేస్తోందని ఆరోపించారు. యూరియా బస్తా ?270కు రావాల్సి ఉండగా బ్లాక్‌లో ?500 వరకు కొనాల్సిన పరిస్థితి వచ్చిందని, వరి కొనుగోళ్లలో కోతలు విధిస్తున్నారని విమర్శించారు.కేసీఆర్ పాలనలో నీళ్లు, కరెంటు, రైతుబంధు, సకాలంలో ఎరువులతో పాటు భూముల విలువ కూడా పెరిగిందని, ప్రస్తుతం పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయని హరీష్ రెడ్డి అన్నారు. రైతు కన్నీళ్లతో నడిచే ప్రభుత్వం ఎంతోకాలం నిలవదని, రాబోయే ఎన్నికల్లో రైతులు, అన్ని వర్గాల ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన సమాధానం చెబుతారని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్, మేకల సమ్మయ్య యాదవ్, అల్లం నారాయణ, బండారి ప్రవీణ్, జహీద్ భాషా, పోలాడి శ్రీనివాసరావు, బూరుగు వంశీకృష్ణ, బక్కి కిషన్,చొప్పరి శ్రీనివాస్, సార్ల ఉదయ్, ఎర్రవెల్లి శ్రీనివాసరావు, నూతి రాజకుమార్, కొండ సురేష్, పోయిల రవి, మేకల రామస్వామి, బొట్ల పోషం, గొర్రె శంకర్, గొర్రె నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎల్.ఐ .సి ప్రతిభ పోటీల్లో విజేతలు..

**జమ్మికుంట,** లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ సంస్థను స్థాపించి 70 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంలోనూ, ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరము కూడా ఎల్ఐసి వారోత్సవాల్లో భాగంగా జమ్మికుంట పట్టణములోని ప్రభుత్వ మరియు ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు క్విజ్ పోటీ పరీక్షలు స్థానిక జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల

# అతివలకు అండగా ఆదిలాబాద్ షీ టీం

**ఆగస్టు నెలలో 136 ఫిర్యా దులకు స్పందన**
**5 ఎఫ్ఐఆర్‌లు, 117 ఈ- పెట్టి కేసులు**
**163 హాట్‌స్పాట్లలో ఆకస్మిక తనిఖీలు 14 మందికి**
**కౌన్సెలింగ్ 2 బాల్యవివాహాలను అడ్డుకున్న షీటీం**
**జిల్లా వ్యాప్తంగా 48 అవగాహన కార్యక్రమాలు**
**ఉత్తమ ప్రతిభ కనబరిచిన షీ టీం సిబ్బందికి**
**ప్రశంస పత్రాలు, నగదు రివార్డులు**
**మహిళలు, విద్యార్థినుల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలి**
**జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్**





**ఆదిలాబాద్ బ్యూరో, సెప్టెంబర్ 3, (ప్రజా జ్యోతి )** ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తం గా మహిళలు, విద్యార్థినుల భద్రతకు షీ టీం బృందాలు నిరంతరం అతివలకు అండ గా పని చేస్తున్నాయని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీ ఎస్ తెలిపారు. ఆగస్టు నెల కు సంబంధించిన షీ టీం నె లవారీ నివేదికను విడుదల చేసిన అనంతరం గురువా రం జిల్లా పోలీస్ ప్రధాన కా ర్యాలయంలో పోలీస్ అక్క, షీ టీం సభ్యులతో సమావే శం నిర్వహించి పలు సూచ నలు చేశారు.ఆగస్టు నెలలో జిల్లా వ్యాప్తంగా షీ టీం బృం దాలకు 136 ఫిర్యాదులు అందగా, వాటిపై తక్షణమే స్పందించి బాధితులకు అవ సరమైన సహాయ సహకారా లు అందించారు. 117 ఈ- పెట్టి కేసులు, 5 ఎఫ్ఐఆర్ కేసులు నమోదు చేయడం తో పాటు 14 మందికి కౌన్సె లింగ్ నిర్వహించారు. మహి ళలు, విద్యార్థినులకు ఇ బ్బందులు కలిగించే ఆకతా యిలపై ప్రత్యేక నిఘా ఏర్పా టు చేసి చర్యలు చేపట్టారు. జిల్లా వ్యాప్తంగా 163 హాట్ స్పాట్లలో ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తూ మహిళలు, వి ద్యార్థినుల భద్రతను నిరంత రం పర్యవేక్షిస్తున్నారు. ఈ బాల్యవివాహాల నివారణపై ప్రత్యేక దృష్టి సారించిన షీ టీం బృందాలు ఆగస్టు నెల లో 2 బాల్యవివాహాలను అ డ్డుకోవడంలో కీలక పాత్ర పోషించాయి.బాల్యవివాహాలు జరగకుండా నిరంతరం పర్యవేక్షించాలని ఎస్పీ అధి కారులను ఆదేశించారు. మ హిళలు, చిన్నారులను వే ధించే ఆకతాయిలపై ఎలాం టి ఉపేక్ష లేకుండా చట్ట ప్రకా రం చర్యలు తీసుకోవాలని, అవసరమైన సందర్భాల్లో ఈ-పెట్టి కేసులు, ఎఫ్ఐఆర్ లు నమోదు చేయాలని ఎ స్పీ సూచించారు. పాఠశాల లు, కళాశాలలను ఎక్కువ గా సందర్శిస్తూ విద్యార్థుల తో మమేకమై వారి సమ స్యలను తెలుసుకోవాలని, వేధింపులను అరికట్టేందుకు ముందస్తు చర్యలు చేపట్టా లని తెలిపారు.మహిళలు, విద్యార్థినుల భద్రత, సైబర్ నేరాలు, మహిళలపై వేధిం పులు, బాల్యవివాహాల ని వారణ తదితర అంశాలపై జిల్లా వ్యాప్తంగా 48 అవ గా హన కార్యక్రమాలు నిర్వ హించారు. పాఠశాలలు, క ళాశాలల్లో విద్యార్థులకు సో షల్ మీడియా వినియోగం, వ్యక్తిగత సమాచార భద్రత, సైబర్ మోసాలపై అవగాహ న కల్పించారు.మహిళలు, విద్యార్థినులు సోషల్ మీడి యాలో అపరిచిత వ్యక్తుల తో వ్యక్తిగత సమాచారాన్ని పంచుకోకూడదని ఎస్పీ సూ చించారు. ఫోటోలు, వీడి యోలను దుర్వినియోగం చే సి బ్లాక్‌మెయిల్ లేదా వేధిం పులకు పాల్పడే వ్యక్తుల ప ట్ల అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి ఇబ్బంది ఎదురైనా భయపడకుండా వెంటనే పో లీసులను సంప్రదించాలని తెలిపారు.ఈ సందర్భంగా షీ టీం సభ్యులు, పోలీస్ అక్కల పనితీరును సమీ క్షించిన ఎస్పీ విధుల్లో ఉత్త మ ప్రతిభ కనబరిచిన సి బ్బందిని అభినందించారు. వారికి ప్రశంస పత్రాలు, న గదు రివార్డులు అందజేసి ప్రోత్సహించారు.మహిళలు, విద్యార్థినులకు అండగా షీ టీం బృందాలు నిరంతరం అందుబాటులో ఉంటాయ ని, అత్యవసర పరిస్థితుల్లో షీ టీం నెంబర్ 87126599 53 లేదా డయల్ 100/1 12కు సంప్రదించాలని సూ చించారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ పరిపాలన పి మౌనిక ఐపీఎస్, ఆదిలా బాద్ డిఎస్పీ ఎల్ జీవన్ రె డ్డి, ఎస్బిఐ డీఎస్పీ ఎం వెంక ట నరసయ్య, పట్టణ సిఐ లు, షి టీం బృంద సభ్యులు సుశీల, రోహిణి, లావణ్య, మహేష్, సిబ్బంది తదితరు లు పాల్గొన్నారు.

# యువత గొంతుకగా.. ఉప్పుల కృష్ణ ప్రత్యేక ముద్ర!

**ఆసిఫాబాద్ ఆర్సీ, సెప్టెంబర్03 (ప్రజాజ్యోతి):** ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండల కాంగ్రెస్ పార్టీ యువజన యూత్ అధ్యక్షుడు ఉప్పుల కృష్ణ.. రాజకీయాల్లో పదవి కంటే ప్రజలతో ఉండే అనుబంధానికే ప్రాధాన్యత ఇస్తూ ముందుకు సాగుతున్న యువ నాయకుడిగా తనదైన గుర్తింపు తెచ్చుకుంటున్నారు. యువత సమస్యలను తెలుసుకోవడం, కార్యకర్తలకు అందుబాటులో ఉండటం, పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనడం ద్వారా మండల రాజకీయాల్లో ప్రత్యేకంగా నిలుస్తున్నారని కాంగ్రెస్ శ్రేణులు చెబుతున్నాయి. యువతలో ఉన్న శక్తిని ప్రజాసేవకు వినియోగించాల నే ఆలోచనతో ఉప్పుల కృష్ణ ముందుకు సాగుతున్నారని ఆయన అనుచరులు పేర్కొంటున్నారు. రాజకీయాలు అంటే కేవలం ఎన్నికల సమయంలో కనిపించడం కాదని.. నిత్యం ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యలను తెలుసుకోవడమే నిజమైన నాయకత్వమనే భావనతో ఆయన పనిచేస్తున్నట్లు చెబుతున్నారు. మాటల్లో కాదు.. క్షేత్రస్థాయిలో చురుకుదనం పార్టీ కార్యక్రమం ఏదైనా, యువజన కార్యకర్తల భాగస్వామ్యం ఉండేలా సమన్వయం చేయడంలో ఉప్పుల కృష్ణ చొరవ చూపుతున్నారని పార్టీ వర్గాలు అంటున్నాయి. గ్రామాల్లో యువతతో సమావేశాలు నిర్వహించడం, పార్టీ కార్యక్రమాలపై అవగాహన కల్పించడం, కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రయత్నించడం వంటి కార్యక్రమాల్లో ఆయన ముందుంటున్నారని చెబుతున్నారు. యువత ఎదుర్కొంటున్న సమస్యలను రాజకీయ నాయకత్వం దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాల్లో యువకులు భాగస్వాములు కావాలని ప్రోత్సహించడం ఆయన నాయకత్వ శైలిలో ప్రత్యేకతగా పేర్కొంటున్నారు.

**కార్యకర్తలే బలం.. యువతే భవిష్యత్**

తన చుట్టూ ఉండే కార్యకర్తలను కేవలం అనుచరులుగా కాకుండా పార్టీకి బలమైన సైనికులుగా భావిస్తూ వారికి ప్రోత్సాహం అందిస్తున్నారని కాంగ్రెస్ శ్రేణులు చెబుతున్నాయి. ప్రతి కార్యకర్తకు గుర్తింపు రావాలని, యువతకు పార్టీలో మరిన్ని అవకాశాలు లభించాలని ఉప్పుల కృష్ణ కోరుకుంటున్నట్లు తెలిపారు. మండలంలోని మారుమూల గ్రామాల నుంచి కేంద్రం వరకు యువతను ఒకే వేదికపైకి తీసుకురావడం, పార్టీ కార్యక్రమాల్లో వారి భాగస్వామ్యాన్ని పెంచడం ద్వారా యువజన కాంగ్రెస్‌కు కొత్త ఉత్సాహం తీసుకురావాలనే లక్ష్యంతో ఆయన ముందుకు సాగుతున్నారని అనుచరులు పేర్కొంటున్నారు.

**భవిష్యత్‌పై ప్రత్యేక దృష్టి**

వాంకిడి మండలంలో యువత రాజకీయంగా చైతన్యవంతం కావడంతో పాటు, ప్రజా సమస్యల పరిష్కారంలో భాగస్వాములు కావాలన్నదే తన లక్ష్యమని ఉప్పుల కృష్ణ చెబుతున్నట్లు పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. రాబోయే రోజుల్లో మరింత మంది యువతను కాంగ్రెస్ పార్టీతో అనుసంధానం చేసి, గ్రామస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయడమే ధ్యేయంగా ఆయన పనిచేస్తున్నారని అంటున్నారు.హోదా కోసం కాదు.. బాధ్యత కోసం అడుగు.. మాట కోసం కాదు.. పని కోసం ముందడుగు.. యువత కోసం ఆలోచన.. పార్టీ కోసం అంకితభావం అనే విధంగా ఉప్పుల కృష్ణ తన రాజకీయ ప్రయాణాన్ని కొనసాగిస్తున్నారని కాంగ్రెస్ శ్రేణులు అభిప్రాయ పడుతున్నాయి.

